స్కాన్ చేయండి...
పేపర్ చదవండి...

www.rajamudranews.com

అక్షర
# రాజముద్ర

ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక
RNI No: TELTEL/2024/86684

బుధవారం | 07.05.2025 | సంపుటి : 2 | సంచిక :96 | పేజీలు : 8 | వెల : 2/-



విలేకరులు కావలెను

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 91824 74575




## దివాళా తీసింది కాంగ్రెస్

- నెలకు 20వేల కోట్ల ఆదాయం వస్తున్నా అదుపు లేదు
- సిఎం రేవంత్ వ్యాఖ్యలపై మండిపడ్డ ఈటెల రాజేందర్

02

### ఓబులాపురం మైనింగ్ కేసులో
# తుదితీర్పు

- గాలి జనార్ధన్ రెడ్డి తదితరులకు ఏడేళ్ల జైలు
- ఐదుగురిని దోషులుగా, ఇద్దరిని నిర్దోషులుగా ప్రకటించిన కోర్టు
- మాజీ మంత్రి సబితను నిర్దోషిగా ప్రకటించిన కోర్టు

ఓబులాపురం మైనింగ్ కేసులో నాంపల్లి సీబీఐ కోర్టు తుది తీర్పు వెలువరిం చింది. 15 ఏళ్ల పాటు సుదీర్ఘ విచారణ అనంతరం ఈ కేసులో మొత్తం ఐదుగురిని దోషులుగా, ఇద్దరిని నిర్దోషులుగా ప్రకటిం చింది. ఈ కేసులో ప్రధాన నిందితులైన గాలి జనార్దన్ రెడ్డి, బీవీ శ్రీనివాస రెడ్డి, మెఫజ్ అలీఖాన్, గనులశాఖ అప్పటి డైరెక్టర్ వీడీ రాజగోపాల్‌ను దోషులుగా నిర్ధారిస్తూ శిక్షలు ఖరారు చేసింది. గాలి జనార్దన్‌రెడ్డి సహా నలుగురికి ఏడేళ్ల పాటు జైలు శిక్ష ఖరారు చేసింది.



గాలి జనార్ధన్ రెడ్డి

02



### మిస్ వరల్డ్ పోటీలకు
# హైదరాబాద్ సిద్ధం

- సర్వాంగ సుందరంగా ముస్తాబవుతున్న నగరం
- అందాల పోటీలు తెలగాణకు గర్వమన్న మంత్రి జూపల్లి
- తెలంగాణ సంప్రదాయం నచ్చిందన్న మిస్ ఇండియా నందిని

**హైదరాబాద్, మే 6 :** మిస్ వరల్డ్ పోటీలకు హైదరాబాద్ సర్వాంగ సుందరంగా ముస్తాబవుతోంది. పోటీల్లో పాల్గొనేందుకు అందాలభామలు భాగ్యనగరానికి చేరుకుంటున్నారు. వందకు పైగా దేశాల నుంచి వచ్చే సుందరీమణులకు స్వాగతం పలికేందుకు శంషాబాద్ విమానాశ్రయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ నేపథ్యంలో మిస్‌వరల్డ్ పోటీలపై హైటెక్ సిటీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో

మిగతా 2 లో



## రోడ్డు ప్రమాద బాధితులకు ఊరట

- ఆస్పత్రుల్లో లక్షన్నర వరకు ఉచిత వైద్యం
- ఉత్తర్వులు జారీచేసిన కేంద్ర ప్రభుత్వం

03

### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
# ముక్కుసూటి మనిషి

- అప్పులు, అరాచకాలు ప్రజలకు తెలియాల్సి ఉంది
- గత ప్రభుత్వం నిర్వాకంపైనే సిఎం మాట్లాడారు
- ఉద్యోగుల రిటైర్మెంట్ ఎందుకు పెంచారో తెలియదా?
- కాళేశ్వరం కోసం లక్షకోట్లు ఎందుకు పెట్టారో తెలియదా
- మీడియా చిట్‌చాట్‌లో మంత్రి శ్రీధర్ బాబు



**హైదరాబాద్, మే 6 :**
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిముక్కు సూటి మనిషి అని.. గత ప్రభుత్వం చేసిన తప్పుల వల్ల ఇబ్బంది పడుతున్నామని గుర్తు చేశారని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. గత ప్రభుత్వ వైఫల్యాలు,అప్పులు, అరాచకాలు ప్రజలకు తెలియాల్సి ఉందని అందుకు సిఎం అలా మాట్లాడి ఉంటారని అన్నారు. మీడియాతో మంత్రి చీట్‌చాట్ నిర్వహించారు. బీజేపీ వాళ్లు దిగి పోండి అంటున్నారు.. బీజేపీ కేంద్రంలో పాలన చేతకాక పోతే దిగమను. పెహల్గం వైఫల్యంకి దిగిపో అనాలా.. బీజేపీ ఇచ్చిన ఒక్క హామీ అయినా నెరవేర్చారా..? మోడీ విదేశాలకు పోతే.. లక్షల కోట్ల పెట్టుబడులు వస్తాయా అని ప్రశ్నించారు. ప్రభుత్వాన్ని ఒకరిద్దరు బెదిరించినట్టు– మాట్లాడారు .. దానికి హార్ట్ అయ్యి ఉంటారన్నారు. హెలికాప్టర్ ప్రభుత్వం అద్దెకు తీసుకుందని.. మంత్రులు జిల్లాలు తిరిగితే... కార్ల కంటే హెలికాప్టర్ ఖర్చు తక్కువన్నారు. ఇప్పుడున్న హెలికాప్టర్ గత ప్రభుత్వం హయంలోనే అద్దెకు తీసుకున్నారని,వాళ్లు తిరగకుండా రెంట్ కట్టారని చెప్పారు... తాము వాడుతున్నట్లు వెల్లడించారు.

మిగతా 2 లో



04

సుప్రీంకోర్టు న్యాయమూర్తుల
## ఆస్తులు వెల్లడి

అత్యంత ధనవంతుడిగా ముందున్న జస్టిస్ విశ్వనాథన్



04

మెట్రో ఛార్జీల పెంపునకు
## రంగం సిద్ధం

నష్టాల నుంచి అధిగమించేందుకు చర్యలు



నగరంలో మరోమారు
## హైడ్రా దాడులు

- గచ్చిబౌలి సంధ్యాకన్వెన్షన్‌లో కూల్చివేతలు
- మైలార్‌దేవ్ పల్లిలోనూ ఆక్రమణల తొలగింపు

04



### 50 ఏళ్ల అవసరాల మేరకు
# రహదారుల నిర్మాణం



**ఆర్ఆర్ఆర్, రేడియల్ రోడ్ల పనులు వేగవంతం చేయాలి**

**ఆర్అండ్‌బీ శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం**

**హైదరాబాద్, మే 6 :**
రాబోయే 50 ఏళ్ల అవసరాలకు తగ్గట్టుగా రీజినల్ రింగ్‌రోడ్డు, రేడియల్‌రోడ్లు, ఇతర రహదారులను నిర్మించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఆయా రహదారులకు సంబంధించిన కూడళ్లు, అనుసంధాన రోడ్లు అందుకు అనుగుణంగా ఉండాలన్నారు. ఆర్అండ్‌బీ శాఖపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి సీఎం తన నివాసంలో మంగళవారం రాత్రి సమీక్ష నిర్వహించారు. ఆర్ఆర్ఆర్(సౌత్)కు సంబంధించిన ఎలైన్‌మెంట్‌ను పరిశీలించిన అనంతరం పలు మార్పులు చేపట్టాలని పేర్కొన్నారు. అలాగే హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిలో ఎలివేటెడ్ కారిడార్ నూతన ఎలైన్‌మెంట్‌కు సంబంధించి సూచనలు చేశారు. సీఎం మాట్లాడుతూ.. అటవీప్రాం తం, జలవనరులు, మండలకేంద్రాలు, గ్రామాల విషయంలో ముందుగానే లైడార్ సర్వే చేపట్టాలని ఆదేశించారు. ఎలైన్‌మెంట్ విషయంలో అనవసర అపోహలకు, పొరపాట్లకు తావివ్వరాదన్నారు. శాటిలైట్ టౌన్‌షిప్‌లు, పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు అనుగుణంగానే రేడియల్ రోడ్ల నిర్మాణ ప్రణాళికలు రూపొందించాలన్నారు.

మిగతా 2 లో

### కాంగ్రెస్ ఖేల్ ఖతం..
# దుకాణం బంద్

- ప్రభుత్వాన్ని నడిపే స్థితిలో లేని రేవంత్
- ఆయన వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనం
- కేంద్ర మంత్రి బండి సంజయ్



**రాజన్నసిరిసిల్ల, మే 6 :** ఇచ్చిన హామీలను నెరవేర్చలేక కాంగ్రెస్ చేతులెత్తేసిందని, సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై బీజేపీ నేత, కేంద్ర మంత్రి బండి సంజయ్ తీవ్రంగా స్పం దించారు. సిఎం రేవంత్ వ్యాఖ్యలతో ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ ఖేల్ ఖతం, దుకాణ్ బంద్ అంటూ బండి సంజయ్ వ్యాఖ్యానించారు. సీఎం స్వయంగా చేసిన వ్యాఖ్యలే వారి వైఫల్యానికి నిదర్శనమని ఆయన విమర్శించారు.

మిగతా 2 లో



## ఆర్టీసీ సమ్మె వాయిదా

- ముగ్గురు ఐఎఎస్‌లతో కమిటీ
- మంత్రి పొన్నం ప్రభాకర్‌తో చర్చల అనంతరం జేఏసీ వెల్లడి

03

### రేవంత్‌రెడ్డివి దివాళాకోరు
# మాటలు



- సిఎం అనుభవ రాహిత్యం బయటపడుతోంది
- కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేస్తోంది
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రవిమర్శలు

**హైదరాబాద్, మే 6 :**
తెలంగాణ రాజకీయ వేడి మరోసారి పెరిగింది. సిఎం రేవంత్ వ్యాఖ్యలపై దుమారం రేగుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. వ్యక్తిగత దూషణలు, విమర్శలు వచ్చినా సహించామని, కానీ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యోగ సంఘాల నేతలపై ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలు తట్టుకోలేక ఈ ప్రెస్ మీట్ ఏర్పాటు చేయాల్సి వచ్చిందని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ సాధనలో విద్యార్థులు, ఉద్యోగ సంఘాల నాయకులు పార్టీలకతీతంగా పాల్గొన్నా వాస్తవాన్ని గుర్తుచేస్తూ, అలాంటి నేతలపై ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలు బాధాకరంగా ఉన్నాయని అన్నారు. రేవంత్ రెడ్డి మాట్లాడుతున్న తీరు ఆయన పాలనాపరమైన అనుభవ లేకపోయినదాని సూచనగా ఉందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అబద్ధాలుగా తేలిపోయాయని, తాము ఎప్పటి నుంచో ఢిల్లీ పార్టీలను నమ్మరాదని చెబుతున్నామని,

మిగతా 2 లో

అక్షర రాజముద్ర
www.rajamudranews.com
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక



# 50 ఏళ్ల అవసరాల మేరకు రహదారుల నిర్మాణం

(మొదటిపేజీ తరువాయి)

ఓఆర్ఆర్ నుంచి ఆర్ఆర్ఆర్ వరకు రేడియల్ రోడ్లు నిర్మాణ పనుల ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. హైదరాబాద్ మీదుగా వెళ్లే జాతీయ, రాష్ట్ర రహదారులు ఆర్ఆర్ఆర్ వెలుపలికి వెళ్లే ప్రాంతంలో ట్రంపెట్స్ నిర్మించాలన్నారు. రాజీవ్ రహదారికి ప్రత్యామ్నాయంగా ఓఆర్ఆర్ నుంచి మంచిర్యాల వరకు నూతన రహదారి నిర్మాణానికి సంబంధించి ప్రత్యామ్నాయ ఎలైన్‌మెంట్‌ను వీలైనంత తొందరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఆ మార్గంలో పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు గల అనుకూలతలను పరిశీలించి నివేదిక రూపొందించాలన్నారు. నూతన రహదారులకు సంబంధించి జాతీయ రహదారులశాఖ అధికారులతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలని అధికారులకు సూచించారు. సమీక్షలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, సీఎం ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సీఎం కార్యదర్శి మాణిక్‌రాజ్, ఆర్అండ్‌బీ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి వికాస్‌రాజ్, ప్రత్యేక కార్యదర్శి హరిచందన, పురపాలకశాఖ కార్యదర్శి ఇలంబర్తి, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, పరిశ్రమలు, పెట్టుబడుల విభాగం అదనపు సీఈవో నరసింహారెడ్డి, జాతీయ రహదారుల విభాగం ప్రాంతీయ అధికారి శివశంకర్ పాల్గొన్నారు.

# మిస్ వరల్డ్ పోటీలకు హైదరాబాద్ సిద్ధం

(మొదటిపేజీ తరువాయి)

మంత్రి జూపల్లి కృష్ణారావు, మిస్ వర్లడ్ సీఈవో జూలియా, మిస్ఇండియా వరల్డ్ నందిని గుప్తా, పటేల్ రమేశ్ రెడ్డి, జయేశ్ రంజన్, సోనూసూద్ తదితరులు పాల్గొని మాట్లాడారు. తెలంగాణలో మిస్ వరల్డ్ పోటీలు జరగడం రాష్ట్రానికి గర్వకారణమని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఈ పోటీల కోసం వస్తున్న ప్రతి ఒక్కరికీ గొప్ప అనుభూతిని పంచేలా ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. మిస్ వరల్డ్ గ్లోబల్ యూనిట్‌కి వేదిక అన్న ఆయన.. మన రాష్ట్ర సంప్రదాయం, పర్యాటక ప్రాముఖ్యతను ప్రపంచానికి చాటేందుకు ఇదో చక్కని అవకాశమన్నారు. పర్యాటకశాఖ కార్యదర్శి జయేశ్ రంజన్ మాట్లాడుతూ.. తెలంగాణ ఆహారం, సంస్కృతి, పర్యాటకాన్ని ప్రపంచానికి చాటేందుకు ఈ పోటీలు దోహదం చేయనున్నాయన్నారు. విదేశీ పర్యాటకులను ఆకట్టుకొనేందుకు ఇదో మంచి అవకాశం. అందరం కలిసి ఈ పోటీలను విజయవంతం చేయాలి. వీవీఐపీల కోసమే అందాల పోటీలు అనే అభిప్రాయం లేకుండా సామాన్యులు సైతం హాజరయ్యేందుకు అవకాశం కల్పిస్తున్నాం. ఈ పోటీలను తిలకించాలనే ఆసక్తి ఉన్నవారు పర్యాటక శాఖ అధికారిక వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని జయేశ్ రంజన్ సూచించారు. ఇండియా మిస్ వరల్డ్ 2025 పోటీలకు ప్రాతినిథ్యం వహిస్తున్న మిస్ ఇండియా నందిని గుప్తా తనను హైదరాబాద్ బిర్యానీ, ఇరానీ చాయ్ కట్టి పడేశాయని తెలిపారు. తనకు తెలంగాణ ఎంతగానో నచ్చిందని, ఇక్కడ గొప్ప చరిత్ర ఉందని కొనియాడారు. కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీతో ఫాస్ట్ గా డెవలప్ అవుతున్న సిటీ- హైదరాబాద్ అని పేర్కొన్నారు. మిస్ వరల్డ్ పోటీల కోసం వచ్చిన నందిని గుప్తా.. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను గురించి తెలుసుకుని సంబురపడ్డారు. ఇప్పటికే తెలంగాణలోని పలు చారిత్రక కట్టడాలు, ఆలయాలు, పర్యాటక స్థలాలను సందర్శించారు. పోచంపల్లి హ్యాండ్లూమ్స్ తనకు ఎంతో నచ్చాయని ఈ సందర్భంగా ఆమె తెలిపారు. యాంగెస్ట్ స్టేట్ అయినా కూడా ఇక్కడ హాస్పటాలిటీ బాగుందని కొనియాడారు. 'అందరికి నమస్కారం.. తెలంగాణకు తప్పకుండా రండి..' అంటూ తెలుగులో మాట్లాడారు నందిని గుప్తా. తెలంగాణ గురించి మాట్లాడిన ప్రతిసారి తనకు గొప్ప అనుభూతి కలుగుతుందని మిస్ ఇండియా నందిని గుప్తా అన్నారు. ఇక్కడి సంస్కృతి, అభివృద్ధి ఎంతో గొప్పగా ఉంటాయన్నారు. హైదరాబాద్ ఎంతో వేగంగా అభివృద్ధి చెందుతోందన్న ఈ అందాల భామ.. ఇక్కడి ప్రజలు ప్రేమను పంచుతున్నారన్నారు. హైదరాబాదీ బిర్యానీ నుంచి ఇరానీ చాయ్ వరకు ఆహారం అద్భుతంగా ఉటుందని చెప్పారు. పోటీ-ల్లో పాల్గొనే ప్రతి యువతి ఒక గొప్ప లక్ష్యంతో ముందడుగు వేస్తున్నారని చెప్పారు.

## హోంశాఖ ఆదేశాలతో
# నేడు మాక్ డ్రిల్
### హైదరాబాద్‌లోని పలుప్రాంతాల్లో నిర్వహణ

**హైదరాబాద్, మే 6 :** భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఉద్రికత్త వాతావరణం నెలకొంది. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లోని నాలుగు ప్రాంతాల్లో మాక్ డ్రిల్‌ను రక్షణ శాఖ బృందాలు నిర్వహించనున్నాయి. బుధవారం సాయంత్రం నాలుగు గంటలకు సికింద్రాబాద్ కంటోన్మెంట్, గోల్కొండ, కంచన్ బాగ్, మల్లాపూర్‌లోని ఎన్ఎఫ్‌సీలలో ఈ మాక్ డ్రిల్ నిర్వహించనున్నారు. ఈ మేరకు రక్షణ శాఖ ఉన్నతాధికారులు మంగళవారం వెల్లడించారు. పహల్గామ్ దాడి అనంతరం పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా పలు కీలక నిర్ణయాలను భారత్ తీసుకుంది. సింధు జాలాల ఒప్పందాన్ని భారత్ రద్దు చేసింది. దీంతో పాక్‌కు చుక్క నీరు వెళ్లడం లేదు. అలాగే భారత్ గగనతరంలో పాక్ విమానాలను నిషేధించింది. ఇక పాకిస్థాన్‌ను అష్టదిగ్బంధం చేసేందుకు భారత్ ఎన్ని ప్రయత్నాలు చేయాలో.. అన్నింటిని చేస్తోంది. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాక్‌ను ఏకాకిని చేసేందుకు భారత్ తన ప్రయత్నాలను తీవ్రతరం చేసింది. మరోవైపు ప్రధాని మోదీ.. త్రివిధ దళాల అధిపతులతో వరుసగా సమావేశమయ్యారు. సోమవారం రక్షణ శాఖ కార్యదర్శితో సైతం ప్రధాని మోదీ సమావేశమైయ్యారు. ప్రధాని మోదీ ఇలా వరుస భేటీలతో.. పాకిస్థాన్‌పై భారత్ కీలక నిర్ణయం తీసుకుంటుందనే చర్చ జరుగుతోంది. అదీకాక.. దేశవ్యాప్తంగా మాక్ డ్రిల్ నిర్వహించాలని కేంద్రం ఇప్పటికే అన్ని రాష్ట్రాలను ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తెలంగాణలోని హైదరాబాద్‌లో బుధవారం సాయంత్రం 4.00 గంటలకు ఈ మాక్ డ్రిల్ నిర్వహించనున్నారు. ఇంకోవైపు ఢిల్లీ, ముంబయి, చెన్నై తదితర నగరాలతోపాటు- 259 ప్రదేశాల్లో మెగా సెక్యూరిటీ- డ్రిల్ నిర్వహించనున్నారు.

# కర్రెగుట్టల్లో మరోసారి ఎదురుకాల్పులు
### మహిళా మావోయిస్టు మృతి

**చర్ల :** తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో బీజాపుర్ జిల్లా ఊసూరు ఠాణా పరిధిలో కొనసాగుతున్న కూంబింగ్‌లో భాగంగా భద్రతా బలగాలు కర్రెగుట్టలను జల్లెడ పడుతున్నాయి. సోమవారం జరిగిన ఎదురుకాల్పుల్లో ఓ మహిళా మావోయిస్టు మృతి చెందినట్లు బస్తర్ ఐజీ సుందర్‌రాజ్ మంగళవారం ప్రకటించారు. మావోయిస్టు అగ్రనేతలే లక్ష్యంగా ఏప్రిల్ 22 నుంచి ఈ ఆపరేషన్ కొనసాగుతోంది. "సీఆర్పీఎఫ్, బీఎస్ఎఫ్, ఐటీబీపీ, సీఏఎఫ్, డీఆర్జీ, బస్తర్ ఫైటర్స్ బలగాలు కూంబింగ్ నిర్వహిస్తుండగా ఇరువర్గాల మధ్య ఎదురు కాల్పులు చోటుచేసుకున్నాయి. కాల్పుల అనంతరం మహిళా మావోయిస్టు మృతదేహంతోపాటు 303 రైఫిల్, వందల కిలోల పేలుడు పదార్థాలు, రేషన్, మందులను స్వాధీనం చేసుకున్నాం. ఈ ప్రాంతంలో పలువురు మావోయిస్టులు మరణించడమో, గాయపడటమో జరిగినట్లు అక్కడి ఆనవాళ్లను బట్టి తెలుస్తోంది. మిగిలిన వారి కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశాం" అని ఐజీ సుందర్‌రాజ్ వివరించారు.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముక్కుసూటి మనిషి

(మొదటిపేజీ తరువాయి)

సీఎం ఆవేదనతో మాట్లాడటానికి గల కారణాన్ని మంత్రి శ్రీధర్ బాబు చెప్పుకొచ్చారు. ప్రజా సంక్షేమం కోసం ఆలోచించి సీఎం మాట్లాడారు. చిన్నాభిన్నం చేసిన ఆర్థిక విధానం చూసి ఆవేదనతో మాట్లాడారు. నేను ఇచ్చిన మాట ప్రకారం అన్ని పనులు చేయాలి ... డబ్బులు లేవనే ఆవేదన సీఎంలో ఉంది. బీఆర్ఎస్ వాళ్లకు పేగు బంధం ఉంటే... జీతాలే సరిగా వేయలేదు. వాళ్లకు ప్రేమ ఉన్నట్టా..? మేం రాగానే డీఏ ఇచ్చాం. వాళ్ళలాగా మేము వదిలేయలేదు. కార్పొరేషన్ పేరుతో తెచ్చిన అప్పులు కూడా ప్రభుత్వమే కడుతుంది. కేటీఆర్.. ప్రభుత్వం చేసిన అప్పుల గురించే మాట్లాడుతున్నారని మంత్రి వ్యాఖ్యానించారు. తెలంగాణలో రాజకీయాలు ప్రస్తుతం ఆర్థిక పరిస్థితులు, అందాల పోటీలపై మంత్రి శ్రీధర్ బాబు చేసిన వ్యాఖ్యలు తీవ్ర చర్చలకు దారితీస్తున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముక్కుసూటిగా మాట్లాడే వ్యక్తి అని పేర్కొన్నారు. ఆయన విషయాలను ఉన్నది ఉన్నట్టుగా చెప్తారని, అందువల్ల ఆయనపై అనవసరమైన ఆరోపణలు చేయడం సరైంది కాదని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ ఆర్థిక తప్పిదాలను సరిచేస్తున్నామని సీఎం చెప్పడం, రాష్ట్రానికి అవసరమైన మార్పులు తీసుకురావడంలో ఆయన తీవ్రంగా కృషి చేస్తున్నారని మంత్రి అభిప్రాయం వ్యక్తం చేశారు. బీజేపీ ప్రభుత్వంపై మంత్రి శ్రీధర్ బాబు విమర్శలు చేస్తూ, ఈ పార్టీకి పాలించే అర్హత ఎక్కడ ఉందని ప్రశ్నించారు. ఏ వ్యవస్థను కూడా హ్యాండిల్ చేయని బీజేపీకి పాలించే అర్హత ఎక్కడిదన్నారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు రిటైర్మెంట్ బెనిఫిట్ ఇవ్వాల్సి వస్తుందని బీఆర్ఎస్ ప్రభుత్వమే ఉద్యోగుల పదవి విరమణ వయస్సు పెంచారని గుర్తు చేశారు. మాకు ప్రభుత్వాన్ని నడిపే సత్తా ఉందో లేదో ప్రజలకి తెలుసని ఆయన అన్నారు. ఇది, ప్రభుత్వానికి ఉన్న బాధ్యతలను, ఉద్యోగుల సంక్షేమాన్ని గుర్తు చేస్తుందన్నారు. అందాల పోటీల గురించి మాట్లాడుతూ ఇవి అందానికి సంబంధించినవి కాదన్నారు. వ్యక్తిత్వానికి సంబంధించినవని మంత్రి చెప్పారు. అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణకు పేరుతెచ్చే అందాల పోటీలను గౌరవంగా భావించడం, రాష్ట్రానికి ఉన్న ప్రత్యేకతను ప్రదర్శించడంలో సహాయపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. కవిత మాట్లాడిన అంశాలపై కూడా మంత్రి శ్రీధర్ బాబు స్పందిస్తూ, ఆమె బీఆర్ఎస్ స్ట్రాటజీ ప్రకారమే మాట్లాడుతుందన్నారు. బీఆర్ఎస్ నేతలెప్పుడూ మాకు ప్రత్యర్థులేనని, కులగణన, ఎస్సీ వర్గీకరణ చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం సామాజిక న్యాయం చేయడం లేదంటే ఎవరైనా నమ్ముతారా అని ప్రశ్నించారు. దీంతోపాటు- స్మితా సబర్వాల్ పై మాకు ఎలాంటి కక్ష్య లేదన్నారు. మాకు అయినా, అధికారులకు అయినా కొన్ని నిబంధనలు ఉంటాయన్నారు. అందాల పోటీల ఖర్చుకు, ఉద్యోగస్థుల సమస్యకు ఏంటి సంబంధమని ప్రశ్నించారు. తెలంగాణ గురించి అనేక మందికి తెలియజేయాలనేదే సీఎం ఉద్దేశమని, ఈ క్రమంలో అందా పోటీల గురించి ఆరోపణలు చేయడం సరికాదన్నారు. రాష్ట్రాన్ని దివాళా తీయించింది కేసీఆర్ అని.. దాని నుంచి బయట పడేసే పని మేము చేస్తున్నామని శ్రీధర్ బాబు అన్నారు. సెక్రటేరియట్ హోం ఐతే.. వాళ్ళు ఉండేది ఫార్మ్ హౌసా..? ఉద్యోగస్తులు మా సోదరులు.. మా మిత్రులే. ఆలస్యం అయినా.. అన్ని సమస్యలు పరిష్కారం చేస్తాం. తెలంగాణ లోనే కాదు..దేశ వ్యాప్తంగా ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా ఉంది. అయినా.. వనరులు పెంచి.. నిధులు తెచ్చే పనిలో ఉన్నాం. లక్ష కోట్లు తెచ్చి కాళేశ్వరంలోనే పెట్టారు కేసీఆర్. అప్పులు.. చెప్పకపోతే ప్రజలకు తెలియాలి కదా. మేము యువతకు ఉద్యోగాలు ఇవ్వాలని ఆలోచనతో ఉన్నామని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. మవోయిస్టుల ఎన్‌కౌంటర్లపై మంత్రి శ్రీధర్‌బాబు స్పందించారు. మావోయిస్టులతో మా కుటుంబానికి అన్యాయం జరిగింది. కానీ ఇంకో కుటుంబానికి అన్యాయం జరగొద్దనేది మా ఆలోచన. శాంతి చర్చలు కోరడం తప్పు కాదు. మా ప్రభుత్వమే గతంలో మావోయిస్టుల తో చర్చ చేసిందని గుర్తు చేశారు.



# రేవంత్ రెడ్డిని కలిసిన స్విట్జర్లాండ్ రాయబారి

**హైదరాబాద్, మే 6 :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని స్విట్జర్లాండ్ రాయబారి శ్రీమతి మాయా తిస్సాఫీ మర్యాదపూర్వకంగా కలిసారు. మంగళవారం హైదరాబాద్‌కు వచ్చిన ఆమె సిఎను ఆయన నివాసంలో కలిసారు. ఈసందర్భంగా సిఎం ఆమెకు శాలువా కప్పి మెమెంటో బహుకరించారు. ఇక్కడ అందాల పోటీలు నిర్వహించడంపై అభినందించారు.

# బలూచిలో భారీ పేలుడు
### ఏడుగురు పాక్ జవాన్ల మృతి

**ఇస్లామాబాద్, మే 6 :** పాకిస్థాన్ లోని బలూచిస్థాన్‌లో భారీ పేలుడు సంభవించింది. దక్షిణ బలూచిస్తాన్ ప్రావిన్స్‌లో పాకిస్తాన్ ఆర్మీ వాహనాన్ని లక్ష్యంగా చేసుకుని దుండగులు భారీ ఐఈడీ బాంబ్‌ను పేల్చారు. ఈ ఘటనలో ఏడుగురు పాక్ జవాన్లు మృతి చెందగా.. మరికొందరు సైనికులు తీవ్రంగా గాయపడ్డారని వార్తా సంస్థ రాయిటర్స్ నివేదించింది. ఈ దాడికి ఇంకా ఏ సంస్థ బాధ్యత వహించలేదు. సమాచారం అందుకున్న అధికారులు ఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు మొదలుపెట్టారు. ఏప్రిల్ 15న బలూచిస్తాన్ ప్రావిన్స్‌లో పోలీసు ట్రక్కును లక్ష్యంగా చేసుకుని భారీ పేలుడు సంభవించిన విషయం తెలిసిందే. ఈ పేలుడులో పేలుడులో ముగ్గురు వ్యక్తులు మరణించగా, 19 మంది గాయపడ్డారు. ఈ ఘటన మురవకముందే మరోసారి ఆర్మీ వాహనమే లక్ష్యంగా అలాంటి తరహా దాడే జరిగింది. ఈ ఘటనపై పాక్ ఆర్మీ విచారణ మొదలుపెట్టింది.

# దివాళా తీసింది కాంగ్రెస్

- నెలకు 20వేల కోట్ల ఆదాయం వస్తున్నా అదుపు లేదు
- సిఎం రేవంత్ వ్యాఖ్యలపై మండిపడ్డ ఈటెల రాజేందర్



**హైదరాబాద్, మే 6 :** తెలంగాణ దివాళా తసిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మాజీ మంత్రి, బిజెపి ఎంపి ఈటల రాజేందర్ ఫైరయ్యారు. దీవాళా తీసింది తెలంగాణ కాదు.. కాంగ్రెస్ దివాళ తీసిందని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి తాను సిఎం అని మర్చిపోయి మాట్లాడుతున్నారని ఈటల విమర్శించారు. నెలకు దాదాపు రూ.20 వేల కోట్ల ఆదాయం వస్తుంటే.. దివాళ తీసిందని ఎలా అంటారని మండిపడ్డారు. తెలంగాణ ఎన్నడూ పేద రాష్ట్రం కాదని.. ఇప్పటికీ దేశంలోనే తెలంగాణ ధనిక రాష్ట్రమని ఆయన అన్నారు. మళ్లీ అధికారంలోకి వచ్చేది లేదని కాంగ్రెస్ నాయకులు దోచుకుంటు-న్నారని ఆరోపించారు. హామీలు ఇచ్చినప్పుడు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తెల్వదా? అంటూ ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై రాహుల్ గాంధీ, సోనియా గాంధీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణకు శనిలా దాపురించిందని విమర్శించారు. కాగా, ప్రభుత్వ ఉద్యోగులు తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సమ్మెకు సిద్ధమవుతున్న క్రమంలో రేవంత్ రెడ్డి మాట్టాడుతూ.. తెలంగాణ దివాళా తీసిందని.. బయట ఒక్క రూపాయి అప్పు పుట్టడం లేదన్నారు. తెలంగాణ ప్రతినిధులను దొంగలు చూసినట్లు- చూస్తున్నారని.. తనను కోసినా ఒక్క రూపాయి కూడా ఎక్కువ రాదన్నారు. వచ్చే ఆధాయం మొత్తం ఉద్యోగుల జీతాలు, సంక్షేమ పథకాలు, పించన్లకే సరిపోతుందని తేల్చి చెప్పారు. అయితే, సిఎం మాటలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. ఆయన వ్యాఖ్యలపై ప్రతిపక్షాలు తీవ్ర విమర్శలు చేస్తున్నాయి. హైదరాబాద్: తెలంగాణ ఎన్నడూ పేద రాష్ట్రం కాదని.. నాయకులు వెనుకబడేసిన ప్రాంతమని భాజపా ఎంపీ ఈటల రాజేందర్ (ఊశషశశె శిఃశస) అన్నారు. స్వాతంత్ర్యానికి పూర్వమే ఈ ప్రాంతంలో రైల్వే, విద్యుత్, -టె-లిఫోన్ సౌకర్యాలు ఉన్నాయని చెప్పారు. ఒక వ్యక్తిని, ఒక పార్టీని దోషిగా నిలబెట్టేందుకు తెలంగాణను దివాలా రాష్ట్రంగా చూపొద్దన్నారు. సోమవారం ఓ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యల నేపథ్యంలో ఈటల ఈ విధంగా స్పందించారు. నాంపల్లిలోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 'తెలంగాణ దివాలా తీసిన రాష్ట్రమని సీఎం రేవంత్ పేర్కొనడం సరికాదు. ధాన్యం దిగుబడి, జీఎస్‌డీపీ, వృద్ధిరేటు-, అత్యధిక బడ్జెట్‌స్థాయి వంటి అంశాల్లో అగ్రస్థానంలో ఉంది. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని సీఎం ధ్వంసం చేస్తున్నారు. కొత్త రాష్ట్రమే అయినా తడబాటు- లేకుండా గొప్పగా పురోగమిస్తున్నామని గతంలోనే చెప్పాను. 2014లోనే తెలంగాణ సొంత పన్నుల ఆదాయం రూ.29వేల కోట్లు-. ఏటా రూ.5వేల కోట్ల నుంచి రూ.10వేల కోట్ల ఆదాయం పెరిగేది. 2023-24లో రూ.1.19లక్షల కోట్ల ఆదాయం రాష్ట్రానికి వచ్చింది. పన్నేతర ఆదాయం కూడా 2014లోనే రూ.6వేల కోట్లు-.. 2023-24లో రూ.20వేల కోట్లు- ఉంది. కేంద్రం పంపిణీ చేసే పన్నుల ఆదాయం కూడా క్రమంగా పెరుగుతోందని ఈటల రాజేందర్ వివరించారు.

# భారత్-బ్రిటన్ మధ్య వాణిజ్య ఒప్పందం
### చారిత్రాత్మక ఒప్పందపై మోడీ హర్షం

**న్యూఢిల్లీ, మే 6 :** భారత్-బ్రిటన్ మధ్య చారిత్రాత్మక వాణిజ్య ఒప్పందం కుదిరింది. ఇరు దేశాలు ఎంతో కాలంగా ఎదురుచూస్తోన్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ఎట్టకేలకు కుదిరింది. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై ఇరుదేశాలు సంతకం చేశాయి. ఈ విషయాన్ని ప్రధాని మోడీ స్వయంగా వెల్లడించారు. ఈ మేరకు సోషల్ మీడియా ఫ్లాట్‌ఫామ్ ఎక్స్ వేదికగా ట్వీట్ చేసిన మోడీ.. భారత్-బ్రిటన్ మధ్య చారిత్రాత్మక వాణిజ్య ఒప్పందం కుదరడంపై హర్షం వ్యక్తం చేశారు. భారత్-బ్రిటన్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం విజయవంతంగా కుదిరింది. ఈ అగ్రిమెంట్ రెండు దేశాలకు లాభాదాయకం. బ్రిటన్‌తో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం చారిత్రాత్మక మైలురాయి. ఇది మా సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింతగా పెంచుతుంది. రెండు దేశాల మధ్య వాణిజ్యం, పెట్టు-బడి, వృద్ధి, ఉద్యోగ సృష్టి, ఆవిష్కరణలను ఉత్ప్రేరకపరుస్తుందని ప్రధాని మోడీ పేర్కొన్నారు.

# ఓబులాపురం మైనింగ్ కేసులో తుదితీర్పు

- గాలి జనార్ధన్ రెడ్డి తదితరులకు ఏడేళ్ల జైలు
- ఐదుగురిని దోషులుగా, ఇద్దరిని నిర్దోషులుగా ప్రకటించిన కోర్టు
- మాజీ మంత్రి సబితను నిర్దోషిగా ప్రకటించిన కోర్టు



**హైదరాబాద్, మే 6 :** ఓబుళాపురం మైనింగ్ కేసులో నాంపల్లి సీబీఐ కోర్టు తుది తీర్పు వెలువరించింది. 15 ఏళ్ల పాటు సుదీర్ఘ విచారణ అనంతరం ఈ కేసులో మొత్తం ఐదుగురిని దోషులుగా, ఇద్దరిని నిర్దోషులుగా ప్రకటించింది. ఈ కేసులో ప్రధాన నిందితులైన గాలి జనార్ధన్ రెడ్డి, బీవీ శ్రీనివాస రెడ్డి, మెఫజ్ అలీఖాన్, గనులశాఖ అప్పటి డైరెక్టర్ వీడీ రాజగోపాల్‌ను దోషులుగా నిర్ధారిస్తూ శిక్షలు ఖరారు చేసింది. గాలి జనార్ధన్‌రెడ్డి సహా నలుగురికి ఏడేళ్ల పాటు జైలు శిక్ష ఖరారు చేసింది. అలాగే, దోషులకు రూ.10వేలు చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది. ఓబుళాపురం మైనింగ్ కంపెనీకు రూ.2 లక్షలు జరిమానా విధించింది. ఈ కేసులో అప్పటి గనులశాఖ మంత్రిగా ఉన్న సబితా ఇంద్రారెడ్డికి ఉపశమనం లభించింది. ఆమెతో పాటు అప్పటి పరిశ్రమల శాఖ కార్యదర్శి కృపానందంను సీబీఐ కోర్టు నిర్దోషులుగా ప్రకటించింది. ఈ కేసులో వీడీ రాజగోపాల్‌కు అదనంగా మరో నాలుగేళ్లు జైలు శిక్ష విధించింది. భూగర్భ గనుల శాఖ డైరెక్టర్‌గా ఉన్నందున అవినీతి నిరోధక చట్టం కింద ఆయనకు అదనపు శిక్షను ఖరారు చేసింది. ప్రభుత్వ అధికారిగా ఉంటూ అక్రమాలకు పాల్పడినందున మొత్తంగా 11 ఏళ్ల పాటు అతడికి జైలు శిక్ష పడింది. ఈ కేసులో ఏ2గా ఉన్న కర్ణాటక మాజీ మంత్రి గాలి జనార్దన్ రెడ్డికి ఏడేళ్ల జైలు శిక్ష విధించింది. గాలి జనార్దన్ రెడ్డితో సహా నలుగురికి ఏడేళ్ల జైలు శిక్ష విధించింది. ప్రస్తుతం గాలి జనార్దన్ రెడ్డి కర్ణాటకలోని గంగావతి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఓబులాపురం మైనింగ్ కేసులో ఆయనకు ఏడేళ్ల జైలు శిక్ష ఖరారు కావడంతో ఆయనపై అనర్హత వేటు పడే అవకాశం ఉంది. 'కల్యాణ రాజ్య ప్రగతి పక్ష' అనే పొలిటికల్ పార్టీని స్థాపించి 2023 కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో గాలి జనార్దన్ రెడ్డి గంగావతి నుంచి పోటీ చేసి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత మళ్లీ బీజేపీలో చేరిపోయారు. అయితే.. సీబీఐ కోర్టు వెలువరించిన తీర్పును ఉన్నత న్యాయస్థానాల్లో సవాల్ చేసే అవకాశం కూడా ఉంది. ఇకపోతే ఓఎంసీ కేసులో గాలి జనార్దన్ రెడ్డి ఇప్పటికే కొంత కాలం జైలు జీవితం గడిపిన సంగతి తెలిసిందే. ఓబులాపురం మైనింగ్ కేసులో విచారణ దాదాపు 13 ఏళ్లకు పైగానే సాగింది. 3,,400 డాక్యుమెంట్లను పరిశీలించి, 219 మంది సాక్ష్యులను విచారించి.. కర్ణాటక ఫారెస్ట్ ల్యాండ్స్‌లో గాలి బ్రదర్స్ మైనింగ్ తవ్వకాల వల్ల 884.13 కోట్ల రూపాయలను రాష్ట్రం నష్టపోయిందనే ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి సీబీఐ కోర్టు తుది తీర్పు వెల్లడించడం గమనార్హం. 2007 జూన్ 18న ఓఎంసీకి లీజులు కేటాయిస్తూ అప్పటి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఉద్దేశపూర్వకంగానే 'క్యాప్టివ్' అనే పదాన్ని తొలగించారని, తద్వారా అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై 2009లో డిసెంబర్ 7న తొలిసారి సీబీఐ కేసు నమోదు చేసింది. ఆ తర్వాత తెలంగాణ హైకోర్టులో స్టే రావడం, మళ్లీ డివిజన్ బెంచ్ స్టే ఎత్తివేయడం.. ఇలా పలు రకాల పిటిషన్లు వేయడంతో దాదాపు 15 ఏళ్ల పాటు విచారణ కొనసాగింది. ఐదేళ్లు దర్యాప్తునకే సమయం పట్టింది. 2009 నుంచి 2014 వరకు సీబీఐ నాలుగు ఛార్జిషీట్‌లను దాఖలు చేసింది. ఓఎంసీ వ్యవహారంలో 2011లో ఛార్జిషీట్‌ను తొలిసారి వేయగా.. 2014లో తుది ఛార్జిషీట్ తర్వాత సుదీర్ఘంగా విచారణ జరిగింది. 219 మంది సాక్షులను విచారించింది. ప్రత్యక్షంగా, పరోక్షంగా పలు సాక్ష్యాలు, ఆధారాలను సీబీఐ సేకరించింది. అనంతపురంలోని ఓబుళాపురంలో గనుల కేటాయింపు, తవ్వకాలకు సంబంధించి అత్యాధునిక పరికరాలతో సీబీఐ ఆధారాలు సేకరించింది. అక్రమంగా తవ్వకాలు, రవాణా, ఎగుమతులు, విక్రయాల్లో పెద్ద ఎత్తున అవకతవకలు జరిగినట్లు- సీబీఐ గుర్తించింది. ఏపీ, కర్ణాటక సరిహద్దుల్లో పెద్ద ఎత్తున తవ్వకాలు చేపట్టినట్లు అధికారులు గుర్తించారు. దీనిపై పూర్తి ఆధారాలు, సాక్ష్యాల సేకరణతో 2014లో తుది ఛార్జిషీట్ దాఖలైంది. విదేశాలకు అక్రమంగా దాదాపు 60 లక్షల మెట్రిక్ టన్నుల ఇనుప ఖనిజాన్ని ఎగుమతి చేశారని, అక్రమ బినామీ లావాదేవీలు జరిగినట్లు- గుర్తించామని సీబీఐ ఛార్జిషీట్‌లో పేర్కొంది. ఈ కేసు విచారణలో మొత్తంగా 3337 డాక్యుమెంట్లను పరిశీలిం చారు. ప్రభుత్వం కేటాయించిన 68 హెక్టార్లలో కాకుండా పెద్ద ఎత్తున మైనింగ్ చేపట్టినట్లు సీబీఐ గుర్తించింది. ఈ కేసులో విచారణ దశలోనే ఏ5 లింగారెడ్డి మృతి చెందగా.. ఏ6 శ్రీలక్ష్మిని 2022లో ఈ కేసు నుంచి తెలంగాణ హైకోర్టు డిశ్చార్జి చేసింది. మొత్తంగా ఈ కేసునుంచి మాజీమంత్రి సబితా ఇంద్రారెడ్డికి ఊరట దక్కడంతో ఆమె ఆనందం వ్యక్తం చేశారు.

# పన్నెండున్నరేళ్ల క్రితం కన్నీళ్లతో కోర్టు మెట్లెక్కా
### ఇప్పుడు న్యాయం నన్ను నిర్దోషిగా నిలిపింది
### ఓబులాపురం కేసులో నిర్దోషిత్వంపై సబిత

**హైదరాబాద్, మే 6 :** ఓబుళాపురం మైనింగ్ కేసులో తనను సీబీఐ కోర్టు నిర్దోషిగా ప్రకటించడంపై మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. తనను నిర్దోషిగా ప్రకటించిన న్యాయ వ్యవస్థకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. ఈ కేసు విషయంలో పన్నెండున్నరేళ్ల క్రితం కన్నీళ్లతో కోర్టు మెట్లు ఎక్కానని ఈ సందర్భంగా ఆమె గుర్తు చేసుకున్నారు. ఎన్ని అపవాదులు వచ్చినా తన నియోజకవర్గ ప్రజలు మాత్రం తనకు అండగా నిలిచారన్నారు. ఈ తీర్పు అనంతరం ఆమె కోర్టు వద్ద మీడియాతో మాట్లాడుతూ.. ఏ తప్పూ చేయకపోయినా ఈ కేసులో నన్ను చేర్చడంపై బాధ పడ్డాను. న్యాయ వ్యవస్థ ద్వారా తనకు న్యాయం జరుగుతుందని నమ్మాను. ఈరోజు అదే జరిగింది. కానీ, ఇన్నేళ్లుగా నేను పడిన అవమానాలు, ప్రతిపక్షంలో ఉన్నవారు నన్ను అవినీతిపరురాలినని, జైలుకు పోతానని మాటలు అంటుంటే ఎంతో బాధపడ్డాను. అలా ప్రచారం చేసినా నా జిల్లా ప్రజలు, నియోజకవర్గం ప్రజలు నాపై సంపూర్ణంగా విశ్వాసం ఉంచారు. ఎవరెన్ని మాట్లాడినా నమ్మకుండా నన్ను గెలిపిస్తూ వచ్చారు. ఇన్నేళ్లుగా నాతో పాటు ఉండి ధైర్యం చెప్పిన అందరికీ కృతజ్ఞతలని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సంచలనం రేపిన ఓబులాపురం మైనింగ్ కేసులో నాంపల్లి సీబీఐ కోర్టు మంగళవారం సంచలన తీర్పు వెలువరించింది. ఈ కేసులో ఏ2గా ఉన్న కర్ణాటక మాజీ మంత్రి గాలి జనార్దన్ రెడ్డికి ఏడేళ్ల జైలు శిక్ష విధించింది. అతడితో పాటు- మరో నలుగురికి ఏడేళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించింది. మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డికి నాంపల్లి కోర్టు క్లీన్ చిట్ ఇచ్చింది. 2004 నుంచి 2009 మధ్య వైఎస్ రాజశేఖర్ రెడ్డి కేబినెట్లో సబితా గనుల శాఖ మంత్రిగా పని చేశారు. సబితా హయాంలోనే ఓబులాపురం మైనింగ్ స్కామ్ వెలుగు చూడటంతో సీబీఐ అధికారులు ఆమెను కూడా కేసులో నిందితురాలిగా చేర్చారు.

# ఆర్టీసీ సమ్మె వాయిదా

- ముగ్గురు ఐఎఎస్‌లతో కమిటీ
- మంత్రి పొన్నం ప్రభాకర్‌తో చర్చల అనంతరం జేఏసీ వెల్లడి



**హైదరాబాద్, మే 6 :** తెలంగాణలో ఆర్టీసి సమ్మె వాయిదా పడింది. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తో జరిపిన చర్చలు సఫలం కావడంతో ఆర్టీసి కార్మిక సంఘాల నేతలు సమ్మెను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. రేపటి నుంచి రాష్ట్రంలో సమ్మె చేయనున్నట్లు- కార్మిక సంఘాలు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రభుత్వం చర్చలకు పిలుపునివ్వడంతో మంగళవారం తమ సమస్యలపై మంత్రి పొన్నం ప్రభాకర్ తో కార్మిక సంఘాల నేతలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి దృష్టికి తమ సమస్యలను తీసుకెళ్లారు. పలు సమస్యలపై చర్చించారు. అనంతరం మంత్రి పొన్నం మాట్టాడుతూ.. సమ్మె ఆలోచన విరమించుకోవాలని కార్మిక సంఘాల నేతలకు విజ్ఞప్తి చేశారు. సమ్మెకు వెళ్లి ప్రజలకు ఇబ్బంది కలిగించవద్దని కోరారు. ఇప్పుడిప్పుడే సంస్థ కోలుకుంటుందని.. సమ్మె చేస్తే నష్టం జరుగు తుందని చెప్పారు. కార్మికుల సమస్యలను సిఎం దృష్టికి తీసుకెళ్తామని మంత్రి పొన్నం హామీ ఇచ్చారు. త్వరలోనే కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని మంత్రి చెప్పడంతో తాత్కాలికంగా సమ్మెను వాయిదా వేస్తున్నట్లు కార్మిక సంఘాల నేతలు వెల్లడించారు. నేటి నుంచి సమ్మె చేయాలని నిశ్చయించుకున్న ఆర్టీసీ జేఏసీ నాయకులతో రాష్ట్ర రవాణా శాఖా మంత్రి పొన్నం ప్రభాకర్ జరిపిన చర్చలు సఫలమయ్యాయి. జేఏసీ నేతల డిమాండ్లను సమ్మతి తెలపడంతో ప్రస్తుతానికి సమ్మె విరమించుకున్నట్లు వారు ప్రకటించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ముగ్గురు ఐఏఎస్ అధికారులతో కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో లోకేశ్ కుమార్, కృష్ణభాస్కర్, నవీన్ మిత్తల్ ఉంటారు. కమిటీ- ఉద్యోగ సంఘాలతో చర్చించి వారంలోగా పరిష్కారం చూపాలని సర్కార్ ఆదేశాలిచ్చింది. తమ డిమాండ్లను తీర్చకపోతే ఈ నెల మే 7వ తేదీ నుంచి సమ్మెకు దిగుతామని ఆర్టీసీ జేఏసీ నేతలు ప్రకటించిన సంగతి తెలిసిందే. దీంతో వెంటనే ఆర్టీసీ యాజమాన్యం ఉద్యోగులకు బహిరంగ లేఖ రాసింది. ఇప్పుడిప్పుడే ఆర్థికంగా పుంజుకుంటు-న్న ఆర్టీసీని సమ్మె ద్వారా దెబ్బతీయవద్దని కోరింది. అలా కాకుండా మొండిగా సమ్మెకు దిగితే మాత్రం కఠిన చర్యలు తప్పవని కూడా హెచ్చరించింది. ఎస్మా చట్టం ప్రకారం ఆర్టీసీలో సమ్మెలు చేయడం నిషేధం. ఇదిలా ఉంటే, మంత్రి పొన్నం ప్రభాకర్ ఆర్టీసీ ఉద్యోగులతో జరిపిన చర్చలు విజయవంతమయ్యాయి. తమ డిమాండ్లకు మంత్రి సానుకూలంగా స్పందించడంతో ఉద్యోగ సంఘాలు సమ్మెను వాయిదా వేసుకున్నాయి. ఆర్టీసీ జేఏసీ నేతలు సమ్మె వాయిదా వేస్తున్నట్లు- సచివాలయం మీడియా పాయింట్ వద్ద వెల్లడించారు. ప్రభుత్వంతో సుదీర్ఘంగా జరిపిన చర్చలు సఫలమయ్యామని ప్రకటించారు. పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి, ఎమ్మెల్సీ కోదండరాం, సీపీఐ ఎమ్మెల్యే సాంబశివరావులతో అనేక అంశాలపై చర్చించినట్లు- పేర్కొన్నారు. ఆర్టీసీ యూనియన్ లపై ఆంక్షల తొలగింపు, అన్ని కేటగిరీల్లో ఖాళీ భర్తీ, గుర్తింపు ఎన్నికల నిర్వహణ, కారుణ్య నియామకాలు , ఉద్యోగ భద్రతపై సర్క్యులర్, నేరుగా ఆర్టీసీకే ఎలక్ట్రిక్ బస్సులు, 2025 నుంచి రి-టైర్డ్ ఉద్యోగుల బెనిఫిట్స్ చెల్లింపులు, 2017లో రిటైర్ అయిన వారికి వేతన సవరణ ప్రకారం బెనిఫిట్స్ వంటి డిమాండ్లపై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు- తెలిపారు. అలాగే 2019 లో సమ్మె కాలంలో ఉద్యోగులపై వేసిన పోలీస్ కేసులను మాఫీ, ప్రభుత్వంలో ఆర్టీసీ కార్మికుల విలీనం చేయాలని కోరినట్లు- వెల్లడించారు. తమ అని డిమాండ్లను విడతల వారీగా పరిష్కరిస్తామని సర్కార్ హామీ ఇచ్చిందని పేర్కొన్నారు.

## రేవంత్ రెడ్డివి దివాళాకోరు మాటలు

(మొదటిపేజీ తరువాయి)




రేవంత్ రెడ్డి మాటలు దివాలా కోరి వానిలా ఉన్నాయని చెప్పారు. ప్రస్తుతం ప్రభుత్వ అధికారం ఉన్నప్పటికీ, పలు హామీలు నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. కేటీ-ఆర్ ప్రకారం, ఉద్యమ సమయంలో ఉద్యోగ సంఘాలు, ముఖ్యంగా కపేక్షలు కీలకంగా కదం తొక్కాయి. వారి పోరాటం వల్లే తెలంగాణ రాష్ట్రం సాధ్యమైందని తెలిపారు. రాష్ట్రం ఏర్పడ్డ వెంటనే ఉద్యమ నేతలకు గౌరవంగా ఉన్నత జీతాలు కల్పించామన్నారు. రేవంత్ రెడ్డి ఉద్యమంలో భాగం కాలేదని, ఉద్యమ ద్రోహిగా వ్యవహరి స్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై మాట్లాడుతూ, బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో చేసిన అప్పు మొత్తం 4.15 లక్షల కోట్లకే పరిమితమని, ప్రభుత్వం నుండి విరమించిన సమయంలో ఆదాయం నెలకు 18 వేల కోట్లు- ఉందని వివరించారు. ఇప్పుడూ అదే ఆదాయం వస్తున్నా, కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా నడిపించలేకపోతోందని విమర్శించారు. కాంగ్రెస్ నేతలు శ్వేతపత్రాలు విడుదల చేస్తూ అప్పు లెక్కల్ని గందరగోళంగా మార్చుతున్నారని, ఒకసారి 6 లక్షల కోట్లు-, తర్వాత 8.29 లక్షల కోట్లు- అన్నారు అంటూ లెక్కల్లో అస్పష్టత ఉన్నదని చెప్పారు. రైతుబంధు, విద్యుత్ సరఫరా, నీటి కొరత వంటి అంశాల్లో కేసీఆర్ హయాంలో స్థిరత ఉందని, ఇప్పుడు అన్ని రంగాల్లో సంక్షోభం నెలకొంది. రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చాక రాష్ట్రాన్ని అస్తవ్యస్తం చేశారని విమర్శలు గుప్పించారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని చెప్పి, ఇప్పుడు వారినే ప్రజల ముందుకు విలన్లుగా చూపించే ప్రయత్నం చేస్తున్నారని కేటీ-ఆర్ వ్యాఖ్యానించారు. రాష్ట్రాన్ని ఆర్థికంగా గాడిలో పెట్టిన కేసీఆర్ పాలన తరువాత ఇప్పుడు విపరీత పరిస్థితులు నెలకొన్నాయని, ప్రజలు ఈ పరిస్థితిని గమనిస్తున్నారని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

## రోడ్డు ప్రమాద బాధితులకు ఊరట

- ఆస్పత్రుల్లో లక్షన్నర వరకు ఉచిత వైద్యం
- ఉత్తర్వులు జారీచేసిన కేంద్ర ప్రభుత్వం

**న్యూఢిల్లీ, మే 6 :** రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి, వారి కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. ప్రమాదంలో గాయపడ్డ వెంటనే నగదు రహిత చికిత్స అందించేలా ప్రవేశపెట్టనున్న కొత్త పథకం ఉపశమనం కలిగించనుంది. దేశవ్యాప్తంగా రోడ్డు ప్రమాద బాధితులకు నగదు రహిత చికిత్స పథకాన్ని ప్రకటిస్తూ కేంద్ర ప్రభుత్వం మంగళవారం నోటిఫికేషన్ జారీ చేసింది. రోడ్డు రవాణా మంత్రిత్వ శాఖ గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం ఈ పథకం కింద బాధితుడు ప్రమాదం జరిగిన తేదీ నుంచి ఏడు రోజుల వరకు ఏదైనా గుర్తింపు పొందిన ఆసుపత్రిలో గరిష్ఠంగా రూ. 1.5 లక్షల వరకు నగదు రహిత చికిత్స పొందవచ్చు. ఈ పథకం మే 5సోమవారం నుంచే అమల్లోకి వచ్చినట్టు నోటిఫికేషన్‌లో పేర్కొంది. ఈ పథకానికి 'క్యాష్‌లెస్ ట్రీ-ట్‌మెంట్ ఆఫ్ రోడ్ యాక్సిడెంట్ విక్టిమ్స్ స్కీం-2025' గా కేంద్ర ప్రభుత్వం నామకరణం చేసింది. రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం, ఎవరైనా మోటారు వాహనం వల్ల రోడ్డు ప్రమాదానికి గురైతే, ఈ పథకం కింద దేశంలోని ఏ ప్రాంతంలోనైనా వారికి ఉచిత చికిత్స లభిస్తుంది . ప్రమాద బాధితుడు ప్రభుత్వ లేదా నియమిత ఆసుపత్రులలో ఉచితంగా చికిత్స పొందవచ్చు. డబ్బు చెల్లించాల్సిన అవసరం లేదు. ఈ పథకం కింద, బాధితుడికి ప్రమాదం జరిగిన తేదీ నుంచి తదుపరి ఏడు రోజుల వరకూ గరిష్ఠంగా రూ. 1,50,000 వరకు ఉచిత చికిత్స అందుతుందని ప్రభుత్వం తెలిపింది.

## కాంగ్రెస్ ఖేల్ ఖతం.. దుకాణం బంద్

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్రంలో రైతులకు ఇచ్చిన హామీలన్నీ గాలికొదిలేశారని బండి సంజయ్ ధ్వజమెత్తారు. వృద్ధులకు రూ. 4 వేల పింఛన్, మహిళలకు నెలనెలా రూ. 2,500, తులం బంగారం వంటి హామీలు నేరవేర్చని ప్రభుత్వం, నిరుద్యోగులకు వాగ్దానం చేసిన రూ. 4,000 భృతి కూడా ఇవ్వడం లేదన్నారు. అంతేకాదు, విద్యార్థులకు హామీగా చెప్పిన రూ. 5 లక్షల భరోసా కార్డు ఇప్పుడు లేదన్నట్టే తేలిందని విమర్శించారు. సంవిధాన్ చూపిస్తూ రాహుల్ గాంధీ తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రస్తావిస్తూ బండి సంజయ్, ఆయన వాటికి సమాధానం చెప్పక తప్పదన్నారు. రేపటి నుంచి కాంగ్రెస్ మంత్రులను, ఎమ్మెల్యేలను ప్రజల మధ్య నిలదీస్తామని హెచ్చరించారు. రాజీవ్ రహదారి నిర్మాణం, నాణ్యతపై వస్తున్న విమర్శలపై కూడా బండి సంజయ్ ఘాటుగా స్పందించారు. ఈ రహదారిని కాంగ్రెస్ ప్రభుత్వం నాగుపాముల్లా వంకరటింకరగా నిర్మించిందని, కమిషన్లకు కక్కుర్తిపడి నాసిరకం పనులు చేయించిందని ఆరోపించారు. ఇకపై 2035 వరకు కాంట్రాక్టర్‌తో ఒప్పందం కూడా కాంగ్రెస్ ప్రభుత్వమే చేసిందని గుర్తు చేశారు. ఈ సమస్యను పరిష్కరించి, 6 లేన్ జాతీయ రహదారిగా విస్తరించేందుకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే 2022లోనే ప్రతిపాదనలు చేసిన విషయాన్ని సంజయ్ స్పష్టం చేశారు. ప్రజల దృష్టిని మళ్లించేందుకు కాంగ్రెస్ పార్టీ డ్రామాలు ఆడుతోందని బండి సంజయ్ విమర్శించారు. మంత్రి కోమటిరెడ్డకు కూడా కేంద్ర మంత్రి గడ్కరీ ఇదే విషయాన్ని స్పష్టంగా చెప్పినట్టు గుర్తుచేశారు. లేఖల పేరుతో కేంద్రంపై బురద చల్లడాన్ని తీవ్రంగా ఖండించారు. సీఎం వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేతలు, మంత్రులు కూడా స్పష్టత ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రే రాష్ట్రం దివాలా తీసిందని పేర్కొనడం సిగ్గుచేటని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు.

ప్రభుత్వ పెద్దగా ప్రజల్లో ధైర్యం నింపాల్సిం దిపోయి అధైర్యాన్ని నూరిపోస్తూ రాష్ట్రం పరువు తీస్తున్నారని ధ్వజమెత్తా రు. కరీంనగర్‌లో బండి సంజయ్ మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ప్రభుత్వం నడపలేమనే స్థితిలో కాంగ్రెస్ ఉందని బండి సంజయ్ ఎద్దేవా చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తెలిసే అడ్డగోలు హామీలు ఇచ్చారని.. ఇప్పుడు ఆరు గ్యారంటీలు అమలు చేయలేమని చేతులెత్తేశారని విమర్శించారు. కేంద్రమంత్రులు అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదని సీఎం చెప్పడం పచ్చి అబద్ధమన్నారు. ఎన్నికల్లో హామీలిచ్చిన రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ ఇప్పుడు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. హామీలు అమలు చేయకపోతే కాంగ్రెస్ ఎమ్మెల్యేలను వదిలిపెట్టబోమని హెచ్చరించారు.

## 8న బాధిత జర్నలిస్టులకు చెక్కుల పంపిణీ

### మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి వెల్లడి

**హైదరాబాద్, మే 6 :** వర్కింగ్ జర్నలిస్టుల సంక్షేమ నిధి నుండి చనిపోయిన జర్నలిస్టు కుటుంబాలకు, అనారోగ్యం, ప్రమాదాల బారినపడి పనిచేయలేక నిస్సహాయ స్థితిలో ఉన్న జర్నలిస్టులకు ఆర్థిక సహాయ కార్యక్రమం మే 9న మీడియా అకాడమీ ఆడిటోరియంలో జరుగనుంది. రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖామాత్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా వచ్చి చెక్కులను అందచేస్తారని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్, కే శ్రీనివాస్ రెడ్డి తెలియచేశారు. ఇటీవల మరణించిన 38 మంది జర్నలిస్టుల కుటుంబాలకు ఒక్కొక్కరికి లక్ష రూపాయల ఆర్థిక సాయంతో పాటు ఐదు సంవత్సరాల వరకు, ప్రతి కుటుంబానికి నెలకు మూడు వేల రూపాయల పెన్షన్ ఎల్కేజీ నుండి పదవ తరగతి వరకు చదివే ఇద్దరు పిల్లలకు నెలకు రూ 2000 ట్యూషన్ ఫీజు, జర్నలిస్టుల సంక్షేమ నిధి నుండి మంజూరు చేసినట్లు అకాడమీ చైర్మన్ వెల్లడించారు. ప్రాణాంతక వ్యాధులతో బాధపడుతున్న, ప్రమాదానికి గురై భృతిని కోల్పోయిన జర్నలిస్టులు, ఇతర వ్యాధులకు గురైన వారికి లక్ష రూపాయల చొప్పున, మొత్తం ఎనిమిది మందికి ఆర్థిక సాయం మంజూరు చేశామని శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. ఈ సందర్భంగా, మీడియా. అకాడమి వెబ్‌సైట్‌ను, జర్నలిస్ట్ ల పునశ్చరణ తరగతుల నిర్వహణకు అకాడమీ ప్రచురించిన వివిధ అంశాలతో కూడిన చిరు పుస్తకాలను మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆవిష్కరిస్తారని తెలిపారు.

## బీఆర్ఎస్ అభివృద్ధి గాలి బుడగ

- అప్పులు చేసి రాష్ట్రాన్ని అధోగతి చేశారు
- నాటి ఆర్టీసీ సమ్మెతో ఎంతమంది చనిపోయారు
- కేసీఆర్ నిర్వాకం వల్ల నెలకు 6వేల కోట్లు వడ్డీ కడుతున్నాం
- మంత్రి సీతక్క, ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి ఆగ్రహం





**హైదరాబాద్, మే 6 :** గత ప్రభుత్వం కొన్ని వర్గాలకే కొమ్ముకాసి రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందని మంత్రి సీతక్క విమర్శించారు. కేసీఆర్ అప్పు.. తెలంగాణ భవిష్యత్తుకు ముప్పుగా దాపురించిందన్నారు. కేసీఆర్ నిర్వాకం వల్ల నెలకు 6 వేల కోట్ల ప్రజాధనాన్ని అప్పుల చెల్లింపుల కోసం మళ్లించాల్సి వస్తోందని తెలిపారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌పై మంత్రి సీతక్క , ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డిలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం వీరు మీడియాతో మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డిపై అనవసర వ్యాఖ్యలతో కేటీఆర్ తన అసహనాన్ని ప్రదర్శిస్తున్నారని మంత్రి సీతక్క మండిపడ్డారు. సత్తా ఉన్న నాయకుడు కేసీఆర్ అయితే.. పత్తా లేకుండా ఎక్కడికి వెళ్లారని ప్రశ్నించారు. సత్తా ఉంటే అసెంబ్లీకి వచ్చి సత్తా నిరూపించుకోవాలని హితవుపలికారు. ఉద్యోగుల పోరాటాన్ని వాడుకున్న చరిత్ర బీఆర్ఎస్‌దని అంటూ మండిపడ్డారు. 40 మంది ఆర్టీసీ కార్మికుల ఉసురు తీసింది మీరు కాదా? అని ప్రశ్నించారు. ఉపాధ్యాయ, ఉద్యోగ నాయకుల ఇంటి తలుపులు పగుల గొట్టింది ఎవరు కేటీఆర్ అని నిలదీశారు. ఎందరో ఉద్యమకారులను అవమానపరిచి బయటకు పంపిన చరిత్ర గులాబీ పార్టీదని మండిపడ్డారు. అప్పులు, అమ్మకాలు తప్ప బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి శూన్యమంటూ వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి ఒక గాలి బుడగ అని ఎన్నికల్లో ప్రజలే తేల్చారన్నారు. బీఆర్ఎస్ అప్పుల మూలంగా ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయని.. అయినా ఎక్కడా సంక్షేమానికి లోటు లేకుండా చూస్తున్నామని మంత్రి సీతక్క పేర్కొన్నారు. కేటీఆర్‌కు మైండ్ దొబ్బిందని ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి కూడా మండిపడ్డారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల గురించి సీఎం మాట్లాడారని.. కేటీఆర్‌కు మెడ, కాళ్ల నొప్పులు దెబ్బకే పోయాయంటూ ఎద్దేవా చేశారు. ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారన్నారు. సమ్మె చేయొద్దు.. రాష్ట్రం బాగు చేసుకుందాం అని సీఎం చెప్పారని.. గతం లో 52 రోజులు సమ్మె చేస్తే.. కేసీఆర్ ఒక్క రోజు బయటికి రాలేదని గుర్తు చేశారు. సమ్మె చేస్తున్న వారిని నానా బూతులు ఆ నాడు తిట్టిండని తెలిపారు. రేవంత్ లా సౌమ్యంగా ఎప్పుడు చెప్పలేదన్నారు. ఆ రోజుల్లో సమ్మె చేస్తే ఉద్యోగ సంఘాల్లో శ్రీనివాస్ గౌడ్‌ను ఎమ్మెల్యే చేశారన్నారు. ఉద్యోగ సంఘం నేతలను మాట్లాడకుండా చేశారని మండిపడ్డారు. మిగులు రాష్ట్రాన్ని ఇస్తే 8 లక్షల కోట్ల అప్పులు చేశారన్నారు. వాస్తవ పరిస్థితులు చెప్పే ప్రయత్నం సీఎం చేశారని చెప్పుకొచ్చారు. ఎన్నడూ కేటీఆర్ ఊరికే లేరని.. ప్రతీరోజు తప్పుడు ప్రచారమే చేశారని ఫైర్ అయ్యారు. తెలంగాణలో బిల్లులు రావడం లేదని.. అవన్నీ ఆ నాడు కేసీఆర్ పెట్టి పోయారన్నారు. మిగులు రాష్ట్రం ఇస్తే అప్పుల రాష్ట్రం చేశారని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో దోచుకున్నదే కాకుండా.. మళ్ళీ వచ్చే వాళ్లు పరిపాలన చేయకుండా చేశారన్నారు. 'తెలంగాణ ప్రజలకు లెక్కలు తెలీవని అనుకుంటున్నావా కేటీఆర్... మీ హయాంలో ఒకటో తారీకు జీతాలు ఇచ్చిన దాఖలాలు ఉన్నాయా. లక్ష 50 వేల కోట్లు అప్పు కట్టాము. మిస్ వరల్డ్‌కు ఖర్చు రూ. 250 కోట్లు- కాదు.. రూ. 27 కోట్లే. కేటీఆర్.. దోపిడీలో భాగస్వామి. తప్పుడు లెక్కలు చెప్పడం భావ్యం కాదు. మీరు దోచుకున్నంత దేశంలో ఎవరూ దోచుకోలేదు. కేటీ-ఆర్‌కు సిగ్గు శరం లేదు. కాళేశ్వరంలో ఓ అధికారి జైలుకి వెళ్ళాడు. మీరు చెప్తేనే కరెక్ట్ అనేది దుర్మార్గపు ఆలోచన. నీ పగటి కలలు నెరవేరవు. రేపటికి రేపు సీఎం కుర్చీలో కేటీఆర్ కూర్చోలేడు' అంటూ వ్యాఖ్యలు చేశారు. దళితులకు మూడు ఎకరాలు ఎందుకు ఇవ్వలేదు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు బాగో లేకున్నా సీఎం 21 వేల కోట్ల రుణమాఫీ చేసిండు. రుణమాఫీ చేసినందుకు రాహుల్ క్షమాపణ చెప్పాలా. మేనిఫెస్టో గురించి మాట్లాడే హక్కు కేటీఆర్‌కు లేదు. ఆర్టీసీ సమ్మె 52 రోజులు జరిగితే ఎందుకు మాట్లాడలేదు. రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్ ఇల్లు వద్ద పార్కింగ్ లేక ఇబ్బంది పడుతున్నారు. కేటీఆర్ చెప్పిన 2000 ఎకరాలు తీసుకురావాలి. ఆ 2000 ఎకరాలు బయటపెట్టాలి. పిట్ట కథలు చెబుతుండు. చెల్లెను బయటకు పంపాలి.. బావను పడుకోబెట్టాలి అని చూస్తుండు. సీఎం ప్రజల సమస్యలు పరిష్కారం దిశగా ప్రయత్నం చేస్తుండు. కేసీఆర్ చెప్పిందే చెప్పి వన్ మ్యాన్ షో చేసిండు. దెబ్బ తాకి మెదడు దొబ్బిన కేటీఆర్ మాటలు నమ్మొద్దని ఎంపీ చామల కిరణ్ స్పష్టం చేశారు.

## సియుఇటి యుజి పరీక్షలు వాయిదాకు మొగ్గు

**న్యూఢిల్లీ, మే 6 :** సియుఇటి యుజి పరీక్షలను వాయిదా వేయాలని నేషనల్ టెస్టింగ్ ఏజన్సీ (ఎన్‌టిఎ) భావిస్తున్నట్లు సంబంధిత వర్గాలు మంగళవారం ప్రకటించాయి. షెడ్యూల్ ప్ర కారం ఈ పరీక్షలు మే 8 నుండి జూన్ 1 వరకు, భారత్ సహా వివిధ దేశాలలో పలు పరీక్షా కేంద్రాల్లో నిర్వహించాలని నిర్ణయించారు. అయితే అధికారిక ప్రకటన వెలువడాల్సి వుంది. సమన్వయ సమస్యల కారణంగా వాయిదా వేసినట్లు- సమాచారం. అయితే ఈ అంశంపై అధికారిక ప్రకటన వెలువడాల్సి వుందని ఆ వర్గాలు తెలిపాయి. యూనివర్శిటీ-ల్లో అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశం కోసం ఈ పరీక్షలను నిర్వహిస్తుంది. నీట్ తర్వాత, దేశంలోనే ఇది రెండవ అతిపెద్ద ప్రవేశపరీక్ష. భారతదేశంలోని కేంద్ర, రాష్ట్ర, డీమ్డ్ మరియు ప్రైవేట్ యూనివర్శిటీ-ల్లో ప్రవేశం కోసం ప్రతి ఏడాది సుమారు 13 లక్షలకు పైగా విద్యార్థులు సియుఇటి పరీక్షల కోసం నమోదు చేసుకుంటారు.

## కారును ఢీకొన్న ట్రాక్టర్

### 8మంది దుర్మరణం

**పాట్నా, మే 6 :** బీహార్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కతిహార్ జిల్లాలో కారు, ట్రాక్టర్ ఢీకొన్న ప్రమాదంలో ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోగా, ఇద్దరు గాయపడ్డారని పోలీసులు మంగళవారం తెలిపారు. సోమవారం మధ్య రాత్రి బాధితులు పెళ్లి నుంచి తిరిగి వస్తుండగా సమేలి బ్లాక్ ఆఫీస్ సమీపంలో ఈ ప్రమాదం జరిగిందని అధికారులు తెలిపారు. పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులను సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితులందరూ సుపాల్‌కు చెందినవారని పోలీసులు తెలిపారు. సమేలి బ్లాక్ ఆఫీస్ సమీపంలోని ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను వారు ప్రయాణిస్తున్న కారు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. మృతుల్లో అందరూ పురుషులే ఉన్నారని కతిహార్ ఎస్పీ వైభవ్ శర్మ తెలిపారు. మృతదేహాలను పోస్ట్‌మార్టం కోసం పంపామని, ఈ సంఘటనపై దర్యాప్తు కొనసాగుతోందని ఆయన తెలిపారు.

## సిఎం వ్యాఖ్యల్లో నిజాయితీ ఉంది

- బిఆర్ఎస్ లాగా బుకాయిచడం రాదు
- ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ ఎదురుదాడి

**హైదరాబాద్, మే 6 :** తెలంగాణ ఆర్థిక పరిస్థితిని నిజాయితీగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ తెలిపారు. ఈటల హాఫ్ బిజెపి.. హాఫ్ బిఆర్ఎస్ అని దయాకర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మాజీ సిఎం కెసిఆర్ చేసిన అప్పులకు నెలకు రూ. 7 వేల కోట్లు- కట్టాల్సిన పరిస్థితి వచ్చిందని చెప్పారు. తెలంగాణను దోచుకున్న దొంగలు బిఆర్ఎస్ నాయకులని, ఉద్యమం చేస్తున్నట్లు నటించి పార్టీ నిర్మించుకున్నారని అన్నారు. కెసిఆర్ గుణం ఇంకా మారలేదని విమర్శించారు. కెటిఆర్ కాలు విరిగినా ఆయనే ప్రెస్ మీట్ పెట్టాలా? అని అద్దంకి ప్రశ్నించారు. కెటిఆర్ ను పైకి తేవడానికి పద్ధతి ప్రకారం కెసిఆర్ ప్లాన్ చేస్తున్నారని, బిఆర్ఎస్ రజతోత్సవ సభలో హరీష్ రావు ఫొటో కూడా లేదని ఎద్దేవా చేశారు. హరీష్ రావును కరివేపాకులా పక్కన పెట్టారని అద్దంకి దయాకర్ పేర్కొన్నారు.



## పహల్గామ్ దాడి.. మోడీకి ముందే తెలుసు

- కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే సంచలన వ్యాఖ్యలు
- ఖర్గే వ్యాఖ్యలపై మండపడ్డ బిజెపి నేతలు

**న్యూఢిల్లీ, మే 6 :** పహల్గాం ఉగ్రదాడి ఘటనపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే సంచలన వ్యాఖ్యలు చేశారు. హహల్గాం ఉగ్రదాడి ఘటనకు మూడు రోజులకు ముందే ఇంటెలిజెన్స్ సమాచారం అందడటంతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జమ్మూకశ్మీర్ పర్యటనను రద్దు చేసుకున్నారని అన్నారు. జార్ఖండ్‌లోని రాంచీలో మంగళవారంనాడు జరిగిన కార్యక్రమంలో ఆయన ఈ ఆరోపణలు చేశారు. ఇంటెలిజెన్స్ వైఫల్యం ఉంది. ప్రభుత్వం కూడా దీనిని అంగీకరించింది. ఇంటెలిజెన్స్ పటిష్టం చేసుకుంటామని వాళ్లే చెప్పారు. అయితే దాడికి మూడు రోజుల ముందే ప్రధానికి నిఘా సమాచారం అందినట్టు నాకు తెలిసింది. దాంతోనే ఆయన జమ్మూకశ్మీర్ పర్యటనను రద్దు చేసుకున్నారు. ఈ విషయాన్ని వార్తా పత్రికల్లో కూడా చూశాను. దీనిపై ప్రధాని సమాధానం చెప్పాలని అన్నారు. ఏదేమైనా పహల్గాం దాడికి వ్యతిరేకంగా పాకిస్థాన్‌పై ఎటువంటి చర్య తీసుకున్నా ప్రభుత్వానికి కాంగ్రెస్ మద్దతుగా నిలుస్తుందని అన్నారు. రాంచీ వేదికగా నిర్వహించిన కార్యక్రమంలో ఈ మాటలు మాట్లాడారు. పహల్గాం ఉగ్రదాడికి సంబంధించి కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన విమర్శలపై భాజపా తీవ్రంగా స్పందించింది. భద్రతా బలగాల స్థయిర్యాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తంచేసింది. కాంగ్రెస్ చేసిన ఈ ఆరోపణలకు ఎలాంటి ఆధారం లేదని భాజపా అధికార ప్రతినిధి తుహిన్ సిన్హా మీడియాతో అన్నారు. ఉగ్రవాదంపై పోరు నిర్ణయాత్మక దశకు చేరుకున్న సమయంలో ప్రధాని మోదీ, కేంద్రప్రభుత్వంపై విమర్శలు చేయడాన్ని మరో నేత ప్రశ్నించారు. పాకిస్థాన్‌పై దాడి విషయంలో కేంద్రం ఎలాంటి నిర్ణయం తీసుకున్నా మేం మద్దతు ఇస్తామని చెప్తూనే.. మరోవైపు దేశాన్ని బలహీన పరిచే ప్రయత్నం చేస్తున్నారు. పహల్గాం ఘటన విషయంలో ప్రధానిపై విమర్శలు చేయడం దురదృష్టకరమని భాజపా సీనియర్ నేత రవిశంకర్ మండిపడ్డారు. పహల్గాంలోని బైసరన్ లోయలో ఏప్రిల్ 22న పర్యాటకులపై ఉగ్రవాదులు పాశవిక దాడికి పాల్పడిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన తర్వాత పాక్ నడ్డివిరిచేలా భారత ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. దీనిపై విమర్శలు చేయడంపై కాంగ్రెస్ తీరును బిజెపి ఎండగట్టింది

www.rajamudranews.com
రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక

# అష్టదిగ్బంధనతో పాక్ ఉక్కిరిబిక్కిరి !



యుద్ధమంటే నేరుగా పోరాటమొక్కటే కాదు...శత్రువును అష్టదిగ్బంధనం చేసి కదలకుండా చేయడం కూడా యుద్ధంలో ఓ భాగమే. పాక్ పరిస్థితి ఇప్పుడు అలాగే ఉంది. అది నిద్రలేని రాత్రులు గడుపుతోంది. ప్రపంచ దేశాలు నమ్మలేని దుస్థితిలో కొట్టుమిట్టాడుతోంది. నిజంగానే యుద్ధం జరిగితే దాని పక్కన నిలబడానికి ఒక్కదేశం కూడా రాకపోవచ్చు. ఇప్పటికే అనేక రకాలుగా భారత్ పాక్‌ను ముప్పుతిప్పలు పెడుతోంది. పహల్గామ్ దాడి జరిగి పక్షం రోజులు పూర్తయ్యాయి. ఇంకా ఎప్పుడు దాడి చేస్తారని కొందరు అధికారంలో ఉన్న బిజెపిని నిలదీసే ప్రయత్నంలో ఉన్నారు. ఇలాంటి వారు యుద్ధతంత్రం గురించి తెలుసుకుంటే మంచిది. సామ,భేద, దాన, దండోపాయాలు అన్నవి యుద్ధంలో బాగా వాడే పదాలు. మొదటి మూడు విఫలమైన తరవాతనే నాలుగోది అయిన దండోపాయం చేపట్టాలి. రావణుడు యుద్ధానికి సై అన్న తరుణం లోనూ అతడి పట్టపుమహిషి మండోదరి అడ్డుపడి సామ,భేద,దాన,దండోపాయల గురించి వివరిస్తుంది. రాముడిని మచ్చిక చేసుకుని బతిమాలి, బామాలి, క్షమించమని వేడుకొమ్మని అంటుంది. చేసిన తప్పును సరిదిద్దుకోమని హెచ్చరిస్తుంది. కానీ రావణుడు ఇవన్నీ మరచి యుద్ధంచేసి పారజితుడు అయ్యాడు. పాక్ కూడా ఉగ్రవాదం ఎగదోసే ప్రయత్నం నుంచి బయటపడి, తన ఉనికిని గుర్తించాలి. భారత్ నుంచి వివిడ్డ ముక్కనని గుర్తించాలి. అలా జ్ఞానోదయం కావాలి. అప్పుడే పాక్ ప్రపంచదేశాల్లో మనగలుగుతుంది. కానీ అలా చేయలేక ఉగ్రవాదాన్ని ఎగదోస్తూ తమదేశ ప్రజలను మభ్య పెడుతూ వస్తోంది. ఇప్పుడు పాపం పండింది. ఇంతకాలం ఒక లెక్క..ఇప్పుడో లెక్క. పహల్గామ్ దాడి తరవాత ఇప్పుడు భారత్ విసిరిన ఉచ్చులో పడి గిలగిల కొట్టుకుంటోంది. మోడీ కూడా ఇప్పుడు అదే వ్యూహంతో సాగుతున్నారు. ఇప్పటికే పాక్ యుద్ధభయంతో సైన్యాన్ని మోహరించింది. ఉగ్రవాద శిబిరాలను ఖాళీ చేయించింది. గగనతలంపై ఆంక్షలు విధిచడంతో పాక్ ముప్పుతిప్పలు పడుతోంది. అసలే పాక్ ఆర్థిక వ్యవస్థ అంతంతమాత్రంగా సాగుతున్న వేళ..పాక్‌ను అష్టదిగ్బంధనం చేయడంతో నానా ఇక్కట్లు పడుతోంది. మరోవైపు సింధుజలాల రాకను అడ్డుకుంది. దీంతో నీటి కోసం తపిస్తున్నారు. అలాగే పివోకెపై దాడి చేస్తారన్న భయంతో అక్కడ బలగాలను మొహరించారు. ఇకపోతే ఐక్యరాజ్యసమితలో కూడా తాజాగా పాక్‌కు చుక్కెదురయ్యింది. అంతర్జాతీయంగా కూడా భారత్ బలమైన మద్దతును కూడా గట్టింది. ఇవన్నీ కూడా పాక్‌ను దెబ్బతీస్తున్న ఘటనలుగానే చూడాలి. యుద్ధంలో ఇదొక భాగంగా చూడాలి. ఇలా చేయడం వల్ల అసలు యుద్ధంలో పాక్ అడుగు వేయలేని దుస్థితికి చేరుకుంది.

పహల్గాంలో ఉగ్రదాడి ప్రతి భారతీయుని హృదయాన్ని తీవ్రంగా గాయపరిచింది. బాధితుల కుటుంబాల పట్ల ప్రతి భారతీయుడూ తీవ్ర సానుభూతి వ్యక్తం చేస్తున్నాడు. ఏ రాష్ట్రానికి చెందినవారైనా,ఏ భాష మాట్లాడేవారైనా ఆ ఉగ్రదాడిలో తమ ఆత్మీయులను కోల్పోయిన వారి బాధను అనుభవిస్తున్నారు. ప్రతి భారతీయుని రక్తం మరిగిపోతోంది. పాక్‌ను తుదముట్టించా లని ప్రతి ఒక్క భారతీయముడు కోరుకుంటున్నాడు. నిజానికి 370 ఆర్టికల్ రద్దు తరవాత కశ్మీర్‌లో మళ్లీ ప్రశాంత పరిస్థితులు నెలకొంటున్నాయి. పాఠశాలలు, కళాశాలలు కళకళలాడుతున్నాయి. విద్యావాతావరణం మళ్లీ చిగురించింది. నిర్మాణ రంగ కార్యకలాపాలు, అభివృద్ధి కార్యకలాపలు గతంలో ఎప్పుడూ లేని విధంగా వేగం పుంజుకున్నాయి. ప్రజాస్వామ్యం అక్కడ వికిసిస్తోంది. యువత స్వయం ఉపాధితో మళ్లీ శక్తిమంత మవుతోంది. పర్యాటకులు వెల్లువెత్తుతున్నారు. ప్రజల ఆదాయాలు గణనీయంగా పెరుగు తున్నాయి. యువత ఉపాధికి కొత్త అవకాశాలను సృష్టించడం జరుగుతోంది. అయితే పహల్గామ్ ఉగ్రవాద దాడితో పర్యాటకుల వెల్లువ నిలిచిపోయింది. సామాన్య కశ్మీరీల ప్రయోజనాలకు తీవ్ర భంగం వాటిల్లింది. పహల్గాంలో ఉగ్రవాద దాడి చోటుచేసుకున్న వెనువెంటనే ఆసేతు హిమాచలం అన్ని వర్గాల ప్రజలు ప్రభుత్వానికి మద్దతుగా నిలిచారు. మోదీ ప్రభుత్వం ఎటువంటి చర్య చేపట్టినా తాము సంపూర్ణంగా మద్దతునిస్తామని రాజకీయ పక్షాలు స్పష్టంగా ప్రకటించాయి. ఉగ్రదాడి ఘటన జరిగినప్పుడు సౌదీ అరేబియాలో ఉన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన అధికారిక పర్యటనను మధ్యలోనే ముగించుకుని స్వదేశానికి తిరిగివచ్చారు. ఉగ్రదాడికి ఇంతకింత మూల్యం చెల్లించుకోక తప్పదని పాక్‌ను కఠినంగా హెచ్చరించారు. ఈ క్రమంలో తీసుకున్న చర్యల వల్లనే ఇప్పుడు పాక్ ఏకాకి అయ్యింది. దానికి ఇప్పుడు చైనా కూడా బహిరంగంగా మద్దతు ఇవ్వలేని దుస్థితి ఏర్పడింది. అందుకే పహల్గాం ఘటనపై తక్షణమే ప్రతీకార చర్యలు చేపట్టాలనే డిమాండ్లు దేశవ్యాప్తంగా వెల్లువెత్తుతున్నాయి.

మెరుపుదాడులకు పాల్పడే విమానాలను పాక్ సైనిక దళాలు ముందుగానే పసిగట్టి అడ్డుకుంటాయని సైనిక నిపుణులు గట్టిగానే చెబుతున్నారు. అటువంటి దాడుల ఫలితాలు ఆశించినవిగా ఉండకపోవచ్చని కూడా నిపుణులు అంటున్నారు. భారత్ సైనిక పాటవ ఆధిక్యత దృష్ట్యా సర్జికల్ స్ట్రయిక్స్ కన్నా ఇతరత్రా ప్రత్యామ్నాయాలు ఉన్నాయని ప్రభుత్వం ఆలోచిస్తోంది. ఈసారి దెబ్బకొడితే మళ్లీ పాక్ కోలుకోకుండా చేయాల్సి ఉంది. ఎందుకంటే గతంలో నెహ్రూ, ఇందిరల హయాంలో చేసిన తప్పుల వల్ల పివోకె అలాగే ఉండిపోయింది. పాక్ జుట్టు మన చేతిలో చిక్కినా వదిలి పెట్టాం. ఇలాంటి అనుభవాలన్నీ ఇప్పుడు మోడీ ప్రభుత్వం తప్పకుండా గణిస్తోంది. అందుకే సామ,భేద, దాన, దండోపాయాలపై కసరత్తు చేస్తున్నట్లుగా ఉంది. అమెరికా, రష్యాలు సైతం మద్దతుగా ఉన్నాయి. గల్ఫ్ దేశాలు కూడా పాక్‌ను నమ్మేస్థితిలో లేవు. పహల్గాం దాడులకు ప్రతీకారంగా ఎప్పుడు ఎలా ఎలాంటి చర్య తీసుకోవాలనే విషయమై సైనిక దళాలకు ప్రధానమంత్రి సంపూర్ణ స్వేచ్ఛనిచ్చినట్టు ప్రకటించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో జాతీయ భద్రతపై అత్యున్నత నిర్ణయాలు తీసుకునేది ప్రధానమంత్రి మాత్రమే. ఆ నిర్ణయాలను అమలుపరిచేది సైనిక దళాలు. పహల్గాంపై భారత్ ప్రతిస్పందన.. కశ్మీర్‌లో అల్లకల్లోలం సృష్టిస్తున్న శత్రు వర్గాలను అణచి వేయడం వంటివన్నీ ఇప్పుడు అమలు జరుగుతున్నాయి. ప్రభుత్వం తీసుకునే ప్రతి నిర్ణయం వెనకా యుద్ధ తంత్రం దాగివుంది. అందుకే ప్రతి చర్యా పాక్‌ను కట్టడి చేసేలా ఉంటున్నాయి. భయంతో చస్తున్న పాక్ నేతలు అనవసర ప్రేలాపనలు పేలుతున్నారు. ఇదంతా అక్కడి ప్రజలకు కూడా తెలుసు. అందుకే అక్కడి పాలకులపై వ్యతిరేకత వస్తోంది తప్ప..భారత్‌పై పాక్ ప్రజల్ల ద్వేషం కానరావడం లేదు. ఉగ్రవాదాన్ని ఎగదోసే విధానం సరికాదని, పాక్ ప్రశాంతంగా ఉండాలి వారుకోరుకుంటున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం తీసుకున్న చర్యలు యుద్ధనీతిలో భాగంగా అనుసరిస్తున్నవిగా గుర్తించాలి. అలాగే మరిన్ని కఠిన చర్యలకు కూడా భారత్ సిద్దంగానే ఉందని కూడా గుర్తించాలి.

# సుప్రీంకోర్టు న్యాయమూర్తుల ఆస్తులు వెల్లడి

## అత్యంత ధనవంతుడిగా ముందున్న జస్టిస్ విశ్వనాథన్





**న్యూఢిల్లీ, మే 6 :** సుప్రీం కోర్టు న్యాయమూర్తులు తమ తమ ఆస్తుల వివరాలను వెల్లడించారు. ఈ మేరకు వెబ్‌సైట్‌లో తమ ఆస్తుల వివరాలను పొందుపరిచారు. రాజకీయనాయకులు ముఖ్యంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు చేయలేని పనిని వారు చేసి ఆదర్శంగా నిలిచారు. ఏప్రిల్ 1న జరిగిన సుప్రీంకోర్టు జడ్జెస్ ఫుల్ కోర్టు మీటింగ్‌లో ఆస్తుల వివరాలు వెల్లడించాలని నిర్ణయించారు. ఈ నిర్ణయం మేరకు సుప్రీంకోర్టు అధికారిక వెబ్‌సైట్‌లో న్యాయమూర్తులు తమ ఆస్తుల వివరాలను వెల్లడించారు. సుప్రీం కోర్టులో మొత్తం 33 మంది న్యాయమూర్తులకు గాను 21 మంది జడ్జిలు తమ ఆస్తుల వివరాలను వెబ్‌సైట్‌లో ఉంచారు. ఈ క్రమంలో న్యాయమూర్తుల్లో అత్యంత ధనిక న్యాయమూర్తి జస్టిస్ కె.వి విశ్వనాథన్ అని లెక్కలు చెబుతున్నాయి. ఆయన తన ఆస్తుల వివరాలను సుప్రీం కోర్టు అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపర్చారు. ఇంతకీ జస్టిస్ కెవి విశ్వనాథన్ ఆస్తులు ఎంత.. అలాగే మిగిలిన జస్టిస్‌ల ఆస్తుల వివరాలను ఇప్పుడు తెలుసుకుందాం. సుప్రీం కోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ కె వి విశ్వనాథన్ సూపర్ రిచ్ అని తేలింది. సుదీర్ఘ కాలం న్యాయవాదిగా పనిచేసి అనంతరం సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ విశ్వనాథన్ నియమితులయ్యారు. రూ.120 కోట్ల రూపాయలు పెట్టు-బడులు పెట్టడంతో పాటు గత పది ఏళ్లుగా రూ.91 కోట్ల రూపాయలు ఆదాయపన్ను చెల్లించారు జస్టిస్. సుప్రీంకోర్టులోని మొత్తం 33 మంది న్యాయమూర్తుల్లో నిన్న (సోమవారం) అర్ధరాత్రికి సుప్రీంకోర్టు వెబ్‌సైట్స్‌లో 21 మంది న్యాయమూర్తులు తమ తమ ఆస్తుల వివరాల వెల్లడించారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ కన్నాకు బ్యాంక్ అకౌంట్లో రూ.55.75 లక్షల ఫిక్స్డ్ డిపాజిట్స్ , పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్‌లో రూ. 1.06 కోట్లు- ఉన్నాయి. సౌత్ ఢిల్లీలో టూ బెడ్ రూమ్ డీడీఏ ఫ్లాట్‌తో పాటు- కామన్వెల్త్ గేమ్స్ విలేజ్‌లో ఫోర్ బెడ్ రూమ్ ఫ్లాట్ సంజీవ్ కన్నాకు ఉంది. కూతురితో కలిసి మరో ఫోర్ బెడ్ రూమ్ ఫ్లాట్లో 56శాతం వాటాదారుడుగా సంజీవ్ కన్నా ఉన్నారు. తదుపరి సీజేఐ కానున్న జస్టిస్ గవాయ్‌కు బ్యాంక్ అకౌంట్లో రూ.19.63 లక్షలు, పీపీఎఫ్ అకౌంట్‌లో రూ.6.59 లక్షలు ఉన్నాయి. జస్టిస్ గవాయ్‌కు అమరావతి నాగపూర్‌లో వారసత్వంగా వచ్చిన వ్యవసాయ భూములు కూడా ఉన్నాయి. మహారాష్ట్రలోని అమరావతిలో వారసత్వంగా వచ్చిన ఇల్లుతో పాటు- ముంబై, ఢిల్లీలో రెసిడెన్షియల్ అపార్ట్‌మెంట్స్ ఉన్నాయి. అలాగే జస్టిస్ ఓకాకు పీపీఎఫ్‌లో రూ.92.35 లక్షలు, ఫిక్స్ డిపాజిట్ల రూపంలో రూ.21.76 లక్షలు ఉన్నాయి. జస్టిస్ ఓకాకు మారుతి బలేనో కారు ఉండగా దానిపై రూ.5.1 లక్షల రుణం ఉంది.

# సిబిఐ చీఫ్‌గా ప్రవీణ్ సూద్ కొనసాగింపు

## మరో ఏడాది పదవీకాలం పొడిగింపు



**న్యూఢిల్లీ, మే 6 :** కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ చీఫ్‌గా ప్రస్తుత డైరెక్టర్ ప్రవీణ్ సూద్ మరో ఏడాదిపాటు కొనసాగనున్నారు. ఈ మేరకు కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఆయన పదవీకాలం మరో ఏడాది పొడిగించారు. ఈ మేరకు డిఓపిటి త్వరలో ఉత్తర్వులు ఇవ్వనుంది. ఈనెల 25తో ప్రవీణ్ సూద్ రెండేళ్ల పదవీకాలం ముగియనుంది. ఈ క్రమంలో ఆయన పదవీ కాలం మరో ఏడాది పొడిగిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. 2023, మే 25న సీబీఐ డైరెక్టర్‌గా ప్రవీణ్ సూద్ నియమితులయ్యారు. కాగా నూతన డైరెక్టర్ నియామకంపై సెలెక్ట్ కమిటీ- సమావేశంలో ఏకాభిప్రాయం కుదరలేదు. నూతన సీబీఐ డైరెక్టర్ నియామకం కోసం సోమవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ సంజీవ్ ఖన్నాలతో కుడిన సెలెక్ట్ కమిటీ సమావేశమైంది. తదుపరి డైరెక్టర్ కోసం పలువురు పేర్లతో డివోపిటి జాబితాను రూపొందించింది. ప్రతిపాదిత అధికారుల పేర్లపై సెలెక్ట్ కమిటీలో చర్చ జరిగింది. ఏకాభిప్రాయం కుదరకపోవడంతో ప్రస్తుత డైరెక్టర్ ప్రవీణ్ సూద్ పదవీ కాలాన్ని మరో సంవత్సరం పొడిగించాలని కేంద్రం నిర్ణయం తీసుకుంది. లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సోమవారం ప్రధాని మోదీతో భేటీ అయ్యారు. సౌత్ బ్లాక్‌లోని ప్రధాని కార్యాలయంలో ఈ సమావేశం జరిగింది. పహల్గాం దుర్ఘటన అనంతరం తలెత్తిన పరిస్థితులు, సైన్యం సన్నద్ధతపై రాహుల్‌తో అభిప్రాయాలు పంచుకున్నట్టు సమాచారం. ఈ సందర్భంగా రక్షణ శాఖ కార్యదర్శి రాజేష్ కుమార్ సింగ్, సీనియర్ అధికారులు కూడా పాల్గొన్నారు. నిజానికి ఈ సమావేశం సీబీఐ తదుపరి చీఫ్ ఎంపిక కోసం జరిగింది. సీబీఐ చీఫ్‌ను ప్రధాని, ప్రతిపక్ష నేత, ప్రధాన న్యాయమూర్తులతో కూడిన కమిటీ- ఎంపిక చేయాల్సి ఉంది. దాంతో రాహుల్‌తో పాటు- సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా కూడా ప్రధాని కార్యాలయానికి వచ్చారు. ప్రస్తుత సీబీఐ చీఫ్ ప్రవీణ్ సూద్ ఈ నెలలో పదవీ విరమణ చేయాల్సి ఉంది. సీబీఐ డైరెక్టర్ పదవీకాలం సాధారణంగా రెండేళ్లు ఉంటుంది. అయితే, ప్రత్యేక పరిస్థితుల్లో దీనిని ఐదేళ్ల వరకు పొడిగించే వెసులుబాటు చట్టంలో ఉంది. కర్ణాటక కేడర్‌కు చెందిన 1986 బ్యాచ్ ఐపీఎస్ అధికారి అయిన ప్రవీణ్ సూద్, గతంలో ఆ రాష్ట్ర డీజీపీగా పనిచేశారు. సుబోధ్ కుమార్ జైస్వాల్ స్థానంలో ఆయన 2023 మే నెలలో సీబీఐ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు.

# మెట్రో ఛార్జీల పెంపునకు రంగం సిద్ధం

## నష్టాల నుంచి అధిగమించేందుకు చర్యలు

**హైదరాబాద్, మే 6 :** హైదరాబాద్ మెట్రో రైలు ఛార్జీలను పెంచే అవకాశాలపై తాజాగా సంకేతాలు వెలువడ్డాయి. మెట్రో వర్గాల సమాచారం ప్రకారం, మే రెండో వారంలో సవరించిన టికెట్ రేట్లు అమల్లోకి వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం ఎల్అండ్‌టీ- గ్రూప్ ఛైర్మన్ అమెరికా పర్యటనలో ఉన్నారు. ఆయన భారత్‌కు చేరిన తర్వాతే ఛార్జీల పెంపుపై తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఎల్ అండ్ టీ హైదరాబాద్ మెట్రో సంస్థ ఈ టారిఫ్ సవరణలతో వార్షికంగా అదనంగా రూ.150 కోట్ల వరకు ఆదాయం పొందాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతోంది. ఛార్జీలు పెంచే అంశంపై ఇప్పటికే సంస్థ రాష్ట్ర ప్రభుత్వానికి లేఖల ద్వారా సమాచారం ఇచ్చింది. ప్రస్తుతం మెట్రోలో కనిష్ఠ టికెట్ ఛార్జీ రూ.10 కాగా, గరిష్ఠ ఛార్జీ రూ.60గా ఉంది. ఈ గరిష్ఠ ధరను రూ.75 వరకు పెంచే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇటీవలి నివేదికల ప్రకారం, మెట్రో రైలు సేవలతో పాటు ప్రకటనలు, షాపింగ్ మాల్స్ అద్దె లాంటి ఇతర మార్గాల ద్వారా మెట్రో సంస్థ ఏటా సుమారు రూ.1500 కోట్ల ఆదాయాన్ని నమోదు చేస్తోంది. అయితే మెట్రో నిర్వహణ, ఉద్యోగుల జీతాలు, బ్యాంకు రుణాల వడ్డీలు వంటి ఖర్చులతో కలిపి సంస్థకు వార్షికంగా సుమారు రూ.2000 కోట్ల వ్యయం జరుగుతోందని వర్గాలు తెలిపాయి.

# నగరంలో మరోమారు హైడ్రా దాడులు

- గచ్చిబౌలీ సంధ్యాకన్వెన్షన్‌లో కూల్చివేతలు
- మైలార్‌దేవ్ పల్లిలోనూ ఆక్రమణల తొలగింపు



**హైదరాబాద్, మే 6 :** హైదరాబాద్ నగరంలో హైడ్రా మరోసారి భారీగా కూల్చివేతలను చేపట్టింది. గచ్చిబౌలిలోని సంధ్య కన్వెన్షన్ సెంటర్‌ను లక్ష్యంగా చేసుకొని మినీ హాల్, ఫుడ్ కోర్ట్‌తో పాటు- అనేక అనుమతులు లేని నిర్మాణాలను తొలగించారు. ఉదయం నుంచే మూడు భారీ బుల్డోజర్ల సహాయంతో కూల్చివేతల ప్రక్రియ ప్రారంభమైంది. పోలీసులు ఘటనా స్థలంలో బందోబస్తును ఏర్పాటు చేసి, ఎవరికీ లోపలికి వెళ్లేందుకు అనుమతించలేదు. ఈ కూల్చివేతలు ఫెర్టిలైజర్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఎంప్లాయిస్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ- లేఅవుట్ పరిధిలో నిర్వహించబడ్డాయి. సంబంధిత లేఅవుట్‌కు ప్రభుత్వ అనుమతులు లేకుండానే రోడ్లు, పార్కులు వంటి ఉమ్మడి భూములపై ఆక్రమణలు జరిగాయని తెలుస్తోంది. రోడ్లను ఆక్రమించి నిర్మించిన గదులు, రెస్టారెంట్లు-, ఫుడ్ కోర్టులు వంటి కట్టడాలను హైడ్రా అధికారులు తొలగించారు. ఈ సందర్భంగా పలువురు ప్లాట్ యజమానులు తమ స్థలాలు కనబడకుండా అక్రమ నిర్మాణాలు చేసినట్టు- ఆరోపిస్తూ ఫిర్యాదు చేశారు. అనుమతులు లేకుండా నిర్మించిన వంటగదులు, రెస్ట్‌రూములు, మినీ హాల్ వంటి నిర్మాణాలన్నీ హైడ్రా అధికారుల పర్యవేక్షణలో కూల్చివేశారు. అంతే కాకుండా, జీ ప్లస్ 2 అంతస్థుల్లో నిర్మించిన మూడు ఐరన్ షెడ్లు కూడా తొలగించబడ్డాయి. అదనంగా లేఅవుట్‌ను ఆక్రమించి వేసిన రేకుల ఫెన్సింగ్‌ను కూడా అధికారులు తొలగించారు. నగర శ్రేయస్సు కోసం, భవిష్యత్తులో ఇటువంటి అక్రమ నిర్మాణాలకు తావు లేకుండా ఉండేందుకు ఈ చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు పేర్కొన్నారు. శాసనానుగుణంగా మాత్రమే నిర్మాణాలు చేపట్టాలని, కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇకపోతే రాజేంద్రనగర్ పరిధిలోని మైలార్ దేవ్ పల్లిలో కూడా కూల్చివేతలు చేపట్టింది. స్థానిక ఇందిరా గాంధీ సొసైటీలో ఆక్రమణలను తొలగించారు హైడ్రా అధికారులు. రోడ్డును ఆక్రమించి ప్రహరీగోడ నిర్మించటంతో రాకపోకలకు ఇబ్బందిగా మారిందని హైడ్రకు ఫిర్యాదు చేశారు స్థానికులు. స్థానికుల ఫిర్యాదుతో రంగంలోకి దిగిన హైడ్రా అధికారులు కూల్చివేతలు చేపట్టారు. పోలీసు బందోబస్తు మధ్య కూల్చివేతలు చేపట్టారు అధికారులు. ఈ క్రమంలో హైడ్రా అధికారులతో వాగ్వాదానికి దిగారు ఆక్రమణదారులు.ప్రహారీగోడ నిర్మించిన స్థలం తమదే అంటూ అధికారులతో వాగ్వాదానికి దిగారు ఆక్రమణదారులు. దీంతో ఘటనాస్థలం దగ్గర ఉద్రిక్తత నెలకొంది.



# అందాల పోటీలపై విమర్శలు

## కొట్టి పారేసిన మంత్రి జూపల్లి

**హైదరాబాద్, మే 6 :** హైదరాబాద్ వేదికగా అందాల పోటీలకు రంగం సిద్ధం అయ్యింది. ప్రపంచంలో ఉన్న సుందరీమణులు అంతా హైదరాబాద్ చేరుకుంటున్నారు. తెలంగాణ ఖ్యాతిని విస్తృత పరిచేందుకు ఈ అవకాశాన్ని ప్రభుత్వం బాగాను ఉపయోగించుకుంటోంది. నిజానికి ఇదొక మార్కెట్. ఇక్కడ అతివల అందాన్ని ప్రదర్శించడమన్నది ఒక కళగానేచూడాలి. దీనిపై కొందరు విమర్శలు చేస్తున్నా, తెలంగాణకు మాత్రం ప్రయోజనకారిగానే ఉంటుందని భావించాలి. ఓ పక్క వడ్లు అమ్మేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే.. సిఎం రేవంత్ మాత్రం అందాల పోటీలపై దృష్టి పెట్టారని బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి అందాల పోటీ పట్ల ఉన్న శ్రద్ధ రైతుల పట్ల లేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం.. రైతులను గాలికి వదిలేసిందని మండిపడ్డారు. ఇకపోతే అందాల పోటీలు అతివలను కించపరిచే వని, వారిని తక్కువ చేసి చూపేవిగా ఉంటాయని సిపిఐ నేత నారాయణ అభిప్రాయపడ్డారు. ఇది కూడా నిజం కాదు. ఈ పోటీల వల్ల తెలంగాణ టూరిజం వెలుగులోకి వస్తుంది. మన వస్తువులకు ప్రపంచ మార్కెట్‌లో విలువ పెరుగుతుంది. మరో రకంగా వ్యాపార కార్యకలాపాలు ఊపందుకుంటాయి. అదనంగా మన ఖజానాకు ఆదాయం కూడా వస్తుందనడంలో సందేహం లేదు. టూరిజం ప్రమోషన్, పెట్టుబడుల ఆకర్షణ కోసమే మిస్ వరల్డ్ పోటీలు నిర్వహిస్తున్నామని పర్యాటక శాఖమంత్రి జూపల్లి కృష్ణారావు అభిప్రాయపడ్డారు. తెలంగాణ పర్యాటకాన్ని ప్రపంచానికి చూపిస్తామన్నారు. మిస్ వరల్డ్ పోటీలపై కొందరు రాజకీయ కోణంలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. మిస్ వరల్డ్ పోటీలు ఏ కోణంలో చూస్తే అలా కనిపిస్తాయని.. ఈ ఈవెంట్‌కు వందల కోట్లు ఖర్చుపెట్టడం లేదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కేవలం రూ.5 కోట్లు మాత్రమే ఖర్చు చేస్తోందన్నారు. ప్రభుత్వం ఖర్చు చేసే రూ.5 కోట్లు- కూడా తిరిగి ప్రభుత్వానికి వస్తాయని తెలిపారు.అలాగే తాము ఫార్ములా ఈ రేసును కూడా తప్పు పట్టలేదన్నారు. నిబంధనలు ఉల్లంఘించి చేసిన కోట్ల రూపాయల చెల్లింపులను తప్పు పట్టామని స్పష్టం చేశారు. మమ్మల్ని విమర్శించడమే బీఆర్ఎస్ పని అంటూ మండిపడ్డారు. మాజీ మంత్రి హరీష్ రావుకు రైతుల గురించి మాట్లాడే నైతిక అర్హత లేదన్నారు. బీఆర్ఎస్ పదేళ్లలో పంటలు ఎండినా రైతులకు పంట నష్టపరిహారం ఇచ్చారా అని ప్రశ్నించారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా తాము పరిహారం ఇచ్చామని వెల్లడించారు. బీఆర్ఎస్ హయాంలో తరుగు పేరిట రైతులను దళారులు దోచుకున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ చేసే విమర్శల్లో పసలేదని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు.

# రేవంత్ రెడ్డికి సిఎంగా కొనసాగే హక్కు లేదు

## తక్షణమే తప్పకోవాలి : జగదీశ్ రెడ్డి



**సూర్యాపేట, మే 6 :** రేవంత్ రెడ్డి ఒక్క క్షణం కూడా సీఎం గా కొనసాగేందుకు అర్హత లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత జగదీష్ రెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. ఆయన తక్షణమే రాజీనామా చేసి ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. జగదీశ్ రెడ్డి మాట్లాడుతూ, బీఆర్ఎస్ తొలి నుంచీ చెబుతోన్న విషయం నేడు నిజమవుతుందన్నదని స్పష్టమైందన్నారు. ఓనమాలు రాని వాడిలా పదో తరగతి చదివినట్లున్నది రేవంత్ తీరని ఎద్దేవా చేశారు. తెలంగాణ ఆర్థిక పరిస్థితికి ఎటువంటి ముప్పు లేదని, కానీ రేవంత్ పరిపాలనకు పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. కేసీఆర్ హయాంలో అప్పులనుంచి తెలంగాణ రాష్ట్రానికి రెండున్నర లక్షల కోట్ల ఆదాయం వచ్చిందని, కానీ రేవంత్ పాలనలో రాష్ట్ర ఆదాయం తగ్గిపోగా, మంత్రుల ఆదాయం మాత్రం పెరిగిందని జగదీశ్ రెడ్డి ఆరోపించారు. రాష్ట్ర ఆదాయం లూటీ చేస్తూ ఢిల్లీకి మూటలు మోస్తున్నారు. సీఎం పదవి కోసం మంత్రులు పోటీ- పడి సంపాదనలో మునిగిపోతున్నారని వ్యాఖ్యానించారు. రేవంత్ రెడ్డి హామీలను తప్పించుకునేందుకు దొంగ ఏడుపులు ఏడుస్తున్నారని తీవ్రంగా దుయ్యబట్టారు. సీఎం మాట్లాడిన ప్రతి అక్షరం అబద్ధమని, ఇది ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నమే అని అన్నారు. మాది వందేళ్ళ చరిత్ర, అపార పరిపాలనా అనుభవం. ఒక్క సంవత్సరం మంత్రులు కడుపు కట్టు-కుంటే అన్ని హామీలు అమలయ్యేవని సూచించారు. రేవంత్ రెడ్డి తెలంగాణ పరువు బజార్లో పెట్టారని ఆరోపిస్తూ, రాష్ట్ర మానాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి తెలంగాణ వాసికి ఉందని ఆయన పిలుపునిచ్చారు. ఈ వ్యాఖ్యలతో రాష్ట్ర రాజకీయాల్లో మరింత వేడి పెరిగే అవకాశం కనిపిస్తోంది.

# తెలంగాణ కులగణను అనుసరించండి

## మోడీకి ఖర్గే సుదీర్ఘ లేఖ

**న్యూఢిల్లీ, మే 6 :** దేశవ్యాప్తంగా కులగణన జరపడానికి అన్ని రాజకీయ పార్టీలతో చర్చలు జరపాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మోడీ ప్రభుత్వాన్ని కోరారు. అందరి అభిప్రాయాలతో ముందుకు వెళ్లాలని అన్నారు. ఈ మేరకు ఆయన మోడీకి లేఖ రాశారు. దేశంలో మొట్టమొదటిసారిగా కులగణను తెలంగాణ ప్రభుత్వం చేపట్టింది. కేంద్ర హోంమంత్రిత్వ శాఖ తెలంగాణ కులగణన నమూనాను అనుసరించాలని ఖర్గే లేఖలో మోడీ ప్రభుత్వాన్ని కోరారు. తుది కుల గణన నివేదికలో ఏదీ దాచిపెట్టవద్దని.. ప్రతి కులం యొక్క సామాజిక, ఆర్థిక డేటాను ప్రజలకు చేరువలో ఉంచాలి అని ఆయన మోడీ ప్రభుత్వాన్ని కోరారు. అలాగే రిజర్వేషన్లకు సంబంధించిన విషయంపై కూడా ఖర్గే లేఖలో పేర్కొన్నారు. ఎస్సీ,ఎస్టీ, ఓబిసి రిజర్వేషన్లలో 50 శాతం పరిమితిని కూడా రాజ్యాంగ సవరణ ద్వారా తొలగించేందుకు కులగణన సర్వే ద్వారా స్పష్టమవుతుందని ఆయన లేఖలో తెలిపారు. ఈ కులగణన సర్వే ద్వారా ప్రైవేట్ విద్యా సంస్థల్లో కూడా షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, ఒబిసిలకు రిజర్వేషన్లు కల్పించే ఆర్టికల్ 15(5)ను అమలు చేయాల్సిన అవసరం నెలకొంటుంది అని ఖర్గే లేఖలో పేర్కొన్నారు. మన సమాజంలో వెనుకబడిన అణగారిన వర్గాలకు వారి హక్కులను అందించే కులగణన వంటి ప్రక్రియను నిర్వహించడం ఏవిధంగానూ విభజనగా పరిగణించకూడదు అని ఖర్గే తన లేఖలో పేర్కొన్నారు.

## బావిలో స్నానం చేయడానికి వెళ్లి బాలుడి మృతి



**వలిగొండ రాజముద్ర న్యూస్ :** వ్యవసాయ బావి వద్ద స్నానం చేయడానికి వెళ్లి బావిలో జారి పడి బాలుడు మృతి చెందిన ఘటన వలిగొండ మండలంలోని మునగాల తుర్కపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన పూర్తి వివరాల ప్రకారం. తుర్కపల్లి గ్రామానికి చెందిన బట్టు సుధాకర్ కొడుకు బట్టు చరణ్ (12) అలాగే తన అన్న కొడుకు అయినా బట్టు గౌతమ్ తో కలిసి చరణ్ గౌతమ్ లు ఇద్దరు గ్రామంలోని తుమ్మల బాల్ రెడ్డి బావిలో స్నానం చేయడానికి వెళ్లారు ప్రమాదవశాత్తు చరణ్ బావిలో జారి పడటంతో ఇది గమనించిన గౌతమ్ భయపడి ఇంటికి వచ్చేసాడు. కానీ విషయం ఎవరికీ చెప్పకపోవడంతో సాయంత్రం సమయంలో అతన్ని మందలించడంతో పూర్తి విషయాన్ని వెల్లడించారు దీనితో మృతుని తండ్రి మరి కొంతమంది గ్రామస్తులతో కలిసి బావిలోని నీటిని తోడి మృతదేహాన్ని బయటకి తీశారు. దీనితో కొడుకు విగతజీవిగా పడి ఉండడంతో తల్లిదండ్రులు కన్నీరుగా విలపించారు. ఇట్టి విషయంపై మృతుని తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు వలిగొండ ఎస్సై యుగేందర్ గౌడ్ తెలిపారు.



## రాజీవ్ యువ వికాస్ పథకంలో జర్నలిస్టులకు ప్రాధాన్యత కల్పించాలి

### తెలంగాణా జర్నలిస్ట్ యూనియన్ జిల్లా అధ్యక్షులు షానూర్ బాబా

**యాదాద్రి భువనగిరి రాజముద్ర న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిరుద్యోగుల కోసం ఉపాధి అవకాశం పెంచడానికి ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాస్ పథకంలో జర్నలిస్టులకు ప్రాధాన్యత కల్పించాలని తెలంగాణ జర్నలిస్టు యూనియన్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు మొహమ్మద్ షానూర్ బాబా ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని టీజేయు కార్యాలయంలో జర్నలిస్టు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా పనిచేస్తూ, ఎలాంటి జీతభత్యాలు లేకుండా స్వచ్ఛందంగా సేవలందిస్తున్నారని గుర్తుచేశారు. జర్నలిస్టులకు రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి అవకాశాలు మెరుగుపరచాలని రాజీవ్ యువ వికాసం పథకంలో ప్రాధాన్యత కల్పించి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమం లో తెలంగాణ జర్నలిస్టు యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపరాజు వెంకన్న, రాష్ట్ర నాయకులు సుక్క అశోక్, జి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.




## ఘనంగా మద్దసాని కిరణ్ రెడ్డి జన్మదిన వేడుకలు

**వలిగొండ రాజముద్ర న్యూస్ :** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం లోని మొగిలిపాక గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నాయకులు, మత్స్యగిరి లక్ష్మీ నరసింహస్వామి దేవస్థాన మాజీ ఛైర్మన్ ముద్దసాని కిరణ్ రెడ్డి జన్మదిన సందర్భంగా డైమండ్ యూత్ అసోసియేషన్ అధ్వర్యంలో మొగిలిపాక గ్రామం నుండి వలిగొండ వరకు సుమారు 100 మందితో బైక్ ర్యాలీ చేసి వలిగొండ ప్రభుత్వ ఆసుపత్రి మరియు రాజీవ్ గాంధీ చౌరస్తా దగ్గర కేక్ కటింగ్ చేసి పండ్ల పంపిణీ కార్యక్రమం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మాజీ ఎంపీటీసీ తుమ్మల వెంకట్ రెడ్డి, మండల పార్టీ టౌన్ అధ్యక్షుడు మహమ్మద్ అఫ్రోజ్, మొగిలిపాక గ్రామ శాఖ అధ్యక్షులు భీమనబోయిన భిక్షపతి, డైమండ్ యూత్ అధ్యక్షులు జడిగే స్వామి, గ్రామ సర్పంచ్ శంకరయ్య, మాజీ ఎంపీటీసీ రమేష్ , మాజీ ఉప సర్పంచ్ నరసింహ మరియు డైమండ్ యూత్ సభ్యులు, కిరణ్ రెడ్డి అభిమానులు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



## అక్రమంగా నివసిస్తున్న పాకిస్తాన్ వాసులను వెంటనే బహిష్కరించాలి

**వికారాబాద్, రాజముద్ర న్యూస్:** భారతదేశంలో అక్రమంగా నివసిస్తున్న పాకిస్తాన్ జాతీయులను బహిష్కరించేందుకు తక్షణ చర్య తీసుకోవడం కోసం వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతి జైన్ కు భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో వికారాబాద్ జిల్లా అధ్యక్షులు కొప్పుల రాజశేఖర్ రెడ్డి వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా అధ్యక్షులు కోకట్ మాధవ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సదానంద్ రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ శ్రీధర్ రెడ్డి, అసెంబ్లీ కోఆర్డినేటర్ వడ్ల నందు, పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ అమరేందర్ రెడ్డి, డి ఆర్ యు సి సి రైల్వే కమిటీ మెంబర్ నరోత్తం రెడ్డి, బిజెపి సీనియర్ నాయకులు జి ఎస్ సి ఆర్ డబ్ల్యు మెంబర్ సుధాకర్ ఆచారి, రాములు, నరసింహారెడ్డి, రాఘవేందర్, శ్రీకాంత్ రెడ్డి, విక్రమ్, సురేందర్ రెడ్డి, హనుమంతు, చందూలాల్, వెంకట్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి పాల్గొన్నారు.

# రైల్వేలో భద్రత చర్యలను చేపట్టాలి

- రైల్వే ప్రమాదాలను అరికట్టాలి
- వికారాబాద్ రైల్వే స్టేషన్ వద్ద సిపిఎం సిఐటియు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా



**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** వికారాబాద్ సిఐటియు కమిటీ ఆధ్వర్యంలో వికారాబాద్ రైల్వే స్టేషన్ వద్ద మంగళవారం ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఆర్ మహిపాల్ సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ రైల్వేలో భద్రతా చర్యలు పెంచాలని, ప్రయాణికులు, సిబ్బంది ప్రాణాలు కాపాడాలని అన్నారు. రైల్వే రంగంలో ప్రైవేటీకరణను ఆపాలి అని కోరారు. దేశములో ఇటీవల వరుసగా అనేక రైలు ప్రమాదాలు జరుగుతున్నాయి ప్రయాణికులు, లోకో పైలట్లు, ట్రైన్ మేనేజర్లు, ట్రాక్ మెయింటైనర్లు వివిధ రకాల రైల్వే కార్మికులు ఉద్యోగులు పెద్ద సంఖ్యలో చనిపోతున్నారని అన్నారు. వేలాదిమంది గాయపడతు, దీనితో వేలాది కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని తెలిపారు. ఇంతటి ప్రాధాన్యత కలిగిన రైల్వే వ్యవస్థను కేంద్ర బిజెపి ప్రభుత్వం పూర్తిగా ప్రైవేటీకరించడానికి ప్రయత్నం చేస్తున్నదని, ఈ నేపథ్యంలో రైల్వే రంగంలో భద్రతా చర్యలు పెంచాలని, ప్రమాదాలను అరికట్టాలని అన్నారు. దేశంలో 2014- 2019 కాలములో జరిగిన రైలు ప్రమాదాలలో 469 మంది ప్రాణాలు కోల్పోయారు. 1275 మంది గాయపడ్డారు 2023- 24 సంవత్సరములో 350 మంది ప్రయాణికులు మరణించగా 1000 మందికి పైగా గాయపడ్డారు. వీరిలో ఎక్కువమంది సామాన్య ప్రజలు వలస కార్మికులు ఉన్నారు. 2017- 22 మధ్య కాలంలో జరిగిన ప్రమాదంలో 450 మంది ట్రాక్ నిర్వాహక ఉద్యోగులు, కార్మికులు ప్రాణాలు కూల్ పోవడం జరిగిందన్నారు. కాలం చెల్లిన రైల్వే సిగ్నల్ వ్యవస్థను, ట్రాక్ సిస్టంను పునరుద్ధరించాలని 2017లో రైల్వే టాస్క్ ఫోర్స్ కమిటీ చెప్పింది. రక్షక్ అనే పేరుతో రైల్ సిగ్నల్ వ్యవస్థను రైల్వే బోర్డు 2018లో ఆమోదించింది. దేశీయ నైపుణ్యంతో రైల్వే భద్రత కోసం కవచ్ అనే సాంకేతిక వ్యవస్థను తెస్తున్నామని 5సంవత్సరాల క్రితం ప్రకటించి సరిపడ నిధులు మంజూరు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నదని అన్నారు. చాలా సంవత్సరాలుగా రైల్వేలో భద్రత సంబంధించిన పోస్టులతో సహా వివిధ క్యాడర్లలో లక్షలాది పోస్టులు ఖాళీగా ఉన్న వీటిలో లోకో పైలట్ పోస్టులే సుమారు 20వేల వరకు ఉన్నాయి, తక్కువ సిబ్బందితో పని భారం పెరుగుతుందని తెలిపారు. రోజుకు 14 గంటలు పనిచేయాల్సి వస్తుంది, కొన్నిసార్లు వరుసగా నాలుగు రోజులు రాత్రి షిఫ్ట్ కూడా చేయవలసిన దుస్థితి నెలకొన్నదని అన్నారు. వారాంతపు సెలవులు కూడా ఇవ్వడం లేదు. దీనికి తోడు సిగ్నల్ వ్యవస్థ లోపాలు కూడా తోడవుతున్నాయి ఇన్ని లోపాలు ఇబ్బందుల మధ్య పని చేస్తున్న సిబ్బందికి రక్షణ లేకుండా పోయింది, రోజుకు కోటి 50 లక్షల మందికి రవాణా సౌకర్యంగా ఉన్న రైల్వే రంగాన్ని పటిష్టంగా అమలు జరపకుండా ప్రాథమిక బాధ్యతనుండి ప్రభుత్వం తప్పించుకుంటుందని తెలిపారు. కోవిడ్ తర్వాత సాధారణ ప్యాసింజర్ రైళ్లను బాగా తగ్గించారు. సుమారు 160 సర్వీసులను నిలిపివేశారు. ఎక్స్ప్రెస్ రైళ్లలో సాధారణ కంపార్ట్మెంట్ల సంఖ్య తగ్గిపోయింది. వాటి స్థానములో వందే భారత్, డైనమిక్ చార్జీల వంటి రైలను ప్రవేశపెట్టారు. సీనియర్ సిటిజెన్లు, పిల్లలు, వికలాంగులు మొదలైన వారికి ఇచ్చే రాయితీలు పూర్తిగా తొలగించేశారు. రైల్వే స్టేషన్లు, రైల్వే ట్రాక్లు, గూడ్స్ షెడ్లను, వాటి నిర్వహణ, పరిపాలన ప్రైవేట్ కాంట్రాక్టర్లకు కట్టబెడుతున్నారు. రైల్వే ప్రైవేటీకరణ వలన సరుకు రవాణా చార్జీ పెరగటంతో వస్తువుల ధరలు పెరుగుతాయి. భద్రత పట్ల నిర్లక్ష్యం, కార్పోరేట్ లాభాలు పెంచడం కోసం రైల్వేను కేంద్ర ప్రభుత్వం బరితెగించి ప్రైవేటీకరిస్తున్నదని అన్నారు. ఈ పరిస్థితులలో రైళ్లు సురక్షితంగా నడిచేటట్లు, ప్రమాదాల నుండి ప్రయాణికులు, రైల్వే ఉద్యోగుల ప్రాణాలకు రక్షణ చర్యలు తీసుకోవాలని, రైల్వే వ్యవస్థ ప్రైవేటీకరణ ఆపాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని అన్నారు. రైల్వే ప్రయాణికులకు భద్రతకు సరైన చర్యలు చేపట్టాలి. ఖాళీగా ఉన్న అన్ని రకాల పోస్టులను భర్తీ చేయాలి. విస్తరణ, భద్రత కోసం అవసరమైన నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీఐటీయూ నాయకులు మహిపాల్, యాదయ్య, దశరథ్, నర్సింలు, శ్రీనివాస్, మల్లేష్, యాదయ్య, జంగయ్య, రాములు, షబీర్, జహంగీర్, రహీం, రవి, కుమార్, వెంకట్, అశోక్ తదితరులు పాల్గొన్నారు .

## ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పారదర్శకంగా నిర్వహించాలి





**వలిగొండ రాజముద్ర న్యూస్ :** ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా ముఖ్య కార్యనిర్వహణాధికారి ఎన్. శోభారాణి అన్నారు. ఈ సందర్భంగా వలిగొండ మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించి మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు ఈజీఎస్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం వలిగొండ మండలంలోని పైలెట్ గ్రామమైన నాతాళ్ళగూడెం గ్రామంలోని ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పనులను పరిశీలించారు. జూకంటి మనోహర అనే లబ్ధిదారు ఇంటి నిర్మాణాన్ని పరిశీలించి త్వరగా పూర్తి చేసుకోవాలని కోరారు. అదే విధంగా నర్సరీని సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. అక్కంపల్లిలోని ఐకెపి సెంటర్ ను సందర్శించి రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జితేందర్ రెడ్డి, ఎంపీఓ కేదారేశ్వర్, ఏపీఓ జానీ ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## మాట మార్చిన భుట్టో..

### భారత్‌తో 'శాంతి'ని కోరుకుంటున్నాం



**పాకిస్థాన్ :** పహల్గాం దాడి నేపథ్యంలో పాకిస్థాన్‌తో సింధూ జలాల ఒప్పందాన్ని రద్దు చేస్తూ భారత్ నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. దానిపై మొదట్లో నోరు పారేసుకున్న పాకిస్థాన్ విదేశాంగ మాజీ మంత్రి బిలావల్ భుట్టో.. సింధూనదిలో నీరు పారకుంటే రక్తం పారుతుందంటూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశాడు. తాజాగా ప్రతీకార చర్యలకు భారత్ సన్నద్ధమవుతున్న వేళ స్వరం మార్చిన ఆయన.. శాంతి చర్చలకు పాకిస్థాన్ సిద్ధంగానే ఉందని చెప్పాడు. అయితే, విధ్వంసం కావాలా? శాంతి కావాలో భారత్ నిర్ణయించుకోవాలంటూ మరోసారి విషం చిమ్మాడు. పాకిస్థాన్ నేషనల్ అసెంబ్లీలో పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ ఛైర్మన్ బిలావల్ భుట్టో మాట్లాడుతూ.. "భారత్ శాంతి మార్గంలో వెళ్లాలని భావిస్తే.. పిడికిలి బిగించకుండా స్వేచ్ఛగా రానివ్వండి. కల్పితాలు కాకుండా వాస్తవాలతో రానివ్వండి. పొరుగువారిగా వారితో కూర్చొని నిజాలు మాట్లాడుదాం. అలా కాదనుకుంటే.. పాక్ ప్రజలను మోకరిల్లేలా చేయలేరని విషయాన్ని వారు గుర్తుంచుకోవాలి. పోరాటం చేసేందుకు పాక్ ప్రజలు సిద్ధమే. యుద్ధంపై ఇష్టంతో కాదు, స్వేచ్ఛపై ప్రేమతో మాత్రమే" అని బిలావల్ భుట్టో పేర్కొన్నాడు. ఉగ్రవాద సంస్థలకు మద్దతు, ఆర్థిక సాయం పాక్ అందించిందని పాకిస్థాన్ రక్షణశాఖ మంత్రి ఖవాజా ఆసిఫ్ చేసిన వ్యాఖ్యలతో భుట్టో ఇటీవల ఏకీభవించాడు. ఉగ్రవాద సంస్థలతో పాకిస్థాన్‌కు సంబంధాలు నిజమేనని అంగీకరించాడు. అయితే, అది ముగిసిన అధ్యాయమని.. అది తమ చరిత్రలో ఒక దురదృష్ట భాగమంటూ పేర్కొన్నాడు. ఉగ్రవాదానికి పాక్ బాధిత దేశమని, దాన్ని ఎన్నడూ ప్రోత్సహించలేదన్నాడు.

**ఐరాసలో చుక్కెదురు..** మరోవైపు భారత్‌కు వ్యతిరేకంగా భద్రతా మండలిలో తీర్మానం చేయించాలన్న పాక్ యత్నాలు మరోసారి బెడిసికొట్టాయి. ఫలితంగా దాయాదికే సభ్య దేశాల నుంచి కఠిన ప్రశ్నలు ఎదురయ్యాయి. ఉగ్రదాడికి పాల్పడిన వారు జవాబుదారీగా ఉండాలని తేల్చిచెప్పాయి. పహల్గాం దాడిలో లష్కరే తోయిబా పాత్రను ప్రశ్నించాయి. అంతేకాదు.. మతం ఆధారంగా అమాయకులను చంపడంపై ఆందోళన వ్యక్తం చేశాయి. భారత్‌తో ద్వైపాక్షిక చర్చల ద్వారానే సమస్యలను పరిష్కరించుకోవాలని పాకిస్థాన్‌కు చాలా దేశాలు సలహా ఇచ్చాయి.

## ఎమ్మిగనూరు టెక్స్‌టైల్ పార్క్ అభివృద్ధికి కృషి

### చేనేతలు అండగా బాబు సర్కార్ : మంత్రి సవిత

**అమరావతి, మే 6 :** సీఎం చంద్రబాబు పాలన చేనేతలకు స్వర్ణయుగం లాంటింది మంత్రి సవిత తెలిపారు. 200ల యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తున్నాం.. ప్రతి నెలా చేనేత ఎగ్జిబిషన్ లు పెడుతున్నాం.. చేనేతలకు 50 ఏళ్లకే పెన్షన్ ఇస్తున్నాం.. చేనేతలకు లేటెస్ట్ డిజైన్ సెంటర్లను ఏర్పాటు చేసి మొబైల్ షాప్స్ ను పెంచుతాం.. 90 శాతం సబ్సిడీతో ఫ్రెమ్స్, ఇతర పరికరాలను అందిస్తామని చెప్పుకొచ్చింది. ఈ నెలాఖరికి క్రిప్ట్ ఫండ్ ను ఏర్పాటు చేస్తాం.. ఎమ్మిగనూరు టెక్స్‌టైల్స్ పార్క్ ను అభివృద్ధి చేసి రానున్న రోజుల్లో చంద్రబాబుతోనే ప్రారంభిస్తామని మంత్రి సవిత వెల్లడించింది. ఇక, రాష్ట్రంలో 1000 ఎకరాల ల్యాండ్ ఉంటే రిలయన్స్ 65 వేల కోట్ల రూపాయలతో సీబీజీ ప్లాంట్ పెట్టేందుకు సిద్ధంగా ఉందని మంత్రి సవిత తెలిపారు. ఏపీఐఐసీ ద్వారా 7 కోట్ల రూపాయలతో టెక్స్ టైల్ పార్క్‌ను మొదటి దశలో 20 ఎకరాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తాం అని తేల్చి చెప్పారు. ఈ పనులు 3 నెలల్లో పూర్తి చేస్తాం అన్నారు. అలాగే, 20 లక్షల ఉద్యోగలు ఇవ్వాలనే లక్ష్యంతోనే నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కులను పెడుతున్నామన్నారు.



## విజ్ఞాన్ స్కూల్ విద్యార్థిని అభినందించిన యశీల్ గౌడ్

### జిల్లా మొదటి ర్యాంకు సాధించిన విద్యార్థినికి ఆర్థిక సాయం అందించిన జెవైజీ ఫౌండేషన్

**భువనగిరి రాజముద్ర న్యూస్:** యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణంలోని విజ్ఞాన్ హై స్కూల్ చెందిన విద్యార్థినికి ఇటీవల విడుదలైన పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో జిల్లా మొదటి ర్యాంకు సాధించిన ఎం. అక్షయ ను జె వై జి ఫౌండేషన్ అధినేత టిఆర్ఎస్ జిల్లా యువ నాయకులు యశీల్ గౌడ్ అక్షయను శాలువాతో సత్కరించి 10వేలు ఆర్థిక సహాయం అందజేశారు. జిల్లా స్థాయి మొదటి ర్యాంకు సాధించడానికి కృషి చేసిన విజ్ఞాన్ పాఠశాల చైర్మన్ పగిడాల జలంధర్ రెడ్డిని అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థులు పై చదువుల కొరకు ఫౌండేషన్ ఎల్లప్పుడు అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన్ హై స్కూల్ కరస్పాండెంట్ పగిడాల పురేందర్ రెడ్డి విద్యార్థి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



## పాడి రైతు కుటుంబానికి ఆర్థిక సహాయం

### మదర్ డైరీ డైరెక్టర్ బత్తుల నరేందర్ రెడ్డి

**ఆలేరు రాజముద్ర న్యూస్:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం రాఘవాపురం గ్రామానికి చెందిన మద్దెల నరసయ్య అనే పాడి రైతు మరణించగా ఆయన భార్య అంజమ్మకు నార్ముల్ మదర్ డైరీ యూనియన్ తరపున పదివేల రూపాయల ఆర్థిక సహాయాన్ని మదర్ డైరీ డైరెక్టర్ బత్తుల నరేందర్ రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో, రాఘవపురం పాల సంఘం అధ్యక్షులు బండ మల్లేష్, మంతపురి పాల సంఘం అధ్యక్షులు పసుల సతీష్ రెడ్డి, ఆలేరు పాల కేంద్ర మేనేజర్ ఎం సత్యనారాయణ, ఫీల్డ్ సూపర్వైజర్ ఇ ప్రభాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ బేబీ కిట్ల పథకం పునరుద్ధరణ

**అమరావతి, మే 6 :** గత ప్రభుత్వ హయాంలో నిలిపివేసిన ఎన్టీఆర్ బేబీ కిట్ల పథకాన్ని ఎన్డీయే కూటమి ప్రభుత్వం పునరుద్ధరించింది. రూ. 1,410తో 11వస్తువులను బేబీ కిట్ ద్వారా పంపిణీ చేయనున్నది. రాష్ట్ర బడ్జెట్ నుంచి ఖర్చు చేయాలన్న ప్రతిపాదనకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆమోదం తెలిపారు. గతంలో ప్రజాదరణ పొందిన ఈ బేబీ కిట్ ల సరఫరా పథకాన్ని పునరుద్ధరించాలన్న ప్రతిపాదనకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అయితే, 2014-19 మధ్య అమలు చేసిన ఈ పథకాన్ని గత వైసీపీ ప్రభుత్వం రద్దు చేసింది. నవజాత శిశువుల ఆరోగ్యం కోసం 11 వస్తువులతో కూడిన బేబీ కిట్ ను అందజేస్తుంది. అయితే, దోమ తెరతో కూడిన బెడ్, వాటర్ ప్రూఫ్ కాట్ షీట్, బేబీ డ్రెస్, వాషబుల్ నేప్కిన్స్, టవల్, బేబీ పౌడర్, బేబీ షాంపూ, బేబీ ఆయిల్, బేబీ సోప్, సోప్ బాక్స్, బేబీ రాటిల్ టాయ్స్ ఈ బేబి కిట్ లో ఉండనున్నాయి. రాష్ట్రంలో సగానికి పైగా ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు జరుగుతున్నాయి. ఎన్డీయే కూటమి ప్రభుత్వ నిర్ణయంతో త్వరలోనే తల్లులకు ఎన్టీఆర్ బేబీ కిట్ల పంపిణీ జరగనుంది.

www.rajamudranews.com
రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక



## రిజర్వేషన్ రైలు బోగీ లాంటిది..

### సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ :** రిజర్వేషన్లను ఉద్దేశించి సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. దేశంలోని కుల ఆధారిత రిజర్వేషన్లు రైలు బోగీల్లాంటివని అత్యున్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. ఆ కంపార్ట్‌మెంట్‌లోకి ప్రవేశించిన వ్యక్తులు ఇతరులను లోపలికి రానివ్వరని పేర్కొంది. మహారాష్ట్ర స్థానిక ఎన్నికల్లో ఓబీసీ రిజర్వేషన్లపై వేసిన పిటిషన్ విచారణలో భాగంగా సుప్రీం న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఈవిధంగా స్పందించారు. మహారాష్ట్రలో 2016–17లో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగాయి. ఓబీసీ కోటా విషయంలో జరుగుతోన్న న్యాయపోరాటంలో ఎన్నికల నిర్వహణలో జాప్యం చోటుచేసుకుంటోంది. ఓబీసీలకు 27 శాతం కోటాను అమలుచేయడం కోసం మహారాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆర్డినెన్స్‌ను 2021లో సుప్రీంకోర్టు కొట్టివేసింది. కాగా.. ఓబీసీలకు సంబంధించిన డేటా ఉన్నప్పటికీ, దానిని ప్రభుత్వం ఉపయోగించడం లేదని తాజాగా పిటిషనర్ తరఫు న్యాయవాది కోర్టులో వాదించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసిన అధికారుల ద్వారా స్థానిక సంస్థలను ఏకపక్షంగా నడుపుతోందని ఆరోపించారు. రిజర్వేషన్ల ప్రయోజనాన్ని పొందేందుకు ఓబీసీలలోనే వెనకబడిన వారిని గుర్తించాలని మరో న్యాయవాది తన వాదనను వినిపించారు. ఈ క్రమంలోనే న్యాయమూర్తి స్పందించారు. "దేశంలో రిజర్వేషన్లు రైలు కంపార్ట్‌మెంట్ల మాదిరిగా మారాయి. అందులోకి ప్రవేశించిన వ్యక్తులు ఇతరులను లోపలికి రానివ్వరు. అయితే ప్రభుత్వాలు మరిన్ని వెనకబడిన తరగతులను గుర్తించాలి. రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా వెనకబడిన వ్యక్తులు ఉన్నారు. వారు రిజర్వేషన్ ప్రయోజనం ఎందుకు పొందకూడదు..? కొన్ని కుటుంబాలు, సమూహాలు మాత్రమే ప్రయోజనం పొందుతున్నాయి" అని ఆయన అన్నారు.



## రోడ్డు ప్రమాద బాధితులకు రూ.1.5 లక్షల వరకు ఉచిత వైద్యం

- గరిష్ఠంగా ఏడు రోజులదాకా చికిత్స
- నోటిఫికేషన్ జారీ చేసిన కేంద్రం

**న్యూఢిల్లీ :** రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన క్షతగాత్రులకు రూ. 1.5 లక్షల వరకూ ఉచిత వైద్యం అందించడానికి వీలు కల్పిస్తూ కేంద్ర రహదారుల రవాణాశాఖ సోమవారం రాత్రి నోటిఫికేషన్ జారీ చేసింది. సోమవారం నుంచే ఇది అమల్లోకి వచ్చినట్లు అందులో ప్రకటించింది. రోడ్డు ప్రమాద బాధితులకు గోల్డెన్ అవర్‌లో ఉచిత వైద్యం అందించాలని సుప్రీంకోర్టు గత జనవరిలో తీర్పు వెలువరించిన నేపథ్యంలో కేంద్రం ఇప్పుడు నోటిఫికేషన్ జారీ చేసింది. ఇందుకు 'క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్ ఆఫ్ రోడ్ యాక్సిడెంట్ విక్టిమ్స్ స్కీం–2025'గా నామకరణం చేసింది. మోటారు వాహనం కారణంగా ఏ రహదారిలో ప్రమాదానికి గురైనా ఈ పథకం కింద ఆసుపత్రుల్లో రూ. 1.50 లక్షల వరకూ నగదు రహిత వైద్య సేవలు పొందడానికి అర్హులవుతారు. ప్రమాదం జరిగిన నాటి నుంచి ఏడు రోజులదాకా ఈ సేవలు పొందవచ్చు. రోగులకు ట్రామా, పాలీట్రామా సేవలు అందించగల సామర్థ్యం ఉన్న అన్ని ఆసుపత్రులనూ ఈ పథకం కిందికి తీసుకురావడానికి రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వం ఈ నోటిఫికేషన్‌లో సూచించింది. రోడ్డు ప్రమాద బాధితుడిని ఆసుపత్రికి తెచ్చిన వెంటనే వైద్య సేవలు ప్రారంభించాల్సి ఉంటుంది. ఒకవేళ తమవద్ద సౌకర్యాలు లేకపోతే వెంటనే మరో ఆసుపత్రికి పంపాల్సి ఉంటుంది. అందుకోసం సదరు ఆసుపత్రివారే రవాణా సౌకర్యాలు కల్పించాలి. బాధితుడు డిశ్చార్జి అయిన తర్వాత వైద్య సేవలు అందించిన ఆసుపత్రి అందుకు సంబంధించిన బిల్లును ప్యాకేజీకి అనుగుణంగా పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.



## అత్యంత కఠినమైన జైలు మళ్లీ ఓపెన్

**న్యూయార్క్:** అమెరికాలోనే అత్యంత కఠినమైన, 60 ఏళ్ల కిందట మూతపడిన అల్కాట్రాజ్ జైలును తెరవాలని అధ్యక్షుడు ట్రంప్ నిర్ణయించారు. కాలిఫోర్నియాలోని ద్వీపంలో ఉండే ఈ జైలును తెరవాలని అధికారులకు ఆదేశాలిచ్చానని ఆయన వెల్లడించారు. ఈ జైలు నుంచి అమెరికా ప్రధాన భూభాగంలోకి రావడం అత్యంత కష్టం. 'చాలాకాలంగా అమెరికా దుర్మార్గమైన, హింసాత్మకమైన.. తరచూ నేరాలు చేసే వారివల్ల ఇబ్బందులు పడుతోంది. వారు దేశానికి ఎటువంటి సేవలు అందించకపోగా బాధపెడుతున్నారు. గతంలో ఇటువంటి అత్యంత ప్రమాదకరమైన నేరగాళ్లను అత్యంత దూరంగా ఉండే జైళ్లలో ఉంచాం. ప్రజలకు ఎటువంటి హాని చేయలేనంత దూరంలో వారిని పెట్టాం. అటువంటి కఠిన శిక్షలను మళ్లీ తేవాల్సిన అవసరం ఉంది. అందుకే మళ్లీ ఆ జైలును పునర్నిర్మించి తెరవాలని జైళ్లశాఖ, న్యాయశాఖ, ఎఫ్‌బీఐ, హోంలాండ్ భద్రతా విభాగాలను ఆదేశించా' అని ట్రంప్ తన సోషల్ మీడియా వేదిక 'ట్రూత్'ద్వారా ఆదివారం సాయంత్రం వెల్లడించారు. బలమైన సముద్ర అలలతోపాటు అత్యంత చల్లని పసిఫిక్ నీటితో నిండి ఉండే అల్కాట్రాజ్ జైలు ఖైదీలకు నరకం లాంటిది. 'ద రాక్' అని పిలిచే ఈ జైలులో గ్యాంగ్‌స్టర్ అల్ కాపోన్, జార్జ్ మెషీన్ గన్ కెల్లీ లాంటి కరడుగట్టిన నేరగాళ్లను ఉంచారు. దీనిపై సినిమాలూ నిర్మితమయ్యాయి. 29 ఏళ్లపాటు మనుగడలో ఉన్న ఈ జైలు నుంచి తప్పించుకోవడానికి 36 మంది 14 సార్లు ప్రయత్నించారు. వారందరూ దొరికిపోయారు. అధిక నిర్వహణ ఖర్చుల కారణంగా 1963లో ఈ జైలును మూసివేశారు. ప్రస్తుతం అల్కాట్రాజ్ ద్వీపాన్ని పర్యాటక కేంద్రంగా మార్చారు.

# పోరాడండి.. వెనకుంటాం

### భారత్‌కు అమెరికా హామీ

**యూఎస్ :** పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడి నేపథ్యంలో భారత్, పాకిస్థాన్‌ల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. తాజా పరిణామాల వేళ అమెరికా కీలక ప్రకటన చేసింది. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా న్యూదిల్లీ చేసే పోరాటానికి తాము అండగా ఉంటామని పునరుద్ఘాటించింది. ఈ మేరకు అగ్రరాజ్య ప్రతినిధుల సభ స్పీకర్ మైక్ జాన్సన్ వెల్లడించారు. "ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్ బలంగా నిలబడాలి. అందుకోసం న్యూదిల్లీ చేసే అన్ని ప్రయత్నాలకు మేం మద్దతు అందిస్తాం. ఉగ్రవాదంపై పోరాటం కోసం భారత్‌కు శక్తివనరులతో సహకారం అందిస్తాం. ఇరు దేశాల మధ్య సంబంధాల్లో ఇది కూడా భాగమే. భారత్‌తో బంధం ఎంత ముఖ్యమో ట్రంప్ యంత్రాంగం అర్థం చేసుకుంది. ఉగ్రవాదం నుంచి ఎదురయ్యే ముప్పు ఎలాంటిదో కూడా మాకు తెలుసు" అని మైక్ జాన్సన్ వివరించారు. ఈ విషయంలో గతంలోనూ అగ్రరాజ్యం భారత్‌కు మద్దతుగా నిలిచిన సంగతి తెలిసిందే. ఏప్రిల్ 22న పహల్గాంలో ఉగ్రదాడి జరిగిన తర్వాత అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. భారత్ ప్రధాని మోదీతో ఫోన్‌లో మాట్లాడారు. ఉగ్రదాడిని తీవ్రంగా ఖండించిన ట్రంప్.. ఈ దుశ్చర్యకు పాల్పడిన వారికి శిక్ష పడేలా తీసుకునే చర్యలకు సహకారం అందిస్తామన్నారు. ఉగ్రవాద పోరులో ఇరుదేశాలు



కలిసి పోరాడుతాయని అగ్రరాజ్యాధినేత తెలిపారు. పహల్గాం దాడికి పాల్పడినవారిని కలలో కూడా ఊహించనివిధంగా శిక్షిస్తామని ఇప్పటికే ప్రధాని మోదీ హెచ్చరించిన సంగతి తెలిసిందే. ఆ దిశగా కేంద్రం కీలక నిర్ణయాలకు సిద్ధమవుతున్నట్లు సంకేతాలు కన్పిస్తున్నాయి. అన్ని రాష్ట్రాల్లో యుద్ధ అప్రమత్తతకు కేంద్రం పిలుపునివ్వడం దీనికి బలాన్ని చేకూరుస్తోంది. గగనతల దాడుల గురించి హెచ్చరించే సైరన్ల వ్యవస్థ పనిచేసేలా చూడాలని, ఇతరత్రా స్వీయరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించాలని కేంద్ర హోంశాఖ సోమవారం అన్ని రాష్ట్రాలను, కేంద్రపాలిత ప్రాంతాలను ఆదేశించింది. దీనిపై నేడు సమీక్ష కూడా చేపట్టారు.

## హార్వర్డ్‌పై ట్రంప్ కొరడా.. ఫెడరల్ నిధులు నిలిపివేత

**న్యూయార్క్ :** హార్వర్డ్ యూనివర్సిటీ విషయంలో ట్రంప్ యంత్రాంగం అన్నంతపని చేసింది. ఆ విశ్వవిద్యాలయానికి అందించే ఫెడరల్ నిధులను నిలిపివేస్తున్నట్లు అమెరికా ప్రభుత్వంలోని విద్యాశాఖ మంత్రి లిండా మెక్‌మాన్ ప్రకటించారు. విశ్వవిద్యాలయంపై నియంత్రణ ఆశిస్తూ కొన్ని విధాన పరమైన మార్పులు తీసుకురావాలని విశ్వవిద్యాలయానికి సూచించినప్పటికీ.. దానికి ససేమిరా అనడంతో విశ్వవిద్యాలయం బడ్జెట్, పన్ను మినహాయింపుల్లో కోతలు విధిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ డిమాండ్లను నెరవేర్చే వరకు హార్వర్డ్‌కు ఎటువంటి కొత్త గ్రాంట్లు మంజూరుచేయమని స్పష్టం చేశారు. ఫెడరల్ పరిశోధన గ్రాంట్లకు మాత్రమే ఈ నిషేధం వర్తిస్తుందని.. యూనివర్సిటీ ట్యూషన్ ఫీజులను చెల్లించడానికి విద్యార్థులకు సహాయపడే ఫెడరల్ ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం కొనసాగిస్తుందని విద్యాశాఖ పేర్కొంది. కొత్త గ్రాంట్లకు అర్హత పొందడానికి హార్వర్డ్.. ఫెడరల్ ప్రభుత్వంతో చర్చలు జరపాల్సి ఉంటుందని మెక్‌మాన్ తెలిపారు. అమెరికా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు చేపడుతున్న విదేశీ విద్యార్థులకు హార్వర్డ్‌లో ప్రవేశం కల్పిస్తూ.. దేశ అత్యున్నత విద్యావ్యవస్థను అపహాస్యం చేసిందని ఆరోపించారు. మరోవైపు విశ్వవిద్యాల యంపై జాతి వివక్షపై ఫిర్యాదులు వచ్చాయని, వాటిపై విచారణ కొనసాగుతోందని పేర్కొన్నారు.



#### చట్టవిరుద్ధ చర్యలను వ్యతిరేకిస్తూనే ఉంటాం: హార్వర్డ్

అమెరికా ప్రభుత్వం ఫెడరల్ నిధులను నిలిపివేయడాన్ని హార్వర్డ్ విశ్వవిద్యాలయం వ్యతిరేకించింది. ప్రభుత్వం చేసే చట్టవిరుద్ధమైన డిమాండ్లను పాటించడానికి నిరాకరించడంతో సమాఖ్య ప్రభుత్వం విశ్వవిద్యాలయంపై ఇటువంటి చర్యలు తీసుకుంటోందని హార్వర్డ్ అధ్యక్షుడు అలాన్ గార్బర్ పేర్కొన్నారు. ప్రభుత్వం తమను ఎన్నిరకాలుగా అణచివేయడానికి ప్రయత్నించినా పోరాడుతూనే ఉంటామని అన్నారు. విదేశీ విద్యార్థుల అక్రమ, హింసాత్మక కార్యకలాపాల రికార్డులను సమర్పిస్తేనే కొత్తగా విదేశీయులను చేర్చుకునేందుకు అనుమతి స్తామని వైట్‌హౌజ్ గతవారం హార్వర్డ్ విశ్వవిద్యాలయానికి స్పష్టం చేసింది. రికార్డులను సమర్పించకపోతే వర్సిటీకున్న ప్రవేశాల అర్హతను రద్దు చేస్తామని హెచ్చరించింది. ఈ పరిణామాలపై హార్వర్డ్ స్పందిస్తూ.. ప్రభుత్వ డిమాండ్లకు ఏమాత్రం తలొగ్గేది లేదని.. తమ స్వాతంత్ర్యం, రాజ్యాంగ హక్కుల విషయంలో రాజీ పడలేమని పేర్కొంది. తాము చట్ట ప్రకారమే నడుచుకుంటామని.. ప్రభుత్వ యంత్రాంగం కూడా వాటికి అనుగుణంగానే వ్యవహరించాలని కోరింది. ఈనేపథ్యంలోనే విశ్వవిద్యాలయానికి ఇచ్చే నిధులపై ట్రంప్ యంత్రాంగం కోత విధించింది.

## దుబాయ్‌లో భారత బిలియనీర్‌కు ఐదేళ్ల జైలు

**దుబాయ్:** యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో ప్రముఖ వ్యాపా రవేత్తగా పేరొందిన భారత బిలియనీర్ బల్వీందర్ సింగ్ సాహ్నీ కటకటాలపాలయ్యారు. మనీలాండరింగ్ వ్యవహారానికి సంబంధించిన కేసులో ఆయన దోషిగా తేలడంతో దుబాయ్ కోర్టు ఐదేళ్ల జైలు శిక్ష విధించింది. రూ.కోటి జరిమానాతో పాటు ఆస్తుల స్వాధీనానికి న్యాయస్థానం ఆదేశించింది. అంతేగాక.. శిక్ష పూర్తయిన తర్వాత దేశం నుంచి బహిష్కరించాలంటూ తీర్పు వెలువరించింది. ఆర్ఎస్‌జీ ప్రాపర్టీ డెవలప్‌మెంట్ కంపెనీ వ్యవస్థాపకుడు, ఛైర్మన్ అయిన బల్వీందర్ ఆర్థిక నేరాలకు పాల్పడుతున్నట్లు అభియోగాలు వచ్చాయి. షెల్ కంపెనీలు, ఫోర్జరీ ఇన్‌వాయిస్‌లతో 150 మిలియన్ దిర్హామ్‌ల (భారత కరెన్సీలో దాదాపు రూ.340 కోట్ల) మనీలాండరింగ్‌కు పాల్పడినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈక్రమంలోనే 2024లో బల్వీందర్, మరికొందరిపై కేసు నమోదైంది. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం.. ఆర్థిక మోసాలకు పాల్పడటం నిజమేనని తేల్చింది. అనంతరం బల్వీందర్‌తో పాటు ఇతర నిందితులను దోషులుగా తేల్చుతూ దుబాయ్ ఫోర్త్ క్రిమినల్ కోర్టు తీర్పు వెలువరించింది. బల్వీందర్‌కు ఐదేళ్ల జైలు శిక్ష ఖరారు చేసింది. 5 లక్షల దిర్హామ్‌ల (దాదాపు రూ. 1.14కోట్లు) జరిమానా విధించింది.



ఆర్థిక నేరాలకు పాల్పడినందుకు గానూ.. బిలియనీర్ నుంచి 150 మిలియన్ దిర్హామ్‌ల (దాదాపు రూ. 340 కోట్ల) విలువైన ఆస్తులను జప్తు చేయాలని కోర్టు ఆదేశించింది. శిక్ష పూర్తయిన తర్వాత బల్వీందర్‌ను దేశం నుంచి పంపించాలని స్పష్టంచేసింది. ఈ కేసులో శిక్ష పడిన ఇతర నిందితుల్లో ఈ బిలియనీర్ పెద్ద కుమారుడు కూడా ఉన్నారు. 53 ఏళ్ల బల్వీందర్.. రాజ్ సాహ్నీ గ్రూప్ (ఆర్ఎస్‌జీ) పేరుతో ప్రాపర్టీ డెవలప్‌మెంట్ కంపెనీని స్థాపించారు. ఈ కంపెనీ యూఏఈతో పాటు అమెరికా, భారత్ సహా పలు దేశాల్లో కార్యకలాపాలు సాగిస్తోంది. ఈయనకు దుబాయ్ స్పోర్ట్స్ సిటీలో ఖరీదైన నివాస, వాణిజ్య భవనాలు, ఇతర ప్రాంతాల్లో బహుళ అంతస్తుల సముదాయాలు, ఫైవ్ స్టార్ హోటల్ వంటి ఆస్తులు ఉన్నాయి. దుబాయ్ ఎలైట్ సర్కిల్‌లో 'అబు సబాహ్'గా పేరొందారు. లగ్జరీ కార్లను ఎక్కువగా ఇష్టపడే బల్వీందర్ కొత్త కార్లను కొనుగోలు చేసి వాటిని సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేస్తుంటారు. 2016లో తన రోల్స్ రాయిస్ కార్ కోసం ఏకంగా 33 మిలియన్ దిర్హామ్‌లతో (దాదాపు రూ. 75కోట్లతో) నంబరు ప్లేట్ కొనుగోలు చేసి అంతర్జాతీయ స్థాయిలో వార్తల్లో నిలిచారు. ఆయన ఇన్‌స్టా ఖాతాకు 33లక్షల మంది ఫాలోవర్లు ఉన్నారు.

## పంజాబ్‌లో ఉగ్ర కుట్ర.. భగ్నం చేసిన పోలీసులు

**పంజాబ్ :** పహల్గాం దాడి తర్వాత దేశంలో మరిన్ని ఉగ్రదాడులకు అవకాశం ఉందని భారత నిఘా వర్గాలు వెల్లడించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో భద్రతా బలగాలు, పోలీసులు అప్రమత్తమయ్యారు. పంజాబ్‌లోని అటవీ ప్రాంతం సమీపంలో ఉగ్ర కదలికలు ఉన్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు పెద్దఎత్తున గాలింపు చర్యలు చేపట్టారు. ఉగ్ర స్థావరాలపై జరిపిన దాడుల్లో భారీగా గ్రెనేడ్‌లు, ఐఈడీలు సహా ఉగ్రవాద వైర్‌లెస్ కమ్యూనికేషన్ హార్డ్‌వేర్‌ను స్వాధీనం చేసుకొని ఉగ్రకుట్రను భగ్నం చేసినట్లు వెల్లడించారు. ఉగ్రదాడులకు పంజాబ్‌లోని స్లీపర్ సెల్స్‌ను పునరుద్ధరించడానికి పాకిస్థాన్ నిఘా సంస్థతో అనుబంధం ఉన్న ఉగ్రవాద సంస్థలు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు గుర్తించామని రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ తెలిపారు. మరోవైపు.. కశ్మీర్‌లోని బుద్గాం జిల్లాలో ముష్కరులకు సాయం చేస్తున్న ఇద్దరు సహాయకులను భద్రతా సిబ్బంది అరెస్టు చేశారు. వారి నుంచి పెద్దఎత్తున ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. ఇటీవల జమ్మూకశ్మీర్‌లోని కుప్వారా జిల్లాలో ఉగ్రవాదుల రహస్య స్థావరాన్ని భద్రతా బలగాలు ధ్వంసం చేసి..పెద్దఎత్తున పేలుడు పదార్థాలు, ఆయుధాలు స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. దేశంలో ఉగ్ర కుట్రలకు ఆస్కారం ఉన్నట్లు నిఘా వర్గాలు హెచ్చరిస్తుండడంతో.. దేశంలోని అన్ని రాష్ట్రాల ప్రజలకు సోమవారం కేంద్రం హెచ్చరికలు జారీ చేసింది. యుద్ధ అప్రమత్తతకు పిలుపునిచ్చింది. గగనతల దాడుల గురించి హెచ్చరించే సైరన్ల వ్యవస్థ పనిచేసేలా చూడాలని, ఇతరత్రా స్వీయరక్షణపై




ప్రజలకు అవగాహన కల్పించాలని కేంద్ర హోంశాఖ సోమవారం అన్ని రాష్ట్రాలను, కేంద్రపాలిత ప్రాంతాలను ఆదేశించింది. అత్యవసర సమయాల్లో ఎలా స్పందించాలనే దానిపై పౌరుల్ని సమాయత్తం చేసేందుకు ఈ నెల 7న (బుధవారం) మాక్‌డ్రిల్ నిర్వహించాలని కోరింది. ప్రజలందరినీ ఇందులో భాగం చేయాలని సూచించింది. శత్రుదాడి జరిగినప్పుడు స్వీయరక్షణతో పాటు విద్యార్థులు, యువకులు ఎలా ప్రతిస్పందించాలో అవగాహన కల్పించాలని హోంశాఖ తెలిపింది. వైమానిక దాడులు జరిగితే.. ఎలా వ్యవహరించాలి? ప్రజలు ఆందోళనకు గురికాకుండా వారికి ఎలాంటి సూచనలు చేయాలి? సైరన్ ఇచ్చి ఎలా అప్రమత్తం చేయాలనే అంశంపై మాక్‌డ్రిల్ చేయాలని పేర్కొంది.

### పహల్గాం ఉగ్రదాడి బాధిత కుటుంబానికి

## రాహుల్ పరామర్శ

**హరియాణా :** పహల్గాం ఉగ్రదాడిలో కన్నుమూసిన నేవీ లెఫ్టినెంట్ వినయ్ నర్వాల్ కుటుంబాన్ని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పరామర్శించారు. హరియాణాలోని నర్వాల్ నివాసానికి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు. హరియాణాకు చెందిన వినయ్– హిమాన్షి వివాహం ఏప్రిల్ 16న జరిగింది. 19న విందు నిర్వహించారు. అనంతరం భార్యను తీసుకొని జమ్మూకశ్మీర్‌కు హనీమూన్‌కు వెళ్లారు. తొలుత హనీమూన్ కోసం యూరప్ వెళ్లాలని నిర్ణయించుకున్న ఈ నవ జంట.. తమ వీసాలు రిజెక్ట్ కావడంతో జమ్మూకశ్మీర్‌కు వచ్చింది. ఉగ్రదాడితో ఆమె కలలన్నీ కల్లలయ్యాయి. పెళ్లై వారం కూడా గడవక ముందే.. తన కళ్ల ముందే జీవచ్ఛవంలా మారిన భర్తను చూసి హతాశురాలైంది. అంత్యక్రియల సమయంలో భర్తకు సెల్యూట్ చేస్తూ ఆమె రోదించిన తీరు ప్రతిఒక్కరిని బాధించింది. మరోవైపు పహల్గాం దాడి నేపథ్యంలో ఒక వర్గం వారిని టార్గెట్ చేసేలా వ్యాఖ్యలు చేయొద్దంటూ నర్వాల్ సతీమణి హిమాన్షి విజ్ఞప్తి చేయడంతో సోషల్ మీడియాలో పలువురు ఆమెను ట్రోల్ చేశారు. వారి చర్యలను మహిళా కమిషన్ తీవ్రంగా ఖండించింది. మహిళ గౌరవాన్ని కాపాడే దిశగా చర్యలు తీసుకునేందుకు తాము కట్టుబడి ఉన్నామని పేర్కొంది. తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ సాకేత్ గోఖలే స్పందిస్తూ.. ఆమెపై విద్వేషంతో కూడిన కామెంట్లు చేస్తున్నవారి సామాజిక మాధ్యమ ఖాతాలను బ్లాక్ చేయాలని కేంద్ర ఐటీ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కోరారు.





### ఖరీఫ్ సీజన్ నుంచే

## పాక్‌కు నీటి కటకటా..!

**న్యూఢిల్లీ :** సింధూ నదీ జలాల ఒప్పందాన్ని భారత్ నిలిపివేయడంతో.. ఆ ఎఫెక్ట్ పాక్‌పై ఈ ఏడాది ఖరీఫ్ నుంచే కనిపించనుంది. ఇండస్ రివర్ సిస్టమ్ అథారిటీ (ఐఎస్ఆర్ఏ) వేసిన అంచనాల్లో ఈ విషయం వెల్లడైంది. పాక్‌కు వెళ్లే నీటిలో 21% మేరకు కోత పడొచ్చని పేర్కొంది. ముఖ్యంగా చీనాబ్‌లో నీటి లభ్యతలో తగ్గుదలే దీనికి కారణం అవుతుందని తేల్చింది. ఇప్పటికే సలాల, బగ్లిహార్ డ్యామ్‌ల గేట్లు మూసేయడంతో పాక్‌కు వెళ్లే నీరు చాలావరకు తగ్గింది. మరాల వద్ద నీటి కొరత దృశ్యాలు ఇప్పటికే కనిపిస్తున్నాయి. దీని ప్రభావం ఖరీఫ్ సీజన్‌పై పడనుంది. ఇలాంటి చర్యలే కిషన్ గంగాపై కూడా భారత్ భావిస్తోంది. మే నుంచి సెప్టెంబర్ వరకు ఖరీఫ్ సీజన్‌కు నీటి లభ్యతను అంచనా వేయడానికి ఐఎస్ఆర్ఏ సమావేశమైంది. "మే–జూన్ 10వ తేదీ వరకు ఖరీఫ్ ప్రారంభంలో, ఆ తర్వాత నీటి లభ్యతను సమీక్షించడానికి ఐఎస్ఆర్ఏ సమావేశమైంది. భారత్ నిర్ణయంతో మరాల వద్ద చీనాబ్ నదిలో నీటి లభ్యత పడిపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఇది ఖరీఫ్ ప్రారంభ సీజన్‌లో మరింత నీటి కొరతకు దారితీస్తుంది" అని పేర్కొంది. చీనాబ్, రావి నదుల్లో నీరు సాధారణంగా ప్రవహిస్తేనే మొత్తం పాకిస్థాన్‌కు సీజన్ ప్రారంభంలో 21 శాతం నీరు తగ్గినట్లు అంచనా వేసింది. ఇక రోజువారీ సమీక్షలు జరిపి.. చీనాబ్‌లో నీటి లభ్యత తగ్గితే తమ అంచనా లను మారుస్తామని పేర్కొంది. అక్నూర్‌లో చీనాబ్ నదిలో నీటి ప్రవాహం బాగా తగ్గిపోయింది. దీంతో పర్యాటకులు నది మధ్యలోకి వెళ్లి దిగి ఫొటోలు తీసు కొంటున్నారంటే ప్రవాహం ఎంత తక్కువగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ పరిస్థితికి సలాల్, బగ్లిహార్ డ్యామ్‌ల మూసివేతే కారణంగా నిలిచింది. ఏప్రిల్ 22న పహల్గాంలో ఉగ్రదాడి తర్వాత పాకిస్థాన్‌పై భారత్ కఠిన చర్యలు తీసుకోవడం ప్రారంభించింది. దీనిలోభాగంగా సింధూజలాల ఒప్పందాన్ని నిలిపివేసింది. ఆ దేశంతో వాణిజ్యం, రాకపోకలను నిషేధించింది. గగనతలాన్ని మూసివేసింది. దీంతోపాటు త్రివిధ దళాలు ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేలా ఏర్పాట్లు చేస్తోంది.

## ఎఫ్ఏటీఎఫ్‌లో కూడా పాక్‌కు సెగ

**పాకిస్థాన్ :** పాకిస్థాన్‌ను ఆర్థికంగా ఏకాకి చేసే దిశగా భారత్ చర్యలు వేగవంతం చేసింది. లష్కరే వంటి ఉగ్ర సంస్థలకు ఫండింగ్ చేస్తున్నందుకు తగిన శిక్ష పడేలా భారత్ ప్రయత్నిస్తోంది. తాజాగా ఆర్థిక చర్యల కార్యదళం (ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్‌ఫోర్స్)లో కూడా పాక్‌ను తిరిగి 'గ్రే లిస్ట్'లోకి



చేర్చేందుకు చర్యలు మొదలుపెట్టింది. ప్రస్తుతం ఐఎంఎఫ్ నిధుల కోసం పాక్ చేస్తున్న ప్రయత్నాలకు గండి కొట్టాలంటే ఎఫ్ఏటీఎఫ్ చర్యలే కీలకంగా మారాయి. ఈసారి ఎఫ్ఏటీఎఫ్ భేటీలో పాక్‌పై నిఘాను పెంచాలన్న ప్రతిపాదన భారత్ తీసుకొచ్చే అవకాశం ఉంది. వాస్తవానికి దీనిని గ్రేలిస్ట్‌గా పేర్కొంటారు. ఈ జాబితాలో కొన్నేళ్లపాటు ఉన్న తర్వాత పాక్ 2022లో బయటపడింది. నాడు మనీలాండరింగ్, టెర్రర్ ఫైనాన్స్‌ను అడ్డుకోవడానికి తీసుకొంటున్న చర్యలను చూపించి ఊరట పొందింది. భారత్‌ను ఆర్థికంగా దెబ్బతీయడానికి పాక్ టెర్రర్ ఫైనాన్సింగ్, మనీలాండరింగ్‌కు సహకరించిందన్న ఆధారాలు భారత్ వద్ద ఉన్నట్లు ఎఫ్ఏటీఎఫ్‌లో గతంలో పాల్గొన్న ఓ అధికారి తెలిపారు. వాటిని ప్రపంచ వేదికపై అవసరమైనప్పుడు బయటపెట్టాలన్నారు. ఎఫ్ఏటీఎఫ్‌లో భారత్ సభ్యదేశం. ఇక పాకిస్థాన్ మాత్రం ఆసియా పసిఫిక్ గ్రూప్ ఆఫ్ మనీలాండరింగ్‌లో ఓ భాగం. రానున్న రోజుల్లో పాక్‌కు ఆర్థిక ప్యాకేజీ పై ఐఎంఎఫ్ (అంతర్జాతీయ ద్రవ్యనిధి) బోర్డ్ సమావేశంలో కూడా భారత్ ఈ అంశాన్ని లేవనెత్తనుంది. పహల్గాం దాడి నేపథ్యంలో పాక్‌కు ఆర్థిక ప్యాకేజీని ఇవ్వడాన్ని భారత్ వ్యతిరేకించనుంది. "ఐఎంఎఫ్ బోర్డు, ఎఫ్ఏటీఎఫ్ ఎదుట పెట్టేందుకు ఇప్పటికే ఆధారాలు సేకరించాము. ఉగ్రవాదానికి మద్దతు, ఆశ్రయం ఇచ్చే దేశాలకు అంతర్జాతీయ సంస్థల నుంచి నిధులు వెళ్లకూడదన్న అంశంపై భారత్ గట్టిగా నిలబడనుంది" అని ఓ అధికారి వెల్లడించారు. ఇక ఈ ఏడాది ప్రారంభంలో ఎఫ్ఏటీఎఫ్ సమీక్ష సమయానికి మూడు దేశాలు బ్లాక్‌లిస్ట్‌లో, 25 దేశాలు గ్రేలిస్ట్‌లో ఉన్నాయి.

# ఉత్కంఠ పోరులో గుజరాత్ గెలుపు



## బౌలింగ్‌లో పాట్ కమిన్స్ అదరగొట్టాడు : సంజయ్ బంగర్

ఐపీఎల్ 2025 సీజన్‌లో భాగంగా మంగళవారం దిల్లీ క్యాపిటల్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ తలపడ్డాయి. వర్షం కారణంగా పూర్తి మ్యాచ్ జరగలేదు. దీంతో హైదరాబాద్ బ్యాటింగ్ చేయలేకపోయింది. వరుణుడి రాకతో మ్యాచ్ రద్దు కావడంతో సన్‌రైజర్స్ ప్లేఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించింది. ఈ మ్యాచ్‌లో షమీ గైర్హాజరీతో పాట్ కమిన్స్ బౌలింగ్ ప్రారంభించాల్సి వచ్చింది. కమిన్స్ వరుసగా మూడు ఓవర్లలో మూడు వికెట్లు కూల్చి అద్భుతంగా రాణించాడు. ఈ విషయమై టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్ సంజయ్ బంగర్ తన అభిప్రాయం వ్యక్తం చేశాడు. 'షమీ బదులుగా పాట్ కమిన్స్ కొత్తబంతితో బౌలింగ్ చేయడం సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు అద్భుతంగా కలిసి వచ్చింది. నిజానికి షమీ ప్రత్యర్థులను హడలెత్తిస్తాడు అని కమిన్స్ అతడి మీద నమ్మకం పెట్టుకున్నాడు. కానీ ఈ మ్యాచ్‌లో అతడు అవతలి జట్టును షమీ కన్నా, పాట్ కమిన్సే ఎక్కువ భయపెట్టాడు. వరుసగా మూడు ఓవర్లలో మూడు వికెట్లు తీసి, దిల్లీ క్యాపిటల్స్‌ను హడలెత్తించాడు. నిజానికి పాట్ కమిన్స్ బంతిని స్వింగ్ చేయాలని అస్సలు చూడలేదు. రైట్ ఏరియాస్‌లో వరుసగా బంతులు సంధించాడు' అని సంజయ్ బంగర్ విశ్లేషించాడు. అలాగే ఈ సీజన్‌లో సన్‌రైజర్స్ టీమ్ ప్రదర్శనపై కూడా అతడు మాట్లాడాడు. 'ఈ సీజన్‌ను హైదరాబాద్ ఘనంగానే ప్రారంభించింది. మొదటి మ్యాచ్‌లో వారు 280 పైచిలుకు పరుగులు చేశారు. గత సీజన్‌లోని వీరబాదుడును కొనసాగించబోతున్నాం... అని సంకేతమిచ్చారు. కానీ ప్రతిసారీ వీరబాదుడు ఫార్ములా వర్కౌట్ కాదు. బ్యాటర్లు ఫామ్‌లో ఉన్నప్పుడు ఈ ఫీట్ బాగుంటుంది. కానీ ఎప్పుడైతే వారు ఫామ్‌లో ఉండరో... అప్పుడు మొదటికే మోసం వస్తుంది. సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు విషయంలో ప్రస్తుతానికి ఇదే జరిగింది' అని సంజయ్ బంగర్ విశ్లేషించాడు. నిరుడు అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్ వీరవిహారంతో ఆకాశమే హద్దుగా చెలరేగిపోయిన హైదరాబాద్... ఈ సీజన్‌లో చతికిలపడింది. అలాగే బౌలింగ్‌లో షమీ ప్రదర్శన పేలవంగా ఉంది. తొమ్మిది మ్యాచ్‌లు ఆడిన మహ్మద్ షమీ కేవలం 6 వికెట్లు మాత్రమే తీసుకున్నాడు. ఈ విషయంలో పాట్‌కమిన్సే 13 వికెట్లతో మెరుగ్గా ఉన్నాడు.

## పోరాడి ఓడిన హార్దిక్ సేన



**ముంబయి :** గుజరాత్ టైటాన్స్ అదరగొట్టింది. వాంఖడేలో తీవ్ర ఉత్కంఠ రేపిన మ్యాచ్‌లో ఆ జట్టు.. ముంబయిని ఓడించింది. మంగళవారం వాంఖడేలో వర్ష ప్రభావిత మ్యాచ్‌లో ప్రతికూల పరిస్థితులు ఎదురైనా ఆ జట్టు తగ్గలేదు. మొదట ముంబయి 8 వికెట్లకు 155 పరుగులు చేసింది. విల్ జాక్స్ (53బీ 35 బంతుల్లో 5ఐ4, 3ఐ6), సూర్యకుమార్ (35బీ 24 బంతుల్లో 5ఐ4), కార్బిన్ బోష్ (27బీ 22 బంతుల్లో 1ఐ4, 2ఐ6) రాణించారు. గుజరాత్ బౌలర్లలో సాయికిశోర్ (2/34), రషీద్ ఖాన్ (1/21), అర్షద్ ఖాన్ (1/18), సిరాజ్ (1/29) ఆకట్టుకున్నారు. అనంతరం వర్షం వల్ల రెండోసారి ఆట నిలిచే సమయానికి గుజరాత్ 18 ఓవర్లలో 132/6తో నిలిచింది. మళ్లీ ఆట మొదలయ్యాక సమీకరణం ఒక ఓవర్లో 15 పరుగులుగా మారింది. దీపక్ చాహర్ బౌలింగ్‌లో తొలి బంతికి ఫోర్ కొట్టిన తెవాతియా.. రెండో బంతికి సింగిల్ తీశాడు. మూడో బంతికి కొయెట్జీ (12) సిక్సర్ బాదేశాడు. నాలుగో బంతికి సింగిల్ వచ్చింది. అది నోబాల్. తర్వాత తెవాతియా సింగిల్ తీశాడు. 2 బంతుల్లో 1 పరుగే చేయాల్సి ఉండగా.. కొయెట్జీ అయిదో బంతికి ఔటైపోవడంతో ఉత్కంఠ నెలకొంది. కానీ అర్షద్ ఖాన్ చివరి బంతికి సింగిల్ తీసి ఉత్కంఠకు తెరదించాడు. ఈ బంతికి రనౌట్ అవకాశాన్ని ముంబయి వృథా చేసుకుంది.

వర్షం.. మలుపు.. వర్షం.. మలుపు..: 14 ఓవర్లకు 107/2తో గుజరాత్ పటిష్ట స్థితిలో ఉండగా వర్షం వల్ల తొలిసారి మ్యాచ్ ఆగింది. అప్పటికి శుభ్‌మన్ 38 పరుగులతో, రూథర్‌ఫర్డ్ 26 పరుగులతో క్రీజులో ఉన్నారు. 8 వికెట్లు చేతిలో ఉండగా 6 ఓవర్లలో 49 పరుగులే చేయాల్సి రావడంతో గుజరాత్ విజయం లాంఛనమే అనుకున్నారంతా. డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలోనూ ఆ జట్టు ముందంజలోనే ఉంది. కానీ కాసేపు వర్షం పడ్డాక మ్యాచ్ మళ్లీ మొదలైందో మొత్తం కథ మారిపోయింది. వర్షం ఆగగానే బంతి అందుకున్న బుమ్రా.. నిప్పులు చెరిగే బంతులతో గుజరాత్‌కు చెక్ పెట్టాడు. 2 ఓవర్లలో 13 పరుగులే ఇచ్చి శుభ్‌మన్ (43బీ 46 బంతుల్లో 3ఐ4, 1ఐ6), షారుఖ్ ఖాన్ (6)లను బౌల్డ్ చేశాడు. రూథర్‌ఫర్డ్ (28బీ 15 బంతుల్లో 2ఐ4, 2ఐ6)ను బౌల్ట్ పెవిలియన్ బాట పట్టించాడు. రషీద్ ఖాన్ (2) సైతం ఎంతోసేపు నిలవలేదు. 18 ఓవర్లకు 132/6తో టైటాన్స్ ఓటమి బాటలో సాగుతున్న దశలో మ్యాచ్ మరోసారి వర్షం వల్ల ఆగింది. ఛేదన ఆరంభంలోనే సుదర్శన్ (5) ఔటైనప్పటికీ.. బట్లర్ (30బీ 27 బంతుల్లో 3ఐ4, 1ఐ6), రూథర్‌ఫర్డ్‌లతో కీలక భాగస్వామ్యాలు నెలకొల్పిన గిల్.. జట్టును గెలుపు బాటలో నడిపించాడు. తొలిసారి వర్షం పడ్డాక గుజరాత్ అనూహ్యంగా తడబడి మ్యాచ్‌ను దూరం చేసుకునేలా కనిపించినా.. రెండోసారి వర్షం పడ్డాక విజయం ఆ జట్టునే వరించింది.



ముంబయి కట్టడి: మొదట టాస్ ఓడి బ్యాటింగ్ చేసిన ముంబయి.. ఆరంభంలో తడబడి.. ఆ తర్వాత పుంజుకుని.. ఇన్నింగ్స్ ద్వితీయార్ధంలో తీవ్రంగా ఇబ్బంది పడి ఓ మోస్తరు స్కోరుకు పరిమితమైంది. సూపర్ ఫామ్‌లో ఉన్న రికిల్‌టన్ (2)ను తొలి ఓవర్లోనే ఔట్ చేసి ముంబయిని గట్టి దెబ్బ తీశాడు సిరాజ్. మరో ఓపెనర్ రోహిత్ సైతం వాంఖడేలో తన ఆట చూసేందుకు వచ్చిన అభిమానులను నిరాశకు గురి చేస్తూ 7 పరుగులకే ఔటైపోయాడు. 26 పరుగులకే 2 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడ్డ ముంబయిని విల్ జాక్స్, సూర్యకుమార్ జోడీ ఆదుకుంది. ముఖ్యంగా జాక్స్ ఆరంభం నుంచే ధాటిగా ఆడుతూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. సూర్యకుమార్ సైతం తనదైన శైలిలో షాట్లు ఆడుతూ బౌలర్లపై ఆధిపత్యం చలాయించాడు. గుజరాత్ బౌలర్లు చక్కగా బౌలింగ్ చేసినా.. ఫీల్డింగ్ వైఫల్యం వల్ల ఆ జట్టుకు వికెట్లు దక్కలేదు. ఖాతా తెరవకముందే జీవనదానం పొందిన జాక్స్‌కు 29 పరుగుల వద్ద మరో అవకాశం లభించింది. సూర్య క్యాచ్ సైతం ఒకటి చేజారింది. 97/2తో ముంబయి మెరుగైన స్థితికి చేరుకోగా.. స్పిన్నర్ సాయికిశోర్ 11వ ఓవర్లో సూర్యను ఔట్ చేసి గుజరాత్‌కు బ్రేక్ ఇచ్చాడు. ఇక్కడ్నుంచి ముంబయి క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయింది. అర్ధశతకం పూర్తి చేసిన జాక్స్‌ను రషీద్ ఔట్ చేయగా.. హార్దిక్ (1) వికెట్‌ను సైతం సాయికిశోర్ తన ఖాతాలో వేసుకున్నాడు. నమన్ ధీర్ (7) కూడా నిలవకపోవడంతో 18 ఓవర్లకు ముంబయి 7 వికెట్లు కోల్పోయి 129 పరుగులే చేసింది. అయితే చివరి 2 ఓవర్లలో బోష్ ధాటిగా ఆడడంతో ముంబయి 150 మార్కును దాటింది.




## పేటీఎం నష్టం రూ.545 కోట్లు
### ఆదాయంలోనూ క్షీణత

ప్రముఖ ఫిన్‌టెక్ సంస్థ పేటీఎం (వన్97 కమ్యూనికేషన్స్) త్రైమాసిక ఫలితాలను ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మార్చితో ముగిసిన త్రైమాసికంలో కంపెనీ రూ.545 కోట్ల నష్టాన్ని నమోదు చేసింది. గతేడాది ఇదే త్రైమాసికంలో ఈ మొత్తం రూ.551 కోట్లుగా ఉన్నట్లు కంపెనీ తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో తెలిపింది. నష్టం స్వల్పంగా తగ్గింది. అంతకుముందు త్రైమాసికంలో రూ.208 కోట్ల నష్టంతో పోలిస్తే నష్టాలు భారీగా పెరిగాయి. కార్యకలాపాల ద్వారా వచ్చే ఆదాయం కూడా 15.7 శాతం క్షీణించి రూ.1911.5 కోట్లుగా నమోదైంది. 2023 జనవరి- మార్చి త్రైమాసికంలో ఈ మొత్తం రూ.2267.1 కోట్లుగా ఉంది. వార్షిక ప్రాతిపదికన చూసినప్పుడు 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.1390.4 కోట్లుగా ఉన్న నష్టం 2024-25 నాటికి దాదాపు సగానికి అంటే రూ.645.2 కోట్లకు తగ్గింది. ఇదే ఆర్థిక సంవత్సరంలో రెండో త్రైమాసికంలో జొమాటోకు తన ఎంటర్‌టైన్‌మెంట్ టికెటింగ్ వ్యాపారాన్ని విక్రయించడం ద్వారా రూ.1,345 కోట్ల లాభాన్ని నమోదు చేసింది. లేదంటే నష్టం మరింత ఎక్కువగా ఉండేది. పేటీఎం వార్షికాదాయం సైతం రూ.9,977.8 కోట్ల నుంచి రూ.6,900 కోట్లకు తగ్గుముఖం పట్టింది. ఫలితాల వేళ మంగళవారం మార్కెట్ ముగిసే సమయానికి ఎన్‌ఎస్‌ఈలో పేటీఎం షేరు విలువ 5.72 శాతం మేర క్షీణించి రూ.816.50 వద్ద ముగిసింది.

## రెండ్రోజుల లాభాలకు విరామం




**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. మాక్‌డ్రిల్స్ నిర్వహించాలంటూ కేంద్రం ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో భారత్- పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు తలెత్తొచ్చన్న అంచనాలతో మదుపర్లు అప్రమత్తత పాటించారు. దీనికి తోడు తమ దేశంలో ఔషధాల ఉత్పత్తికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఉత్తర్వులు జారీ చేయడంతో ఆ ప్రభావం మన ఫార్మా స్టాక్స్‌పై పడింది. వడ్డీ రేట్లపై బుధవారం అమెరికా ఫెడరల్ రిజర్వ్ నుంచి నిర్ణయం వెలువడనుండడంతో మదుపర్లు ఆచితూచి వ్యవహరిస్తున్నారని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఈ క్రమంలో రెండ్రోజుల వరుస లాభాలకు బ్రేక్ పడింది. నిఫ్టీ 24,400 దిగువకు చేరింది. సెన్సెక్స్ ఉదయం 80,907.24 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 80,796.84) స్వల్ప లాభాల్లో ప్రారంభమైంది. కాసేపటికే నష్టాల్లోకి జారుకుంది. ఇంట్రాడేలో 80,481.03 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరికి 155.77 పాయింట్ల నష్టంతో 80,641.07 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 81.55 పాయింట్ల నష్టంతో 24,379.60 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 84.43గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ఎటర్నల్, టాటా మోటార్స్, ఎస్‌బీఐ, అదానీ పోర్ట్స్, ఎన్టీపీసీ షేర్లు నష్టాల్లో ముగిశాయి. భారతీ ఎయిర్‌టెల్, టాటా స్టీల్, మహీంద్రా మహీంద్రా, హిందుస్థాన్ యూనిలీవర్, నెస్లే ఇండియా షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 61.88 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు మళ్లీ 3,400 డాలర్లకు చేరువవుతోంది. ప్రస్తుతం 3,391 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

## 70% టీసీఎస్ ఉద్యోగులకు
## నూరు శాతం వేరియబుల్ పే

ప్రముఖ ఐటీ సేవల సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ జనవరి- మార్చి త్రైమాసికానికి వేరియబుల్ పే అలవెన్స్‌ను చెల్లించింది. మొత్తం ఉద్యోగుల్లో 70 శాతం మందికి నూరు శాతం చెల్లింపులు చేసినట్లు టీసీఎస్ తెలిపింది. తమ తమ వ్యాపార విభాగాల పనితీరు ఆధారంగా మిగిలిన ఉద్యోగులకు వేరియబుల్ పే చెల్లింపులు చేసినట్లు పేర్కొంది. ప్రతి త్రైమాసికంలోనూ టీసీఎస్ ఇదే విధానాన్ని అవలంబిస్తోందని ఓ ప్రకటనలో తెలిపింది. మరోవైపు ఇటీవల మార్చి నెల త్రైమాసిక ఫలితాలను ప్రకటించిన టీసీఎస్.. రూ.12,224 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. మార్జిన్లు తగ్గడంతో నికర లాభం 1.7 శాతం మేర క్షీణించింది. ఆదాయం మాత్రం గతేడాదితో పోలిస్తే 5.3 శాతం వృద్ధితో రూ.64,479 కోట్లుగా నమోదైంది. అయితే, త్రైమాసిక ఫలితాల సందర్భంగా 6.07 లక్షల మంది ఉద్యోగులకు వార్షిక వేతన పెంపును వాయిదా వేసినట్లు ప్రకటించింది. సుంకాల కారణంగా నెలకొన్న అనిశ్చితిని ఇందుకు కారణంగా చూపింది. సాధారణంగా ఏప్రిల్ నెలలో వేతన పెంపు ఉంటుంది. ఈసారి ఎప్పుడు చెల్లించేదీ మాత్రం టీసీఎస్ వెల్లడించలేదు.







## 2 లక్షల పుస్తకాలు రూ.7 కోట్లు..
### వివాదంలో యూనియన్ బ్యాంక్

ప్రభుత్వరంగానికి చెందిన యూనియన్ బ్యాంక్ వివాదంలో చిక్కుకుంది. భారత ప్రభుత్వానికి గతంలో ముఖ్య ఆర్థిక సలహాదారుగా వ్యవహరించిన కృష్ణమూర్తి వి సుబ్రమణియన్ రచించిన పుస్తకానికి సంబంధించి దాదాపు 2 లక్షల కాపీలను రూ.7.25 కోట్లకు కొనుగోలు చేసిందని ప్రముఖ ఆంగ్లపత్రిక 'ఎకనమిక్ టైమ్స్' పేర్కొంది. అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పదవి నుంచి ఇటీవల భారత ప్రభుత్వం కేవీ సుబ్రమణియన్‌ను తప్పించిన వేళ ఈ వ్యవహారం వెలుగు చూడడం గమనార్హం. భారత ప్రభుత్వానికి సీఈఏగా వ్యవహరించిన సుబ్రమణియన్ గతేడాది 'ఇండియాఏ100' పుస్తకాన్ని రచించారు. ఈ పుస్తకాన్ని కస్టమర్లకు, కార్పొరేట్లకు, స్కూళ్లకు, కాలేజీలకు, లైబ్రరీలకు పంపిణీ చేయాలని యూనియన్ బ్యాంక్ సెంట్రల్ ఆఫీసు నిర్ణయించింది. ఇందులో భాగంగా 1,89,450 పేపర్ బ్యాక్‌లను రూ.350 చొప్పున, 10,422 హార్డ్‌కవర్ కాపీలను రూ.597 చొప్పున కొనుగోలు చేసేందుకు ఆర్డర్ చేసింది. ఇందుకోసం రూ.7 కోట్లు వెచ్చించాలని నిర్ణయించింది. వాస్తవానికి 2024 ఆగస్టులో ఈ పుస్తకం విడుదల కాగా.. విడుదలకు ముందే ఈ పుస్తకాన్ని ప్రచురించిన రూపా పబ్లికేషన్స్‌కు యూనియన్ బ్యాంక్ 50 శాతం చెల్లింపులు చేసినట్లు 'ఈటీ' పేర్కొంది. సాధారణంగా ఓ ఇంగ్లిష్ కాపీ పుస్తకం 10 వేల కాపీలు దాటడం అరుదు. అలాంటిది 2 లక్షల కాపీలకు యూనియన్ బ్యాంక్ ఆర్డర్ పెట్టడం ప్రశ్నలు రేకెత్తిస్తోంది. బ్యాంకుకు చెందిన 18 జోనల్ కార్యాలయాల నుంచి పదేసి వేల కాపీలు చొప్పున ఈ ఆర్డర్ రావడం అనుమానాలను పెంచుతోంది. 2018 నుంచి 2021 వరకు ప్రభుత్వానికి ఆర్థిక సలహాదారుగా వ్యవహరించిన సుబ్రమణియన్‌ను 2022లో ఐఎంఎఫ్ ఎగ్జిక్యూటివ్‌గా భారత్ నియమించింది. మూడేళ్ల పదవీ కాలానికి గానూ ఇంకా ఆరు నెలలు మిగిలి ఉండగానే ఈ ఏడాది 30న రీకాల్ చేసింది. తొలుత ఇతరత్రా కారణాలు వినిపించినప్పటికీ.. బహుశా ఈ పుస్తకాన్ని ప్రమోట్ చేయడంలో అవకతవకలు ఉండొచ్చన్న అనుమానాలు బలపడుతున్నాయి. మరోవైపు సుబ్రమణియన్ తొలగింపుపై ఐఎంఎఫ్ స్పందించింది. అది పూర్తిగా భారత ప్రభుత్వ నిర్ణయమని పేర్కొంది. సుబ్రమణియన్ తొలగింపుతో ఏర్పడిన ఖాళీని పరమేశ్వరన్ అయ్యర్‌తో భారత్ భర్తీ చేసింది.

# ఆ వార్తల్లో నిజం లేదు.. : సమంత



నటిగా తనని తాను నిరూపించుకున్న సమంత నిర్మాతగా అదృష్టం పరీక్షించుకోనున్నారు. తన నిర్మాణ సంస్థ 'ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్'లో రూపొందిన తొలి సినిమా 'శుభం'. హర్షిత్ రెడ్డి, గవిరెడ్డి శ్రీనివాస్, చరణ్ పేరి, శ్రియ కొంతం తదితరులు ప్రధాన పాత్రల్లో దర్శకుడు ప్రవీణ్ కండ్రేగుల తెరకెక్కించారు. ఈ హారర్ కామెడీ మూవీ ఈ నెల 9న బాక్సాఫీసు ముందుకు రానుంది. ఈ సందర్భంగా సమంత.. మీడియాతో ముచ్చటించారు. ఇకపై వ్యక్తిగత జీవితం గురించి మాట్లాడకూడదని నిర్ణయించుకున్నట్టు సమంత తెలిపారు. ఓ యువకుడు తనకు గుడి కట్టాడన్న విషయం తెలిసిందన్న ఆమె.. అభిమానుల ప్రేమను స్వీకరిస్తానని, అలాంటి వాటిని ప్రోత్సహించనని పేర్కొన్నారు. అల్లు అర్జున్– అట్లీ కాంబినేషన్ మూవీ గురించి మాట్లాడుతూ.. "నేను ఆ సినిమాలో నటిస్తున్నానంటూ వచ్చిన వార్తల్లో నిజం లేదు. దర్శకుడు అట్లీ నాకు స్నేహితుడు. భవిష్యత్తులో అవకాశం ఉంటే అతడి చిత్రాల్లో నటిస్తా" అని అన్నారు. "శుభం' సినిమాని 8 నెలల్లో పూర్తి చేశాం. కొత్త కథలు చెప్పాలి. కొత్త వారికి అవకాశం ఇవ్వాలన్నది 'ట్రాలాలా' ముఖ్య ఉద్దేశం. నటిగా స్టార్‌డమ్ వచ్చినా.. చిత్ర పరిశ్రమ కోసం ఏదో చేయాలనే ఆలోచన వెంటాడేది. అందుకే కాస్త విరామం తీసుకుని.. నిర్మాత కావాలని ఫిక్స్ అయ్యా. నా నిర్మాణ సంస్థలో రూపొందిన తొలి సినిమాలో నేను నటించకూడదని నిర్ణయించుకున్నా. కానీ, అతిథి పాత్ర కోసం ఎవరినీ అడగలేక నేనే నటించా. 'శుభం' టీమ్‌ని చూస్తుంటే నాకు 'ఏమాయ చేసావె' రోజులు గుర్తొచ్చాయి. నటిగా నా తదుపరి సినిమా 'మా ఇంటి బంగారం' త్వరలో ప్రారంభమవుతుంది" అని తెలిపారు.



# కర్నాటకలో షూటింగ్ ముగించిన ఎన్టీఆర్



జూనియర్ ఎన్టీఆర్ ప్రస్తుతం ప్రశాంత్ నీల్ సినిమాతో ఫుల్ బిజీగా గడిపేస్తున్నాడు. కర్ణాటకలో మొన్నటి వరకు షూటింగ్ నిర్వహించారు. షూటింగ్ సెట్స్ నుంచి తాజాగా ఎన్టీఆర్ హైదరాబాద్ చేరుకున్నారు. ఈ సందర్భంగా ఎయిర్ పోర్ట్ వద్ద ఎన్టీఆర్ స్టైలిష్ లుక్ లో కనిపించారు. చూస్తుంటే చాలా రగ్గడ్ లుక్ లో ఉన్నారు. కాస్త బక్కగా మారిపోయిన ఎన్టీఆర్.. గుబురు గడ్డంతో కొత్త లుక్ లోకి మారిపోయాడు. ఇందుకు సంబంధించిన పిక్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. జూనియర్ ఎన్టీఆర్ ఇలాంటి లుక్ లో గతంలో కనిపించాడు. మళ్లీ ఇప్పుడే కనిపిస్తున్నాడు. ఓ వైపు వార్–2 పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. అది ఇంకా రిలీజ్ కాకముందే ప్రశాంత్ నీల్ మూవీని సెట్స్ మీదకు తీసుకెళ్లాడు. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా జరుపుకుంటోంది. 2026 జూన్ 25న రిలీజ్ చేస్తున్నట్టు– ఇప్పటికే ప్రకటించారు. త్వరలోనే విదేశాల్లో షూటింగ్ ఉంటుందనే ప్రచారం జరుగుతోంది. ప్రశాంత్ నీల్ మూవీ అంటే కచ్చితంగా ఎలివేషన్లు ఉండాల్సిందే. ఇప్పుడు జూనియర్ ఎన్టీఆర్ కు ఎలాంటి ఎలివేషన్లు ఉంటాయో చూడాలి. ఈ మూవీలో ఇంకా నటీ–నటు–లను తీసుకుంటూనే ఉన్నారు.

# టూరిస్ట్ బస్సులో మోహన్‌లాల్ కొత్త సినిమా.. నిర్మాత ఫిర్యాదు



సినీ పరిశ్రమకు శాపంగా మారిన పైరసీ భూతం తాజాగా మోహన్‌లాల్ కొత్త చిత్రాన్నీ వదల్లేదు. మోహన్‌లాల్ హీరోగా తరుణ్‌మూర్తి తెరకెక్కించిన చిత్రం 'తుడరుమ్'. ఇటీవల ప్రేక్షకుల ముందుకువచ్చిన ఈ సినిమా మంచి విజయాన్ని సొంతం చేసుకొని మలయాళ ఇండస్ట్రీలో రికార్డులు సృష్టిస్తోంది. తాజాగా ఈ సినిమాను ఓ టూరిస్ట్ బస్సులో ప్రదర్శించారు. దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. దీనిపై నిర్మాత చట్టపరమైన చర్యలకు సిద్ధమయ్యారు. కేరళలోని మలప్పురానికి చెందిన ఓ టూరిస్ట్ బస్సులో ఈ చిత్రం పైరసీని ప్రదర్శించారు. ఈ విషయంపై నిర్మాత ఎం.రంజిత్ సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేరళ మంత్రి సాజిచెరియన్ స్పందిస్తూ.. సరైన ఆధారాలు చూపితే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## 10 రోజుల్లో రూ.160 కోట్లు!

భారీ అంచనాల మధ్య 'తుడరుమ్' ఏప్రిల్ 25న ప్రేక్షకుల ముందుకువచ్చింది. విడుదలైన నాటినుంచే మంచి కలెక్షన్లను తన ఖాతాలో వేసుకుంటోంది. ఇప్పటివరకూ రూ.160 కోట్లు వసూలు చేసి మలయాళంలో అత్యధిక కలెక్షన్లు సాధించిన చిత్రాల జాబితాలో చేరింది. 'తుడరుమ్'లో మోహన్‌లాల్ సరసన శోభన నటించారు. 38 ఏళ్ల తర్వాత ఈ జంట థియేటర్‌లలో సందడి చేయడంతో వారి అభిమానులు ఫిదా అవుతున్నారు. ఇందులో మోహన్‌లాల్ ట్యాక్సీ డ్రైవర్‌గా, మరోవైపు ఓ సాధారణ భర్తగా కనిపించి నవ్వులు పూయించారు.

# ఆ విషయంలో జాగ్రత్తపడతా..
# డ్రీమ్ రోల్ అదే : కేతికాశర్మ

**హైదరాబాద్ :** తొలి పరిచయంలోనే 'రొమాంటిక్' బ్యూటీ అనిపించుకుంది. 'అదిదా సర్‌ప్రైజ్'తో తనలోని డ్యాన్సర్‌ని పరిచయం చేసింది. ఇప్పుడు పూర్వ పాత్రతో సందడి చేసేందుకు సిద్ధమైంది. ఆ హీరోయిన్ మరెవరో కాదు కేతికా శర్మ. శ్రీవిష్ణు సరసన ఆమె నటించిన చిత్రం 'సింగిల్'. ఇవానా మరో హీరోయిన్. కార్తీక్ రాజు దర్శకత్వం వహించిన ఈ సినిమా శుక్రవారం విడుదల కానుంది. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన ఆమె.. తన డ్రీమ్ రోల్, తాను నటించిన స్పెషల్ సాంగ్ విషయంలో వచ్చిన విమర్శలపై స్పందించింది. "గీతా ఆర్ట్స్'లో నటించాలనే నా కోరిక 'సింగిల్' సినిమాతో నెరవేరింది. ఈ రొమాంటిక్ మూవీలో నేను పూర్వ పాత్రలో కాస్త సీరియస్‌గా కనిపిస్తా. ప్రాక్టికల్‌గా ఉండే అమ్మాయి పూర్వ. ఓ కారు షోరూమ్‌లో పనిచేస్తుంటుంది. శ్రీవిష్ణుతో కలిసి నటించడం ఇదే తొలిసారి. ఆయన చాలా సింపుల్‌గా, సరదాగా ఉంటారు. ప్రిపరేషన్ లేకుండా కొన్ని సంభాషణలను సహజంగా చెప్పేవారు. ఆయన కామెడీ టైమింగ్‌ను అందుకోవడం నాకు కొంచెం కష్టమనిపించేది. ఇవానా క్యూట్ గర్ల్. ఈ సినిమా వల్ల మేం మంచి స్నేహితులమయ్యాం. ఈ మూవీలో నేను ఆమెను డామినేట్ చేస్తానా? ఆమె నన్ను డామినేట్ చేస్తుందా?పక్కన పెడితే ఇందులోని కంటెంట్ ప్రేక్షకుల్ని డామినేట్ చేస్తుంది" "రాబిన్‌హుడ్'లో నేను నటించిన 'అదిదా సర్‌ప్రైజ్' సాంగ్‌కు మంచి స్పందన రావడం ఆనందంగా ఉంది. అభిమానులు ఆశిస్తున్నట్టుగా.. 'సింగిల్'లో డ్యాన్స్ ప్రాధాన్యం ఉన్న పాటల్లేవు. నేను.. నటిగా దర్శకులు ఏది చెబితే అది చేస్తా. అయితే, 'అదిదా సర్‌ప్రైజ్' విషయంలో వివాదం నెలకొంది. ఈసారి అలాంటి పాటలు ఎంపిక చేసుకుంటే స్టెప్పుల విషయంలో ఒకటికి రెండు సార్లు ఆలోచించి, జాగ్రత్త పడతా. కెరీర్ పరంగా నేను హ్యాపీ. ప్రతి సినిమా విషయంలో.. నన్ను నేను తెరపై చూసుకునేందుకు ఆసక్తి చూపిస్తుంటా. ప్రేక్షకులకు ఏ సినిమా నచ్చుతుందో, ఏది నచ్చదో అన్నది మన చేతుల్లో ఉండదు. వచ్చిన అవకాశాలు సద్వినియోగం చేసుకుంటూ నట ప్రయాణాన్ని ఆస్వాదిస్తున్నా. ఎక్కువగా కమర్షియల్ చిత్రాల్లో నటించిన నేను త్వరలో నటనకు అధిక ప్రాధాన్యం ఉన్న సినిమాలో నటించనున్నా. ఆ మూవీ వివరాలు త్వరలో ప్రకటిస్తా. రష్మిక ప్రధాన పాత్రలో 'గర్ల్‌ఫ్రెండ్' సినిమా తెరకెక్కుతోంది. అందులోని ఆమె రోల్ నాకు బాగా నచ్చింది. పెర్ఫామెన్స్‌కు స్కోప్ ఉన్న అలాంటి పాత్ర పోషించాలనేది నా డ్రీమ్" అని కేతిక తెలిపింది.



# తండ్రి కాబోతున్న వరుణ్ తేజ్

ప్రేమ పెళ్లి చేసుకున్ని మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్, హీరోయిన్ లావణ్య త్రిపాఠి అందరికి షాక్ ఇచ్చారు. చాలా కాలంగా లవ్‌లో ఉన్నఈ జంట తమ బంధాన్ని సీక్రెట్ గా ఉంచారు. వరుణ్ తేజ్ – లావణ్య మధ్య ఏదో నడుస్తోందని మీడియా కోడై కూసింది. మెగా కాంపౌండ్‌లో లావణ్య త్రిపాఠి ఎక్కుగా కనిపిస్తుండటం.. మెగా –అల్లు కుటుంబాలలో ఏ శుభకార్యం జరిగినా పాల్గొనడంతో ఈ అనుమానాలకు తావిచ్చింది. ఇద్దరూ ఈ గాసిప్స్‌పై మౌనంగానే ఉన్నారు. కానీ మొత్తనికి తమ రిలేషన్‌పై మౌనం వీడిన వరుణ్ – లావణ్య పెద్దల అంగీకారంతో ఒకటయ్యారు. ఇక తాజాగా ఈ యంగ్ కపుల్స్ కు సంబంధించి ఓ ఆసక్తికరమైన వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ జంట త్వరలో తల్లిదండ్రులు కాబోతున్నారు. ఈ విషయాన్ని స్వయంగా వరుణ్ తేజ్, లావణ్య అఫీషియల్ గా ప్రకటించేసారు. ఒక బ్యూటిఫుల్ పిక్ ని షేర్ చేసుకొని తాము అతి త్వరలోనే తల్లిదండ్రులు కాబోతున్నట్టుగా రివీల్ చేశారు. వరుణ్ కూడా 'జీవితంలో అత్యంత అందమైన పాత్ర పోషించనున్నాను' అని క్యాప్షన్ పెట్టేశాడు. ప్రస్తుతం ఈ పోస్ట్ వైరల్ అవుతుండగా సినీ ప్రముఖులు ఈ జంటకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. మొత్తనికి వరుణ్ తండ్రి కాబోతున్నాడు. మెగా ఫ్యామిలి లోకి మరో వారసుడు రాబోతున్నారు. మొన్నటి వరకు వైరల్ అవుతున్న ఈ వార్త కన్ఫర్మ్ అయ్యింది.

# క్యాథరిన్ థెస్రాకు బంపర్ ఆఫర్

టాలీవుడ్‌లో అందం అభినయంతో ఆకట్టుకొనే గ్లామర్ హీరోయిన్ లో క్యాథరిన్ త్రెసా ఒకరు. 'చమ్మక్ చలో' మూవీతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ– ఇచ్చి నానితో 'పైసా', అల్లు అర్జున్‌తో 'ఇద్దరు అమ్మాయిలతో', 'రుద్రమదేవి', 'సరైనోడు' వంటి చిత్రాల్లో నటించింది. వరుస విజయాలతో దూసుకెళ్లిన క్యాథరిన్ తెరపై కనిపించి చాలాకాలం అవుతుంది. అవకాశాలు తగ్గడంతో సైలెంట్ అయిపోయింది. సోషల్ మీడియాలో కూడా కనిపించడం లేదు. ఇక తాజాగా ఈ అమ్మడు బంపర్ ఆఫర్ కొట్టేసింది.. మెగాస్టార్ చిరంజీవి, దర్శకుడు అనిల్ రావిపూడి కాంబోలో మంచి ఫ్యామిలీ మూవీ తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. ఈ సినిమా షూటింగ్ మే లాస్ట్ వీక్ లో ప్రారంభం కానుంది. పూజా కార్యక్రమాలు, ఓపెనింగ్ అయిపోయింది కాబట్టి నేరుగా సెట్స్ లోకి వెళ్ళిపోతారు. ఇక ముందు నుంచి వైరల్ అవుతున్నట్లు–గా మెయిన్ హీరోయిన్‌గా నయనతార ఒకే అయిన విషయం తెలిసిందే. ఇక రెండో కథానాయికగా క్యాథరిన్ త్రెస్సా ఓకే అయ్యిందట.






# 'హరి హర వీరమల్లు' షూటింగ్ పూర్తి : నిర్మాత ట్వీట్

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్.. ఇప్పటికే ప్రకటించిన 'హరిహర వీరమల్లు' పార్ట్ 1 సినిమా చిత్రీకరణ పూర్తి చేశారు. ఆఖరి షెడ్యూల్‌లో.. రెండు రోజులపాటు షూటింగ్‌లో పాల్గొన్నారు. షూటింగ్ కంప్లీట్ అయిందనే విషయాన్ని సోషల్ మీడియా వేదికగా తెలియజేస్తూ నిర్మాత ఎ.ఎం. రత్నం ఆనందం వ్యక్తం చేశారు. "చిత్రీకరణ పూర్తయింది. ఇక థియేటర్లలో విడుదల కావడమే తరువాయి. బ్లాక్‌బస్టర్ సాంగ్స్, అదిరిపోయే ట్రైలర్ త్వరలో విడుదలవుతాయి" అని తెలిపారు. ఇప్పటికే పలుమార్లు వాయిదా పడుతూ వచ్చిన ఈ చిత్రాన్ని మే 9న విడుదల చేస్తున్నామంటూ కొన్ని రోజుల క్రితం టీమ్ ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే, కొంత షూటింగ్ మిగిలి ఉండడంతో మరోసారి వాయిదా వేసింది. కొత్త విడుదల తేదీ వివరాలు త్వరలో వెల్లడించనున్నారు. ఇప్పటికే రీ రికార్డింగ్, డబ్బింగ్, వీఎఫ్ఎక్స్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ సినిమాని క్రిష్ కొంత భాగం తెరకెక్కించిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత ప్రొడ్యూసర్ రత్నం తనయుడు జ్యోతికృష్ణ దర్శకత్వ బాధ్యతలు తీసుకున్నారు. పవన్ ఇందులో చారిత్రక యోధుడిగా మునుపెన్నడూ చూడని శక్తిమంతమైన పాత్రలో కనిపించనున్నారు. నిధి అగర్వాల్ హీరోయిన్. బాబీ దేవోల్, అనుపమ్ ఖేర్, సత్యరాజ్ తదితరులు కీలక పాత్రలు పోషించారు.

Printed, Published and Owned by **RAVU RAJITHA**, **Editor: RAVU NAGI REDDY**. **RAJAMUDRA PUBLICATIONS**, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98,
**RNI NO : TELTEL/2024/86684**, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com